ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం 05.10.2025 | సంపుటి : 12 సంచిక : 76 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## అమెరికాలో మళ్లీ గన్‌కల్చర్

### తెలంగాణ విద్యార్థి కాల్చివేత



- టెక్సాస్ రాష్ట్రం డల్లాస్‌లో దుండగుడి ఘాతుకం
- బాధిత కుటుంబానికి అండగా నిలబడతాం
- సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి

**హైదరాబాద్(జనంసాక్షి):**అమెరికాలో దారుణం చోటుచేసుకుంది. టెక్సాస్ రాష్ట్రం డల్లాస్‌లో జరిగిన కాల్పుల్లో తెలుగు వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. గురువారం రాత్రి ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాద్, మీర్‌పేట్ టీచర్స్ కాలనీకి చెందిన 35 ఏళ్ల పోలె చంద్రశేఖర్ కొన్నేళ్ల క్రితం అమెరికా వెళ్లాడు. డల్లాస్‌లోని ఓ గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్‌లో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి అతడు డ్యూటీలో ఉండగా ఊహించని దారుణం జరిగింది. ఓ వ్యక్తి అకస్మాత్తుగా చంద్రశేఖర్‌పై కాల్పులకు తెగబడ్డాడు. బుల్లెట్ గాయాల కారణంగా చంద్రశేఖర్ చనిపోయాడు. నల్లజాతీయుడు వచ్చి విచక్షణారహితంగా కాల్పులు జరిపినట్లు మిగతా 2లో..

### లండన్‌లో గుండెపోటుతో తెలంగాణ యువకుడు మృతి

2లో..



## ఆక్రమణలపై ఆగని పంజా

### కొండాపూర్‌లో 36 ఎకరాల్లో హైడ్రా కూల్చివేతలు

- హైకోర్టు తీర్పుతో తాత్కాలిక షెడ్ల తొలగింపు
- రూ.3600 కోట్ల విలువైన భూమి స్వాధీనం



**హైదరాబాద్(జనంసాక్షి):**భాగ్యనగరంలో హైడ్రా అధికారుల కూల్చివేతలు కొనసాగుతున్నాయి. వరుసగా అక్రమ నిర్మాణాలపై హైడ్రా అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. శనివారం కొండాపూర్‌లో హైడ్రా అధికారులు కూల్చివేతలు చేపట్టారు. కొండాపూర్‌లోని బిక్షపతి నగర్‌లో అక్రమ నిర్మాణాలను కూల్చివేసారు. ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్నారు హైడ్రా సిబ్బంది. భారీ పోలీస్ బందోబస్తు నడుమ కూల్చివేతలు చేపట్టారు. కూల్చివేతల వద్దకు మీడియాని పోలీసులు అనుమతించడం లేదు. రెండు కిలోమీటర్ల దూరంలోనే మీడియాను, స్థానికులను పోలీసులు అడ్డుకుంటున్నారు. కోర్టు ఆదేశాలతో హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో హైడ్రా భారీగా కూల్చివేతలు చేపట్టింది. ఆర్టీఏ కార్యాలయం పక్కన భిక్షపతి నగర్‌లో ఉన్న 36 ఎకరాల ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలను మిగతా 2లో..




## రేపటి నుంచి ఆర్టీసీ బస్సుల్లో ఛార్జీల మోత

- హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలో అమలు
- సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్ ప్రెస్, ఈ-ఆర్డినరీ, ఈ-ఎక్స్‌ప్రెస్‌లో పెంపు
- ఆర్టీసికి దసరా బొనాంజా
- రూ.110 కోట్ల ఆదాయం రాక

**హైదరాబాద్(జనంసాక్షి):** దసరా పండుగ తరువాత ఆర్టీసీ నగరవాసులకు షాకిచ్చింది. హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలో తిరిగే ఆర్టీసీ బస్సుల్లో ఛార్జీలు పెంచుతున్నట్లు ప్రకటించింది. హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలో నడిచే ఆర్డినరీ, మెట్రో ఎక్స్ ప్రెస్, ఈ-ఆర్డినరీ, ఈ-ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఈ పెంపు ఉంటుంది. పెరిగిన ఆర్టీసీ ఛార్జీలు సోమవారం నుంచి అమల్లోకి రానున్నాయి.

మిగతా 2లో..



## స్థానిక సంస్థల ఎన్నికలపై సుప్రీంలో పిటిషన్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలైంది. స్థానిక ఎన్నికలపై తెలంగాణ హైకోర్టు ఇటీవల ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ వంగ గోపాల్‌రెడ్డి సెప్టెంబరు 29న సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈనెల 6న పిటిషన్‌పై విచారణ జరపనుంది. తెలంగాణలో స్థానిక ఎన్నికలకు ఇటీవల నగారా మోగింది. ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ప్రకటించింది. మిగతా 2లో..




50% మించి రిజర్వేషన్లు అమలు చేయబోతున్నారు
ధర్మాసనాన్ని ఆశ్రయించిన వంగా గోపాల్ రెడ్డి

## ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై విచారణ

### క్రాస్ ఎగ్జామినేషన్‌కు హాజరైన ఎమ్మెల్యేలు మహిపాల్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి


**హైదరాబాద్(జనంసాక్షి):**ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్ సమక్షంలో విచారణ జరిగింది క్రాస్ ఎగ్జామినేషన్‌కు ఎమ్మెల్యేలు గూడెం మహిపాల్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఇద్దరు ఎమ్మెల్యేలను పిటిషనర్ల తరఫున న్యాయవాదులు ఎగ్జామినేషన్ చేశారు. అక్టోబర్ 1న అసెంబ్లీలో స్పీకర్ సమక్షంలో ఫిరాయింపు నోటీసులు స్వీకరించిన ఎమ్మెల్యేలను వారిపై ఫిర్యాదు చేసిన భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యేల తరఫు న్యాయవాదులు క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. అయితే సమయం సరిపోకపోవడంతో.. ప్రకాశ్‌గౌడ్, కాలె యాదయ్యల విచారణ మాత్రమే పూర్తయింది. ఈక్రమంలో బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డిల క్రాస్ ఎగ్జామినేషన్ నేడు నిర్వహిస్తున్నారు.



## మావోయిస్టులతో చర్చలు లేవు

### లొంగిపోవాల్సిందే..

- ఆయుధాలు వదిలి ముందుకొస్తే స్వాగతిస్తాం
- వారందరికీ పునరావాసం కల్పిస్తాం
- అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తే చూస్తూ ఊరుకోం
- వచ్చే మార్చి నాటికి రెడ్ టెర్రర్‌కు ముగింపు పలుకుతాం : అమిత్ షా



**రాయ్‌పూర్(జనంసాక్షి):**నక్సల్స్‌తో కేంద్రం చర్చలు జరిపే ప్రసక్తే లేదని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా మరోసారి స్పష్టం చేశారు. వారంతా లొంగిపోవాలని విజ్ఞప్తి చేశారు. ఛత్తీస్‌గఢ్ లోని జగదల్పూర్‌లో శనివారం నాడు జరిగిన ర్యాలీలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. నక్సల్స్ ఆయుధాలు వీడి లొంగిపోవాలని, కేంద్రం ప్రకటించిన పునరావాస పాలసీని అందిపుచ్చుకోవాలని సూచించారు. బస్తర్ ప్రాంతంలో శాంతికి విఘాతం కలిగించే ఎలాంటి చర్యలకైనా మావోయిస్టులు పాల్పడితే భద్రతా బలగాలు గట్టి జవాబిస్తాయని ఆయన హెచ్చరించారు. వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ నాటికి 'రెడ్ టెర్రర్'కు ముగింపు పలికేందుకు కేంద్రం కృతనిశ్చయంతో ఉందని చెప్పారు. మావోయిస్టులతో మిగతా 2లో..



## ఆరునెలల్లో 'టిమ్స్' పూర్తి చేయాలి

### లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం : హరీశ్‌రావు

**హైదరాబాద్,అక్టోబర్4(జనంసాక్షి):** బిఆర్ఎస్ హయాంలో గతంలో టిమ్స్ ఆసుపత్రి నిర్మాణాన్ని కేసీఆర్ తలపెట్టారని మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. నిర్మాణ పనులను రేవంత్‌రెడ్డి సర్కార్ నత్తనడకన చేస్తోందని విమర్శించారు. కొత్తపేటలో టిమ్స్ భవనాలను పార్టీ ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సుధీర్‌రెడ్డి, వివేకానంద, కాలేరు వెంకటేశ్‌తో కలిసి పరిశీలించారు. పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడతూ.. తమ ప్రభుత్వం ఉండి ఉంటే.. ఇప్పటికే టిమ్స్ పూర్తయ్యేదని చెప్పారు. రాజకీయాలను పక్కనపెట్టి కంటి వెలుగు కార్యక్రమాన్ని కొనసాగించాలన్నారు. రేవంత్‌రెడ్డి సర్కారులో ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు బకాయిలు పెట్టారని విమర్శించారు. కేసీఆర్ తీసుకొచ్చిన

మిగతా 2లో..

## పదేళ్లు మీరేం చేశారు?



- జూబ్లీహిల్స్ ఎన్నికలు వచ్చేసరికి సమస్యలు గుర్తుకొచ్చాయా?
- ప్రజలను పక్కదాని పట్టించడానికే హడావిడి చేస్తున్నారు
- హరీశ్‌కు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కౌంటర్

**హైదరాబాద్(జనంసాక్షి):**టిమ్స్ హాస్పిటల్ ప్రారంభించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం జాప్యం చేస్తుందని హరీశ్ రావు కామెంట్స్‌పై ప్రభుత్వం విప్ ఆది శ్రీనివాస్ కౌంటర్ ఇచ్చారు. ఈ మేరకు ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ..జూబ్లీహిల్స్ ఎన్నికలు వచ్చేసరికి హరీశ్ రావుకు సమస్యలు గుర్తుకు వచ్చాయి. నగర ప్రజలను పక్కదారి పట్టించడానికి ఆయన హడావిడి మొదలు పెట్టాడు. కొత్త పేట టిమ్స్ హాస్పిటల్ దగ్గర హరీష్ రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యే లు షో చేశారు. హాస్పిటల్ నిర్మాణం జరగడం లేదని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. పదేళ్లు అధికారంలో ఉండి ఎందుకు సూపర్ స్పెషాలిటీ ప్రభుత్వ ఆస్పత్రులను ఎందుకు నిర్మించలేదో హరీష్ రావు సమాధానం చెప్పాలి.. అధికారం పోవడానికి యేడాది ముందు టిమ్స్ హాస్పిటల్స్ కు టెండర్లు పిలిచారు.. మా ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి వీటిని నిర్మాణంపైన ప్రత్యేక దృష్టి సారించారు.. అన్ని ఆస్పత్రుల నిర్మాణం దాదాపుగా 90 శాతం పూర్తైంది.. సూపర్ స్పెషాలిటి హాస్పిటల్ హంగులతో పాటు అత్యాధునిక వైద్య పరికరాలు, ఆధునిక

మిగతా 2లో..

## ఐటీఐలు ఆత్మనిర్భర్ భారత్‌కు కీలకమైన వర్క్‌షాప్‌లు




- 'శ్రమేవ జయతే, శ్రమేవ పూజ్యతే' సాకారం
- కౌశల్ దీక్షాంత్ సమరోహ్‌లో ప్రధాని మోడీ
- బీహార్‌లో ప్రారంభించిన సీఎం నితీశ్ కుమార్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లు (ఐటీఐ) ఆత్మనిర్భర్ భారత్‌కు కీలకమైన వర్క్‌షాప్‌లు అని ప్రధాని మోదీ ప్రశంసించారు. ఐటీఐలు పారిశ్రామిక విద్యా సంస్థలు మాత్రమే కాదు, ఆత్మనిర్భర్ భారత్‌కు వర్క్‌షాప్‌లు అని ఆయన చెప్పారు. యువత సాధికారతకు మెగా ప్రోగ్రామ్‌గా ఈ ఈవెంట్‌ను ప్రధాని వర్ణించారు. 'శ్రమేవ జయతే, శ్రమేవ పూజ్యతే' అని ఉటంకిస్తూ, స్కిల్డ్ వ్యక్తులను గౌరవించాలని ప్రధాని సూచించారు. ఈ సందర్భంగా రూ. 62,000 కోట్లకు పైగా విలువైన యువత- కేంద్రీకృత కార్యక్రమాలను ప్రధాని శనివారం ఢిల్లీలో ప్రారంభించారు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కౌశల్ దీక్షాంత్ సమరోహ్‌లో ప్రధాని మాట్లాడారు. యువతలో స్కిల్ డెవలప్‌మెంట్, ఉద్యోగ నైపుణ్యాల్ని పెంచేందుకు ప్రధాన మంత్రి సేతు పథకాన్ని రూ. 60,000 కోట్లతో ప్రవేశపెట్టారు. దేశంలో 2014 వరకు 10,000 ఐటీఐలు ఉండగా, గత దశాబ్దంలో 5,000 కొత్తగా ఐటీఐ కళాశాలలు ఏర్పాటు చేశారని, ఈ 11 సంవత్సరాల్లో 1.5 కోట్ల మంది యువకులకు స్థానిక భాషల్లో స్కిల్స్

మిగతా 2లో..

### బీహార్‌లో ఎన్నికలు ఒకేవిడత నిర్వహించండి

ఈసీకి అఖిలపక్ష నేతల వినతి 9లో..



## బందీల అప్పగింతకు ఒకే..

### ట్రంప్ ప్రతిపాదనను అంగీకరించిన హమాస్

**గాజా(జనంసాక్షి):** గాజాలో యుద్ధానికి శాశ్వత పరిష్కారం చూపే దిశగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదించిన ఇరవై సూత్రాల శాంతి ప్రణాళికపై హమాస్ కీలక నిర్ణయం తీసుకుంది. ట్రంప్ విధించిన గడువులోగా ఇజ్రాయెల్ బందీలందరినీ విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు హమాస్ ప్రకటించింది. గాజాలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలికి, పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పేందుకు ట్రంప్ ఈ ప్రణాళికను ప్రకటించారు. దీనిలోని నిబంధనల ప్రకారం హమాస్ తన ఆధీనంలో ఉన్న బందీలను 72 గంటల్లోగా విడుదల చేయాల్సి ఉంటుంది. ఆయుధాలను విడిచిపెట్టి, పరిపాలన నుంచి తప్పుకోవాలని ప్రధానంగా ట్రంప్ సూచించారు. దీనిపై ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఇప్పటికే అంగీకారం తెలిపారు. కాగా ఈ ప్రణాళికను అంగీకరించని పక్షంలో నరకం తప్పదని ట్రంప్ ఇప్పటికే హమాస్‌ను తీవ్రస్థాయిలో హెచ్చరించారు. ఈ నేపథ్యంలో హమాస్.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన నిబంధనలకు తలొగ్గింది. బందీల విడుదల విషయంలో

మిగతా 2లో..



## మరింత ముదిరిన యుద్ధం

- ఉక్రెయిన్‌లో ప్రయాణికుల రైలుపై రష్యా దాడి..
- 30 మందికి పైగా గాయాలు!.. పలు బోగీలు దగ్ధం

**కీవ్(జనంసాక్షి):** ఉక్రెయిన్-రష్యా యుద్ధం మరింత ముదురుతోంది. తాజాగా ఉక్రెయిన్‌లోని ఉత్తర సుమీ ప్రాంతంలో ఓ రైల్వే స్టేషన్‌ను లక్ష్యంగా చేసుకుని రష్యా దళాలు డ్రోన్లతో దాడులు చేశాయి. అదే సమయంలో కీవ్‌కు వెళ్తోన్న ఓ ప్రయాణికుల రైలుపై బాంబులు పడ్డాయి. దాడి కారణంగా రైల్లోని కొన్ని బోగీలు మంటల్లో కాలిపోయాయి. ప్రమాద తీవ్రత, ప్రాణ నష్టంపై ఇంకా స్పష్టత రాలేదు. ప్రస్తుతం ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు 30 మం దికి పైగా గాయపడినట్లు సమాచారం. మిగతా 2లో..

## నీరవ్ మోదీ అప్పగింతకు గ్రీన్‌సిగ్నల్!

- యూకే అంగీకారం
- వజ్రాల వ్యాపారి కేసులో కీలక పరిణామం

**లండన్(జనంసాక్షి):** పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. నీరవ్ మోదీని భారత్‌కు అప్పగించేందుకు యూకే

మిగతా 2లో..

## బాధితురాలి ఏకాంత సాక్ష్యాన్ని సత్యంగా అంగీకరించలేం

- ఘటనను బలపరిచే వైద్యపరమైన ఆధారాలు ఉండాలి
- అత్యాచార కేసులో పదేళ్ల జైలు శిక్ష రద్దు: హైకోర్టు

2లో..

## ఆరునెలల్లో 'టిమ్స్' పూర్తి చేయాలి




మంచి పనులు ఆపాలనే ఆలోచనలో సీఎం ఉన్నారని దుయ్యబట్టారు. ఆరు నెలల్లోపు టిమ్స్ ఆసుపత్రి నిర్మాణాలు పూర్తి చేయాలని.. లేదంటే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. హైదరాబాద్ నగరానికి నలు దిక్కులా నిర్మాణంలో ఉన్న టిమ్స్ ఆస్పత్రి భవనాలను ఆరు నెలల్లోపు పూర్తి చేయాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఆరు నెలల్లోపు ఆస్పత్రులు పూర్తి చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హరీశ్‌రావు హెచ్చరించారు. బీఆర్ఎస్ హయాంలో నిర్మాణం మొదలుపెట్టిన కొత్తపేట టిమ్స్ ఆస్పత్రిని మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సుధీర్ రెడ్డితో పాటు పలువురు నాయకులు పరిశీలించారు. నిర్మాణ పనుల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఎందుకు రెండు సంవత్సరాల నుండి టిమ్స్ ఆసుపత్రి ప్రారంభం కాలేదు. ఆనాడు మేము భూసేకరణ చేసి, టెండర్లు పిలిచి, డిజైన్లు పూర్తి చేసి, 6 అంతస్తుల భవన నిర్మాణం పూర్తి చేసాము.. కానీ ఈ ప్రభుత్వం రెండేళ్లలో 5 ఎ÷-లోర్లు మాత్రమే వేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వమే ఉండి ఉంటే ఈ ఆసుపత్రి గత ఏడాదే ప్రారంభమయ్యి ప్రజలకు సేవలు అందించేది. ఎక్కడ కేసీఆర్‌కు, బీఆర్ఎస్ పార్టీకి పేరు వస్తుందో అని కావాలనే ఈ ఆసుపత్రి నిర్మాణాన్ని స్లో చేస్తున్నారు. ముందు చూపు లేని మంద బుద్ధి కలిగిన నాయకులు కాంగ్రెస్ నాయకులు అని హరీశ్‌రావు విమర్శించారు. కేసీఆర్ హయాంలో మహేశ్వరం నియోజకవర్గంలో రూ.176 కోట్లతో మెడికల్ కాలేజీ, 500 పడకల ఆసుపత్రిని కట్టడానికి జీవో ఇచ్చాం. 27-09-2023 నాడు నేను, సబితక్క కలిసి వెళ్ళి ఆ మెడికల్ కాలేజీకి, 500 పడకల ఆసుపత్రికి శంకుస్థాపన కూడా చేశాం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ మెడికల్ కాలేజీని, 500 పడకల ఆసుపత్రిని రద్దు చేసి ఎల్బీ నగర్ టిమ్స్‌లో విలీనం చేశారు అని హరీశ్‌రావు గుర్తు చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవరంలో రూ.182 కోట్లతో ఇంకో మెడికల్ కాలేజీని కట్టాలని కేసీఆర్ జీవో ఇస్తే, ఈ ప్రభుత్వం అది రద్దు చేసి అల్వాల్ టిమ్స్‌లో కలిపారు. మేడ్చల్ జిల్లాలో ఒక్క మెడికల్ కాలేజీ లేకుండా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేసింది అని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరోగ్యశ్రీని రూ. 10 లక్షలకు పెంచాను అంటావు.. ఇవాళ ఆసుపత్రుల వాళ్ళు మేము ఆరోగ్యశ్రీ కింద వైద్యం చేయము బంద్ చేస్తాము అని చెప్తున్నారు. నీ పాలన ఎలా ఉంది అంటే.. కాలేజీలు బంద్ చేస్తామని ప్రైవేట్ కాలేజీలు, ఆసుపత్రులు బంద్ చేస్తామని ప్రైవేట్ ఆసుపత్రులు చెప్తున్నాయి. ఆరోగ్యశ్రీకి కేసీఆర్ ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు నిధులు ఇచ్చి మంచి వైద్యం అందించాము.. కానీ నువ్వు వచ్చి రూ.1400 కోట్లు ఆరోగ్యశ్రీ కింద బకాయి పెట్టావు. ఇప్పటికైనా ఆరోగ్యశ్రీ నిధులు విడుదల చేసి.. పేదలకు వైద్యం అందే లాగా తక్షణమే చర్యలు తీసుకోవాలని ఈ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## పదేళ్లు మీరేం చేశారు?

ఆపరేషన్ థియేటర్లను నిర్మిస్తున్నాం..విదేశాల నుంచి వైద్య పరికరాలు రావాల్సి ఉండటం వల్ల ప్రారంభోత్సవానికి కొంత సమయం పట్టే అవకాశం ఉంది..అని ఆది శ్రీనివాస్ అన్నారు.ఆదరాబాదరాగా ఆస్పత్రులను ప్రారంభించాలనుకోవడం లేదు. పదేళ్లు అధికారంలో ఉండి ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులను గాలికి వదిలేశారు. ఉస్మానియా ఆస్పత్రి వరదల్లో మునిగిపోయినా కనీసం పట్టించుకోలేదు. మా ముఖ్యమంత్రి గోషామహల్ అత్యాధునిక సౌకర్యాలతో ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టు సంస్థ ఇప్పటికే నిర్మాణ పనులు మొదలు పెట్టింది..వరంగల్ లో ఎంజిఎం ఆస్పత్రి నిర్మాణ పనులను మా సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా పరిశీలించారు.. ఆస్పత్రిని కూడా త్వరలోనే ప్రారంభించుకుంటాం..రాజీవ్ ఆరోగ్య శ్రీ ని మొదలు పెట్టిందే కాంగ్రెస్ పార్టీ.. ముఖ్యమంత్రి సహాయ నిధి కింద కోట్లాది రూపాయలు పేదలకు ఇస్తున్నాం , ప్రభుత్వాస్పత్రులను పదేళ్ల పాటు గాలికి వదిలేసి ఇప్పుడు హరీష్ రావు మాకు పాఠాలు చెపుతున్నాడు. హరీష్ రావు,కేటీఆర్ ఎన్ని కుప్పి గంతులు వేసినా జూబ్లీహిల్స్ ప్రజలు పట్టించుకోరు..అని ఆది శ్రీనివాస్ విమర్శించారు.

## అమెరికా మళ్లీ గన్‌కల్చర్

తెలుస్తోంది. సమాచా రం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. చంద్రశేఖర్ మృతితో ఎల్బీనగర్ పరిధిలోని బీఎన్ రెడ్డి నగర్‌లో విషాద ఛాయలు అలుముకున్నా యి. కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటన తెలుసుకున్న బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు.ఎల్బీనగర్ పరిధిలోని బీఎన్ రెడ్డి నగర్‌కు చెందిన పోలే చంద్రశేఖర్ 2023లో బీడీఎస్ పూర్తి చేసి ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లాడు.బీఎన్‌రెడ్డి నగర్‌లో ఉన్న బాధిత కుటుంబాన్ని స్థానిక ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో కలిసి మాజీమంత్రి హరీశ్‌రావు పరామర్శించారు. ఉన్నత స్థానంలో ఉంటాడనుకున్న కుమారుడు ఇక లేడన్న విషయం తెలిసి తల్లిదండ్రులు పడుతున్న ఆవేదన చూసి గుండె తరుక్కు పోతోందన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. చంద్రశేఖర్ మృతిపై సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అతడి మరణం ఆవేదన కలిగించిందన్నారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. చంద్రశేఖర్ భౌతికకాయాన్ని స్వస్థలానికి తీసుకొచ్చేందుకు అన్నివిధాలా సహకారం అందిస్తామని చెప్పారు.



## లండన్‌లో గుండెపోటుతో తెలంగాణ యువకుడు మృతి

**జగిత్యాల(జనంసాక్షి):**జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం దమ్మన్నపేటకు చెందిన ఏనుగు మహేందర్‌రెడ్డి(26) లండన్‌లో గుండెపోటుతో మృతి చెందారు. ఆయన రెండు సంవత్సరాల క్రితం పీజీ చేసేందుకు లండన్ వెళ్లి ఇటీవలే పూర్తి చేశారు. వర్క్ వీసా కూడా వచ్చింది. మహేందర్ తండ్రి రమేశ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ మేడిపల్లి మండల అధ్యక్షుడిగా ఉన్నారు. యువకుడి మృతి పట్ల ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, పలువురు ప్రజా ప్రతినిధులు సంతాపం తెలిపారు.

# ఆక్రమణలపై ఆగని పంజా

హైడ్రా సిబ్బంది తొలగించారు. భారీ పోలీసు బందోబస్తు నడుమ కూల్చివేతలు చేపట్టారు. కూల్చివేతల వద్దకు ఎవరినీ అనుమతించలేదు. రెండు కిలోమీటర్ల దూరంలోనే బారికేడ్లను ఏర్పాటు చేసి స్థానికులను అడ్డుకున్నారు. ఈ భూమిని కొంతమంది కబ్జా చేశారు. ఈ విషయమై హైకోర్టు తీర్పు మేరకు హైడ్రా ఆక్రమణల తొలగింపును చేపట్టింది. తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేసి వ్యాపారం చేసుకుంటున్న వారిని ఖాళీ చేయించింది. చుట్టూ కంచె వేసి ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేసింది. సర్వే నంబర్ 59లోని ఈ భూముల విలువ రూ.3,600 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. మరోవైపు 60 ఏళ్లుగా తమ అధీనంలో భూములున్నాయని రైతులు చెబుతున్నారు. హైదరాబాద్ నగరంలోని కొండపూర్ లో ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను హైడ్రా అధికారులు తొలగించడం ద్వారా . దాదాపు 3600 కోట్ల రూపాయల విలవ చేసే 36 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలంలోని కొండాపూర్ ఆర్టీఏ కార్యాలయానికి సమీపంలోని సర్వే నంబర్ 59లో 36 ఎకరాల ప్రభుత్వ భూమిని కొంత మంది కబ్జా చేశారని హైడ్రా తెలిపింది. దీనిపై గతంలో రైతులకు అనుకూలంగా రంగారెడ్డి జిల్లా సివిల్ కోర్టు తీర్పు ఇచ్చింది. రంగారెడ్డి జిల్లా కోర్టు తీర్పును హైకోర్టులో తెలంగాణ ప్రభుత్వం సవాల్ చేసింది. దీంతో ఉన్నత న్యాయస్థానం సర్కార్ కి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఆ 36 ఎకరాల భూమి ప్రభుత్వానిదే అని తేల్చి చెప్పింది. హైకోర్టు తీర్పు మేరకు శనివారం ఉదయం నుంచి కొండాపూర్ లోని బిక్షపతి నగర్ ప్రభుత్వ భూమిలో ఉన్న ఆక్రమణల తొలగింపును భారీ పోలీస్ బందోబస్తు మధ్య హైడ్రా సిబ్బంది చేపట్టింది. తాత్కాలిక షెడ్డులను ఏర్పాటు చేసి వ్యాపారం చేసుకుంటున్న వారిని ఖాళీ చేయించింది. ఈ భూమిని కొంతమంది కబ్జా చేశారని హైడ్రా అధికారులు తెలిపారు. అయితే, గతంలో రైతులకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది రంగారెడ్డి కోర్టు. రంగారెడ్డి కోర్టు తీర్పును తెలంగాణ హైకోర్టులో సవాల్ చేసింది ప్రభుత్వం. ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది హైకోర్టు. 36 ఎకరాల భూమి ప్రభుత్వానిదేనని తేల్చింది హైకోర్టు. హై కోర్టు తీర్పు మేరకు శనివారం ఆక్రమణల తొలగింపును చేపట్టామని హైడ్రా అధికారులు చెప్పుకొచ్చారు. తాత్కాలిక షెడ్డులను ఏర్పాటు చేసి వ్యాపారం చేసుకుంటున్న వారిని ఖాళీ చేయించామని హైడ్రా అధికారులు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో గత కొన్నేళ్లుగా అక్రమ నిర్మాణాలు భారీ స్థాయిలో వెలిశాయి. కొంతమంది అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. యథేచ్ఛగా అక్రమార్కులు నిబంధనలని ఉల్లంఘిస్తున్నారు. అక్రమ నిర్మాణాలతో పలు ప్రాంతాలు వర్షాకాలంలో వరదలకు గురవుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్యపై హైడ్రా అధికారులకు ఫిర్యాదులు వస్తోండటంతో చర్యలు చేపట్టారు.



## స్థానిక సంస్థల ఎన్నికలపై సుప్రీంలో పిటిషన్

మొత్తం ఐదు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. తొలి రెండు దశల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ.. మిగతా మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర ఎన్నికల కమిషన్ తెలిపింది. దీంతో ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలోని బీసీ రిజర్వేషన్ల అంశం రోజుకో మలుపు తీసుకుంటుంది. ఇప్పుడు తాజాగా రిజర్వేషన్ల అంశం సుప్రీకోర్టుకు చేరింది. 42 శాతం బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు అయ్యింది. తెలంగాణలోని స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతానికి మించి రిజర్వేషన్లు అమలు చేయబోతున్నారని వంగ గోపాల్ రెడ్డి పిటిషన్ సుప్రీంకోర్టులో వేశారు. 50 శాతానికి మించి రిజర్వేషన్లు అమలు చేస్తున్నారంటూ.. పిటిషన్‌లో చెప్పుకొచ్చారు. గతంలో సుప్రీంకోర్టు 50 శాతం రిజర్వేషన్ మించరదంటూ ఇచ్చిన తీర్పుకు విరుద్ధంగా.. రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ఉన్నాయని ఆరోపించారు. ఈ నేపథ్యంలో గోపాల్ రెడ్డి వేసిన పిటిషన్ సోమవారం విచారణకు రానుంది. జస్టిస్ విక్రమ్ నాథ్ ఆధ్వర్యంలో విచారణ కొనసాగనున్నట్లు సమాచారం. తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు గత ప్రభుత్వం తీసుకొచ్చిన రిజర్వేషన్లను ఎత్తివేస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లుకు అసెంబ్లీలో ఆమోదం తెలిపింది. దీనికి అన్ని పార్టీల నేతలు అంగీకారం తెలిపారు. ఆ తర్వాత వీటిని గవర్నర్ ఆమోదం కోసం రాజ్ భవన్‌కు పంపారు. అయితే ఈ బిల్లుకు గవర్నర్ ఇంకా ఆమోదం తెలుపలేదు. రిజర్వేషన్ల బిల్లుపై ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని.. తమ వద్దనే పెండింగ్‌లోనే ఉన్నాయని ఇటీవల రాజ్ భవన్ వర్గాలు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బీసీ బిల్లుపై సుప్రీంకోర్టులో పిటిషన్ పడటం రాష్ట్ర ప్రభుత్వానికి షాక్ అని చెప్పవచ్చు. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఏ తీర్పు ఇస్తోంది అనే దానిపై సర్వాత్ర ఉత్కంఠ నెలకొంది.

## మరింత ముదిరిన యుద్ధం

మంటలు ఎగిసిపడుతోన్న బోగీల్లో చిక్కుకున్న ప్రయాణికుల కోసం రెస్క్యూ సిబ్బంది గాలిస్తున్నారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలను ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ రష్యాపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. "సుమీ ప్రాంతంలోని రైల్వే స్టేషన్‌పై రష్యా డ్రోన్ దాడులు జరిపింది. ఇందులో అనేక మంది గాయపడ్డారు. సామాన్య పౌరులను లక్ష్యంగా చేసుకుని రష్యా దాడులు చేస్తోందని ఆ దేశ ప్రజలకు బహుశా తెలియకపోవచ్చు. కానీ, ఈ ఉన్మాద ప్రవర్తన పట్ల ప్రపంచం నిర్లక్ష్య ధోరణి వహించకూడదు. ప్రతి రోజూ రష్యా ఎంతో మంది ప్రాణాలు తీస్తోంది. యుద్ధం పరిష్కారం కోసం ఐరోపా, అమెరికా నుంచి ఎన్నో ప్రకటనలు వింటున్నాం. కానీ, మాకు మాటల సాయం సరిపోదు. బలమైన చర్యలు అవసరం" అని జెలెన్స్కీ రాసుకొచ్చారు.

## రేపటి నుంచి ఆర్టీసీ బస్సుల్లో ఛార్జీల మోత

సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్ ప్రెస్, ఈ-ఆర్డినరీ, ఈ-ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మొదటి మూడు స్టేజీల వరకు రూ.5 పెంపు ఉంటుది. 4వ స్టేజి నుంచి రూ.10 అదనపు ఛార్జీ వసూలు చేయనున్నట్లు ఆర్టీసీ తెలిపింది. మెట్రో డీలక్స్, ఈ-మెట్రో ఏసీ సర్వీసుల్లో మొదటి స్టేజీకి రూ.5 పెంచగా, రెండో స్టేజీ తర్వాత అదనంగా రూ.10 ఛార్జీ వసూలు చేయనుంది.

ఆర్టీసికి దసరా బొనాంజా

బతుకమ్మ, దసరా పండగల సందర్భంగా టీజీఎస్‌ఆర్టీసీకి రూ.110 కోట్ల మేర ఆదాయం సమకూరినట్లు యాజమాన్యం ప్రకటించింది. ఈ సారి 7,754 ప్రత్యేక బస్సులు నడపాలని తొలుత నిర్ణయించినప్పటికీ.. ఆశించిన మేర ప్రయాణికులు లేకపోవడంతో 5,300 వరకు మాత్రమే తిప్పినట్లు అధికారులు వెల్లడించారు. ప్రత్యేక బస్సుల్లో ఈసారి 50 శాతం వరకు అదనపు ఛార్జీలను వసూలు చేశారు. గత ఏడాది ఇదే సీజన్‌లో 6300 ప్రత్యేక బస్సులు నడపగా.. రూ.114 కోట్ల ఆదాయం వచ్చింది. గత ఏడాదితో పోల్చితే.. ఈసారి సొంతూళ్లకు వెళ్లిన ప్రయాణికుల సంఖ్య తక్కువగా ఉందని, కొందరు ప్రైవేటు వాహనాలనూ ఆశ్రయించినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. తిరుగు ప్రయాణానికి సంబంధించి ఈనెల 5, 6వ తేదీల్లో రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపించాలని సంస్థ నిర్ణయించింది.

## మావోయిస్టులతో చర్చలు లేవు

ఇక ప్రభుత్వం ఎటువంటి చర్చలు జరపదని..ఆయుధాలు వదిలేసి లొంగిపోయేందుకు ముందుకు వస్తే స్వాగతిస్తామన్నారు. ఆ విధంగా లొంగిపోయిన వారందరికీ ప్రభుత్వం నుంచి అందాల్సిన వివిధ ప్రయోజనాలు అందిస్తామని..పునరావాసం కల్పిస్తామని హామీ ఇచ్చారు. బస్తర్ జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన హోంమంత్రి 2026 మార్చి 31 నాటికి దేశం మావోయిస్టు రహితంగా మారుతుందని పునరుద్ఘాటించారు. మావోయిస్టులు తమతో చర్చలు జరపాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారని.. ఇప్పుడు వారితో మాట్లాడడానికి ఏముందని ప్రశ్నించారు. బస్తర్ అంతటా ఉన్న మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ ప్రాంతంలో ఆయుధాలతో శాంతికి విఘాతం కలిగించే వారికి భద్రతా దళాలు తగిన సమాధానం ఇస్తాయని మావోయిస్టులను హెచ్చరించారు. గ్రామాల అభివృద్ధిని మావోయిస్టులు అడ్డుకోలేరని అక్కడి ప్రజలకు హామీ ఇచ్చారు. గత పదేళ్లలో మోదీ ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్ అభివృద్ధి కోసం రూ.4లక్షల కోట్లకు పైగా నిధులు కేటాయించిందని..భవిష్యత్తులో మరిన్ని నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. కొందరు వ్యక్తులు వాళ్లతో (నక్సల్స్) చర్చలు జరపాలంటూ మాట్లాడుతున్నారు. మళ్లీ చాలా స్పష్టంగా చెబు తున్నా. ఇటు ఛత్తీస్‌గఢ్‌లోనూ, అటు కేంద్రంలోనూ అధికారంలో ఉన్న మా రెండు ప్రభుత్వాలు బస్తర్‌తోపాటు నక్సల్ ప్రభావిత ప్రాంతం మొత్తాన్ని అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నాం' అని అమిత్‌షా అన్నారు. తాము ఎంతో ఆకర్షణీయమైన లొంగుబాటు పాలసీని తెచ్చామని, నక్సల్స్ ఆయుధాలు వీడి లొంగిపోవాలని కోరారు.

## బాధితురాలి ఏకాంత సాక్ష్యాన్ని సత్యంగా అంగీకరించలేం

**ఘటనను బలపరిచే వైద్యపరమైన ఆధారాలు ఉండాలి**
**అత్యాచార కేసులో పదేళ్ల జైలు శిక్ష రద్దు: హైకోర్టు**



**హైదరాబాద్(జనంసాక్షి):** అత్యాచార కేసుల్లో నమ్మశక్యంకాని ఏకాంత సాక్ష్యాన్ని సత్యంగా అంగీకరించలేమని, బాధితురాలి సాక్ష్యాన్ని బలపరిచే వైద్యపరమైన ఆధారాలు ఉండాలని హైకోర్టు తేల్చి చెప్పింది. ఇలాంటి కేసుల్లో అత్యంత విశ్వసనీయమైన సాక్ష్యం ఒక్కటున్నా మిగిలిన ఆధారాలతో సంబంధం లేకుండా శిక్ష విధించవచ్చుంది. ఈ మేరకు హైదరాబాద్ కిషన్‌బాగ్‌కు చెందిన మహమ్మద్ ఇర్ఫాన్‌ఖాన్‌కు అత్యాచారం కేసులో నాంపల్లి కోర్టు విధించిన పదేళ్ల జైలు శిక్షను రద్దు చేసింది. మహమ్మద్ ఇర్ఫాన్‌ఖాన్ ప్రేమ పేరుతో దగ్గరై, ఎవరూ లేని సమయంలో ఇంటికి వచ్చి తనపై లైంగిక చర్యకు పాల్పడ్డాడంటూ ఓ యువతి ఫిర్యాదు మేరకు 2009 ఏప్రిల్‌లో బహదూర్‌పుర పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. దీనిపై విచారించిన ఎంఎస్‌జే కోర్టు నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష విధించింది. దీన్ని సవాలు చేస్తూ ఇర్ఫాన్‌ఖాన్ హైకోర్టులో అప్పీలు దాఖలు చేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న జస్టిస్ జె.శ్రీనివాసరావు స్పందిస్తూ... నాలుగేళ్లుగా ప్రేమలో ఉన్నామని, 2008 నవంబరులో ఇంటికొచ్చి భయపెట్టి లైంగికచర్యకు పాల్పడ్డాడంటూ 2009 ఏప్రిల్‌లో యువతి ఫిర్యాదు చేశారన్నారు. ఘటన జరిగిన ఆరు నెలల తరువాత ఫిర్యాదు చేయడంతో వైద్యపరీక్షల్లో ఇద్దరికీ 18 ఏళ్లు దాటాయని తప్ప మరో ఆధారం లభించలేదన్నారు. ఎఫ్‌ఐఆర్ జాప్యంపై వివరణ లేకపోవడంతోపాటు ఫోరెన్సిక్ ఆధారాలు కూడా లేవన్నారు. బాధితురాలు రాతపూర్వకంగా, మౌఖికంగా ఇచ్చిన ఫిర్యాదుల్లో పలు వ్యత్యాసాలుండటాన్ని కింది కోర్టు పరిగణనలోకి తీసుకోలేదన్నారు. పెళ్లి చేసుకుంటానని మోసం చేశారన్నదానికి ఆధారాలు లేవని చెప్పిన కింది కోర్టు.. అదే ఆరోపణపై శిక్ష విధించడం సరికాదన్నారు. కేవలం బాధితురాలి ఏకాంత సాక్ష్యం ఆధారంగా నిందితుడికి విధించిన జైలు శిక్షను రద్దు చేస్తున్నట్లు తీర్పు వెలువరించారు.



## బందీల అప్పగింతకు ఒకే..

మధ్యవర్తులతో చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించింది. ఇదేవిధంగా గాజా పరిపాలనను స్వతంత్ర టెక్నోక్రాట్ పాలస్తీనా సంస్థకు అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నట్లు కూడా ప్రకటించింది. అయితే ఈ ప్రణాళికలోని పలు అంశాలపై పాలస్తీనా వర్గాలతో సంప్రదింపులు అవసరమని తెలిపింది. మరోవైపు ట్రంప్ ప్రణాళికకు ఇజ్రాయెల్, అరబ్ తదితర ముస్లిం దేశాల నుంచి కూడా మద్దతు లభించింది. బందీల విడుదలకు హమాస్ మొగ్గు చూపడం శాంతి దిశగా పడిన కీలక అడుగుగా అంతర్జాతీయ వర్గాలు చెబుతున్నాయి. త్వరలోనే దీనిపై తుది ఒప్పందం కుదిరి, గాజాలో యుద్ధానికి ముగింపు పడుతుందని ప్రపంచ దేశాలు భావిస్తున్నాయి. హమాస్ నిర్ణయం దరిమిలా గాజాపై బాంబు దాడులను తక్షణం ఆపాలని ఇజ్రాయెల్‌కు అధ్యక్షుడు ట్రంప్ ఆదేశాలు జారీచేశారు. ఇంతలో ట్రంప్ ప్రణాళిక మొదటి దశను తక్షణ అమలు చేయడానికి ఇజ్రాయెల్ సిద్ధమవు తోందని ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు కార్యాలయం తెలిపింది. గాజాలో శాంతిని సాధించగల ఏకైక వ్యక్తిగా తనను తాను అభివర్ణించుకున్న ట్రంప్ మిత్రదేశమైన ఇజ్రా యెల్‌కు మద్దతు పలికారు. అలాగే హమాస్ శాశ్వత శాంతికి సిద్ధంగా ఉందని నమ్ముతున్నట్లు ట్రంప్ పేర్కొ న్నారు. 'ఇజ్రాయెల్ వెంటనే గాజాపై బాంబు దాడులను ఆపాలి. తద్వారా బందీలను సురక్షితంగా, త్వరగా బయటకు తీసుకురావచ్చు' అని ట్రంప్ తన ట్రూత్ సోషల్ ప్లాట్‌ఫామ్‌లో పేర్కొన్నారు. అదేవిధంగా నెతన్యాహు కార్యాలయం 'ఇజ్రాయెల్.. నిర్దేశిత సూత్రాలకు అనుగుణంగా యుద్ధాన్ని ముగించడానికి సిద్ధంగా, ఉందని, ఇది అధ్యక్షుడు ట్రంప్ దార్శనికతకు అనుగుణంగా ఉంటుంది' అని తెలిపింది.

## ఐటీఐలు ఆత్మనిర్భర్ భారత్‌కు కీలకమైన వర్క్‌షాప్‌లు

శిక్షణ ఇచ్చారని ప్రధాని తెలిపారు. అటు, బిహార్‌లోనూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నితీష్ కు మార్ యువత సాధికారతను ప్రతిష్టాత్మకంగా నిర్వర్తిస్తున్నారు. నిశ్చయ్ స్వయం సహాయతా భత్తా యోజనాను ఆధునీకరించి, ప్రతి ఏటా 5 లక్షల మంది గ్రాడ్యుయేట్లకు రూ. 1,000 నెలవారీ స్కాలర్ షిప్, రెండు సంవత్సరాలు అందిస్తున్నారు. ఈ క్రమంలో యువతకు ఫ్రీ స్కిల్ ట్రైనింగ్ అందిస్తున్నారు. అంతేకాదు, బిహార్ స్టూడెంట్ క్రెడిట్ కార్డ్ స్కీమ్‌ను రీడిజైన్ చేసి, యువతకు రూ. 4 లక్షల వరకు ఇంటరెస్ట్ ఫ్రీ లోన్‌లు ఇస్తున్నారు. ఇప్పటికే ఈ పథకం ద్వారా 3.92 లక్షల మంది విద్యార్థులు రూ. 7,880 కోట్ల లోన్‌లు పొందారు. గత రెండేళ్లలో బిహార్ ప్రభుత్వం 50 లక్షల మంది యువతకు ఉపాధి కల్పించిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. యువత సామర్థ్యాన్ని మరింత పెంచడానికి ఎన్డీఏ ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో పని చేస్తోందన్నారు. ఆర్జేడీ, కాంగ్రెస్‌ల పాలన తో పోలిస్తే నితీశ్ ప్రభుత్వం బిహార్ విద్యా బ్జడెట్‌ను అనేక రెట్లు పెంచిందన్నారు. అందువల్లే నేడు బిహార్‌లోని మారుమూల గ్రామాల్లో కూడా పాఠశాలలు ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని 19 జిల్లాలకు కేంద్రీయ విద్యాలయాలను ఆమోదించిందని తెలిపారు. ÷ూష్ట్ర ప్రభుత్వం 'స్టూడెంట్ క్రెడిట్ కార్డ్' ద్వారా పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించడానికి మద్దతిస్తోందన్నారు. దేశంలోనే బిహార్‌లో అత్యధిక యువ జనాభా ఉందని.. బిహార్ యువత సామర్థ్యం పెరిగినప్పుడు సహజంగానే దేశ బలం కూడా పెరుగుతుందని ప్రధాని మోదీ అన్నారు. కాంగ్రెస్ పాలనలో ఎన్నో ఏళ్లు యువత ఉద్యోగాలు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారని.. దాంతో దేశంలో అభివృద్ధి కుంటుపడిందని మోదీ మండిపడ్డారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేశం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రస్తుతం భారత్ మూడో ఆర్థికశక్తిగా రూపుదిద్దు కునేందుకు సిద్ధమవుతోందన్నారు. బిహార్‌లో విద్యార్థుల కోసం పలు అభివృద్ధి పథకాలను ప్రారంభించారు. దిల్లీ విజ్ఞాన్ భవన్‌లో పీఎం-సేతు పథకాన్ని ప్రారంభించారు. ఇది విద్యార్థుల విద్యా, నైపుణ్యాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు.

## బీఆర్ఎస్ నిర్లక్ష్యంతోనే ఆర్ఆర్ఆర్ భూసేకరణలో ఆలస్యం

**- రెండు నెలల్లో టెండర్ పక్రియ మొదలు**
**- జనవరిలో పనులు ప్రారంభిస్తాం**
**- రైతులకు ఎట్టి పరిస్థితుల్లో అన్యాయం జరగదు**
**- మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడి**



**నల్లగొండ(జనంసాక్షి):** రెండు నెలల్లో రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగం టెండర్ పక్రియ ప్రారంభం కానుందని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. డిసెంబర్ లోపు టెండర్లు పూర్తి చేసి జనవరిలో పనులు ప్రారంభించేలా చేస్తామని చెప్పారు. శనివారం నాడు మంత్రి చిట్యాల లో మీడియాతో మాట్లాడుతూ.. 2017- 18 లో ప్రధాని మోదీ ఉత్తర భాగం రీజినల్ రింగ్ రోడ్డుకు అంగీకరిస్తే..బిఆర్ఎస్ ప్రభుత్వం భూసేకరణ చేయకుండా నిర్లక్ష్యం వహించిందని మంత్రి కోమటి రెడ్డి నాటి కేసీఆర్ ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. తాను ఎంపీగా ఉన్నపుడు రైతులకు అన్యాయం జరగకుండా ధర్నాలో పాల్గొని,ప్రజా ప్రభుత్వం వచ్చి మంత్రి అయిన తర్వాత మార్కెట్ రేట్ ఇప్పించి రైతులను ఒప్పించానని అన్నారు. తాను మంత్రిగా అయిన కొత్తలో 6శాతం భూసేకరణ మాత్రమే అయితే రైతులను ఒప్పించి ఇప్పుడు 98శాతం పైగా పూర్తి చేసామని చెప్పారు. 4లేన్ల ట్రిపుల్ ఆర్ 2035 నాటికి ట్రాఫిక్ రద్దీ పెరుగుతుందని, భవిష్యత్ అవసరాల దృష్ట్యా 6లేన్లుగా మార్చుకున్నామని తెలిపారు.రీజినల్ రింగ్ రోడ్డు విషయంలో ఎవరు ఆందోళన చెందాల్సిన అక్కర్లేదనీ,రైతులు ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. అలైన్మెంట్ విషయంలో పెద్ద వాళ్ళకు ఒక న్యాయం,పేద వాళ్లకు ఒక న్యాయం ఉండదని అందులో ఎలాంటి అనుమానం అవసరం లేదని తేల్చి చెప్పారు. నల్లగొండ బిడ్డగా..ఈ గడ్డకు అన్యాయం జరిగితే ఊరుకోనని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి పునరుద్ఘాటించారు. సంగారెడ్డి నుండి నర్సాపూర్ ,తూప్రాన్, గజ్వేల్,జగదేవపూర్ వయా భువనగిరి, చౌటుప్పల్ వరకు 161.518కిలో మీటర్ల నార్త్ పార్ట్ ఉండనుందని అన్నారు. భూసేకరణ కోసం 6వేల కోట్లు ఖర్చు అవుతున్నాయని కేంద్రం,రాష్ట్రం చెరిసగం వాటా ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ వాటా 3వేల కోట్లు హడ్కో రుణం తెచ్చామని అన్నారు. ఇప్పటికే పలు మార్లు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిశామని,ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,తాను కేంద్ర ప్రభుత్వ అధికారులతో సమావేశం అయ్యామని పనులు వేగం చేసేలా మాట్లాడామని చెప్పారు. ఉత్తర భాగం అలైన్మెంట్ లో ఎలాంటి మార్పు ఉండదని,జనవరిలో పనులు ప్రారంభిస్తామని ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు. అందుకు కేంద్రం సహకరించాలని కోరారు. దక్షిణ భాగం విషయంలో రైతుల అనవసర ఆందోళన చెందొద్దని మంత్రి భరోసా కల్పించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఆర్ అండ్ బి మినిస్టర్ అయిన తాను రైతుల అంగీకారం తోనే ముందుకు పోతామని తేల్చిచెప్పారు. నేను రైతు బిడ్డను..రైతుకు అన్యాయం జరిగితే ఊరుకుంటానా అంటూ త్వరలోనే ముఖ్యమంత్రి తో మాట్లాడి మంత్రుల కమిటీ వేస్తామని తనను కలిసిన రైతులకు హామీ ఇచ్చారు. అయితే ఇటీవల పత్రికల్లో,సోషల్ మీడియాలో రీజినల్ రింగ్ రోడ్డు విషయంలో అసత్య ప్రచారం చేస్తున్నారని రైతులు ఎవ్వరు ఆందోళన చెందాల్సిన అక్కర్లేదన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు భూసేకరణ, నిర్మాణం కోసం 45వేల కోట్ల వరకు ఖర్చు అవుతుంది. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు కట్టిన,ఇప్పుడు లక్షన్నర కోట్ల విలువ గల క్షఖీఖీ ను 7వేల కోట్లకు అమ్ముకున్న బిఆర్ఎస్ ప్రభుత్వం రైతులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నదని,చరిత్రలో రోడ్లను అమ్ముకున్న పాపం బిఆర్ఎస్ ది మాత్రమేనని దుయ్యబట్టారు. రోడ్లు అమ్ముకున్న వాళ్లే..అబద్ధపు ప్రచారాలతో రైతులను గందరగోళానికి గురిచేస్తున్నారనీ, వాళ్ల ట్రాప్ లో పడొద్దని రైతులను కోరారు. వాళ్ళు ఒక్క ఇల్లు కట్టలే,ేషన్ కార్డు ఇయ్యలే,సన్న బియ్యం ఇయ్యలే,ఇంటికి ఉచిత కరెంట్ ఇయ్యలే కానీ లక్షల కోట్లు అప్పులు మాత్రం చేసారని ఎద్దేవా చేశారు. నితిన్ గడ్కరీ వ్యక్తిగతంగా తనను ఇష్టపడే వ్యక్తని తన పేరు చెప్పి గౌరెల్లి భద్రాచలం హైవే,ఎల్బీనగర్, మల్కాపురం రోడ్డు జీవో ఇచ్చారని గుర్తు చేశారు.

## నీరవ్ మోదీ అప్పగింతకు గ్రీన్‌సిగ్నల్!

సిద్ధమైంది.ప్రస్తుతం బ్రిటన్ జైల్లో ఉన్న నీరవ్ మోదీని.. వచ్చే నెల 23వ తేదీన భారత్‌కు అప్పగించే అవకాశం ఉంది. ముంబై ఆర్థర్ రోడ్ జైల్లో నీరవ్ మోదీని ఉంచే అవకాశం ఉంది.గుజరాత్‌కు చెందిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ(54) పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణంలో ప్రధాన నిందితుడిగా అభియోగాలు ఎదుర్కొంటున్నారు. దాదాపు రూ.14,000 కోట్ల మోసానికి పాల్పడి 2018లో దేశం విడిచి వెళ్లిపోయారు. ప్రస్తుతం ఆయన లండన్(యూకే)లో ఉన్నట్లు సమాచారం. దీంతో ఆయన అప్పగింత కోసం భారత్ అభ్యర్థించగా.. ఆ కేసు అక్కడి కోర్టులో విచారణ జరుగుతోంది.అయితే తాజాగా నీరవ్ మోదీని భారత్‌కు అప్పగించేందుకు గ్రీన్ సిగ్నల్ లభించినట్లు సమాచారం. నీరవ్ మోదీకి భారత్‌లో అన్ని వసతులు కల్పిస్తామని, అత్యంత కట్టుదిట్టమైన ముంబై ఆర్డర్ రోడ్ జైల్లో ఉంచుతామని భారత్ హామీ ఇవ్వడంతో బ్రిటన్ కోర్టు అందుకు అంగీకరించింది. దాంతో నీరవ్ మోదీని భారత్‌కు రప్పించాలని ప్రయత్నానికి మార్గం సుగుమం అయ్యింది.కాగా, ఈ ఏడాది జూలై నెలలో నీరవ్ మోదీ సోదరుడు నేహల్ మోదీని అమెరికాలో అరెస్టు చేశారు. అతడిని అప్పగించాలన్న భారత దర్యాప్తు సంస్థలు సీబీఐ, ఈడీలు అభ్యర్థించాయి. భారత ప్రభుత్వ అభ్యర్థన మేరకు ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీసు ఆధారంగా అమెరికా అధికారులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణం కేసులో కీలక పాత్ర పోషించినట్లు నేహల్‌పై ఆరోపణలు ఉన్నాయి మనీ లాండరింగ్ నేరపూరిత కుట్ర కేసుల్లో విచారణ ఎదుర్కొంటున్నారు.

## ప్రభుత్వ నిషేధిత గుడుంబా పట్టివేత

**శాయంపేట అక్టోబర్ 4 (జనంసాక్షి)**
శాయంపేట మండలంలోని గంగిరెణిగూడెం గ్రామం నందు పోలీస్ సిబ్బంది పెట్రోలింగ్ చేస్తుండగా బానోత్ రమేష్ గంగిరెణి గూడెం ఇంటి వద్ద గుడుంబా అమ్ముతున్నాడానే నమ్మదగిన సమాచారం రాగా వెంటనే ఆచటికి వెళ్లి చూడగా వారింట్లో గుడుంబా అమ్ముతూ కనిపించగా వెంటనే పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకోవడం జరిగిందని ఎస్సై పరమేశ్వర తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై గుడుంబాను అమ్మితే కఠిన చర్యలు తప్పవని మండల ప్రజలను హెచ్చరించడం జరిగింది.

## బొడ్డెమ్మ సంబరాల్లో పాల్గొన్న కలెక్టర్



**ఆదిలాబాద్ ప్రతినిది. (జనంసాక్షి):**
ఆదిలాబాద్ జిల్లాలో బొడ్డెమ్మ సంబరాలు జోరుగా కొనసాగు తున్నాయి. తాంసి మండలం సుంకిడి గ్రామంలో శనివారం బొడ్డెమ్మ సంబరాలు మిన్నంటాయి. మహిళలు పెద్దఎత్తున బొడ్డెమ్మ లను పూలతో అలంకరించి పల్లె పాటలు పాడుతూ హెూరెత్తించారు. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా అక్కడికి చేరుకుని పూజలు నిర్వహించారు. అనంతరం నిమజ్జనం నిర్వహించారు.

## గిరిజన గ్రామాల్లో రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

**బిఆర్ఎస్ నాయకులు డాక్టర్ ప్రవీణ్ కుమార్**



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో అక్టోబర్ 4 (జనంసాక్షి)**
గిరిజన గ్రామాల్లో శాశ్వత ప్రాతిపదికన రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలని బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలంలోని పలు గిరిజన మారుమూల గ్రామాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మండలంలోని మారేపల్లి, లైన్ గూడ, నారాపూర్, మెట్పల్లి తదిత గ్రామాల్లో సందర్శించారు. గ్రామాలకు కనీసం రోడ్డు సౌకర్యం లేదని వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్కలను కోరారు. రోడ్ల అభివృద్ధికి రు.15 కోట్ల నిధులు మంజూరు చేయించి , ప్రభుత్వానికి నచ్చినవారికి కాంట్రాక్టు ఇచ్చి రోడ్లు బాగు చేయించాలని ప్రవీణ్ కుమార్ కోరారు. కాగజ్నగర్ మండల కేంద్రానికి రావడానికి ఆయా గ్రామాల ప్రజలు వాంకిడి మండల కేంద్రం నుంచి ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం నుంచి కాగజ్ నగర్ పట్టణానికి సుమారు 60 కిలోమీటర్లు ప్రయాణించి రావలసి వస్తుందని వాపోయారు. కాలినడక, ఎడ్లబండ్ల ప్రయాణం తప్ప వాహనాలు వెళ్లే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్స్ వేదికగా ఆయా గిరిజన గ్రామాల్లో నెలకొన్న పరిస్థితులను వీడియో రూపంలో ప్రభుత్వానికి కళ్లకు గట్టినట్లు చూపిస్తూ, విజ్ఞప్తి చేశారు.

## చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవు

**దేవాపూర్ ఎస్ ఐ గంగారం**



**కాసిపేట అక్టోబర్ 4 (జనంసాక్షి)**
దేవపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గొడవకు సంబంధించి ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు దేవాపూర్ ఎస్ ఐ గంగారం తెలిపారు. శుక్రవారం సాయంత్రం 5-30 గంటలకు సమయంలో కొండాపూర్ సబ్ స్టేషన్ ఎదురుగా ఉన్న వైన్ షాప్ వద్ద, దేవాపూర్ గ్రామానికి చెందిన బోర్లకుంట ప్రణయ్, జంగు అనే వ్యక్తులు డబ్బుల విషయంలో గొడవ పడుతుండగా, అక్కడే ఉన్న గూడెం రామచందర్ గొడవను ఆపేందుకు ప్రయత్నించగా గూడెం రామచందర్ ను బోర్లకుంట ప్రణయ్, రామ టెంకి చంద్రయ్య, చునార్కర్ రాజేష్, కోమటిచెన్ గ్రామానికి చెందిన జాడికిరణ్, దుర్గం శేఖర్, బోర్లకుంట ప్రవీణ్, జాడి సాగర్, అనే ఏడుగురు వ్యక్తులు రామచందర్ పై ఇష్టానుసారం తిడుతూ బీరు బాటిల్ తో కొట్టి చంపుతామని బెదిరించారని గూడెం రామచందర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బాధితుని ఫిర్యాదు మేరకు దేవాపూర్ ఎస్ ఐ గంగారం కేసు నమోదు చేసి ఏడుగురు నిందితులను ఈరోజు అరెస్టు చేసినట్లు తెలిపారు గతంలో కూడా నేరచరిత్ర కలిగిన బోర్లకుంట ప్రణయ్ పై రౌడీ షీట్ ఓపెన్ చేయబడుతుందనిచట్టాన్ని అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని దేవాపూర్ ఎస్ ఐ గంగారం తెలిపారు.

## పార్టీలకు అతీతంగా మాజీ మంత్రి రాంరెడ్డికి నివాళులర్పించిన నాయకులు



**పెన్ పహాడ్ అక్టోబర్ 04 (జనంసాక్షి) :** మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి మృతి పట్ల మండల పరిధిలోని లింగాల గ్రామం లో పార్టీలకు అతీతంగా శనివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి గటించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఐదు సార్లు ఎంఎల్ఏగా రెండు సార్లు మంత్రిగా ప్రజలకు సేవాలాందించారని ఆయన లేని లోటు కాంగ్రెస్ పార్టీకి కుటుంబానికి తీరని లోటని అన్నారు. కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు నివాళులర్పించిన వారిలో వివిధ పార్టీల నాయకులు కేశిరెడ్డి కోటిరెడ్డి, దొంగరి గోపికృష్ణ, రణపంగ దుర్గయ్య, మజ్జిగపు నర్సిరెడ్డి, సలిగంటి రమేష్, మామిడి సైదులు, గుండు మణిదీప్, బొల్లం నాగరాజు, కృష్ణయ్య, అరవిందు, నాగేష్, కనకయ్య, వెంకన్న, తదితరులు ఉన్నారు.

# ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు పటిష్ట కార్యాచరణ..

**కలెక్టర్ డాక్టర్ సత్య శారద..**



**వరంగల్ ప్రతి నిధి, అక్టోబర్ 4 (జనంసాక్షి):**
జిల్లాలో ప్రశాంతంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పటిష్ట కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. శనివారం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ పై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిసిపి అంకిత్ కుమార్, ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి లతో కలసి సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు, శాంతిభద్రతలు (లా అండ్ ఆర్డర్), సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు, చెక్‌పోస్టుల ఏర్పాటు, పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాల ఏర్పాటు, రూట్ మ్యాప్ల తయారీ, రాజకీయ పార్టీల ప్రచారానికి అనుమతుల మంజూరు వంటి కీలక అంశాలపై అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ జిల్లాలో రెండు విడతలలో స్థానిక సంస్థలను, రెండు విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతాయని, మొదటి విడతలో 5 మండలాలు, రెండవ విడతలో 6 మండలాల్లో స్థానిక సంస్థల ఎన్నికల జరుగుతాయని అన్నారు. ఎన్నికల శాంతియుత నిర్వహణకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎన్నికల ప్రవర్తన నియమావళి)ను కఠినంగా అమలు చేయాలని, జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని, సమస్యాత్మక సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలను ముందుగానే గుర్తించి లైవ్ వెబ్ కాస్టింగ్, ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆర్ ఓ లు ప్రతి పోలింగ్ కేంద్రంలో కనీస సౌకర్యాలు టాయిలెట్స్, ఫర్నిచర్, ర్యాంప్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రహరీ గోడలు లేని పోలింగ్ కేంద్రాలకు బారికేడింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. అధికారులు సమన్వయంతో రూట్ మ్యాప్లు రూపొందిం చాలని, రాజకీయ పార్టీల ప్రచారాలకు అవసరమైన అనుమతుల ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశామని, ఎన్నికల సిబ్బందితో పాటు అదనంగా సిబ్బందిని నియమించి, ఎన్నికల విధుల నిర్వహణ పట్ల శిక్షణ కల్పించాలని అన్నారు. ఎన్నికల సమయంలో డబ్బు పంపిణీ, మద్యం పంపిణీ, బెదిరింపులు, అక్రమ ప్రచారాలు వంటి ఉల్లంఘనలపై నిరంతరం నిఘా పెట్టి, తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ద్వారా విధులు కేటాయించాలని అన్నారు. మండల కేంద్రాలలో నామినేషన్ స్వీకరణ కోసం అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. నామినేషన్ల స్క్రూటినీ , ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు ప్రక్రియ పై సిబ్బందికి శిక్షణ అందించాలని అన్నారు. పోలింగ్ రోజు పాటించాల్సిన నిబంధనల, విధులపై అధికారులకు ముందుగానే సమగ్ర అవగాహన కలిగి ఉండాలని అన్నారు. పోటీలో ఉండే అభ్యర్థులు ఫైనల్ అయిన తర్వాత పొరపాట్లు జరగకుండా బ్యాలెట్ పేపర్ల ముద్రణ జరగాలని, ఎన్నికల నిర్వహణకు అవసరమైన వాహనాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని అన్నారు. రిసెప్షన్,డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు.
ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం యేదైనా సహించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి ఓటరుకూ భద్రతతో కూడిన వాతావరణంలో ఓటు వేసే అవకాశం కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీ సిఈఓ రామి రెడ్డి, డిపిఓ కల్పన, ఆర్డీఓ లు సత్యపాల్ రెడ్డి, ఉమారాణి, జిల్లా నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, ఎంపిడిఓ లు, పోలీసు అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

**ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్**

**ఖానాపూర్ అక్టోబర్ 04 (జనంసాక్షి)**
రానున్న పంచాయతీ ఎన్నికలలో అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో పార్టీ శ్రేణులతో ఆయన సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. అభ్యర్థుల ఎంపిక పారదర్శకంగా ఉంటుందని పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు తప్పకుండా చేకూరుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అలాగే అభ్యర్థి ఎవరైనా సమన్వయంతో పనిచేసి గెలిపించుకునే బాధ్యత అందరిపై ఉందని అన్నారు. అవకాశాలు అందరికీ దశలవారీగా చేకూరుతాయని ఈసారి అవకాశం రాలేదని నిరుచాహపడవసిన అవసరం లేదని ఆశావహులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. వర్గ విభేదాలకు తావు లేకుండా వైశమ్యాలకు పోకుండా పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పెట్టుకొని పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రిని కలిసిన బిజెపి నాయకులు..

**చెన్నారావుపేట, అక్టోబర్ 4 (జనం సాక్షి):**
కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను చెన్నారావుపేట బిజెపి మండల అధ్యక్షులు దా మెరుప్పుల శేఖర్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూల బొకే అందించి దసరా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువా కప్పి సన్మానించారు. ఖాదర్ పేట గ్రామ అభివృద్ధి కోసం రామాలయం నిర్మాణం కోసం కేంద్రం నుండి నిధులను మంజూరు చేయాలని కోరారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఆయన వెంట బిజెపి నాయకులు రాకేష్, హరికృష్ణ, తదితరులు ఉన్నారు.



## భర్త ఇంటిముందు భార్య ఆందోళన

**కాపురానికి తీసుకెళ్లడం లేదని నిరసన**
**శాపనార్థాలు పెట్టిన మహిళలు**
**బాధితురాలని ఇంట్లోకి తీసుకెళ్లాలని డిమాండ్**



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):**
కాపురానికి తీసుకెళ్లడం లేదని నిరసిస్తూ భర్త ఇంటి ముందు భార్య ఆందోళన చేపట్టిన సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. బాధితురాలు, ఆమె కుటుంబసభ్యులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గణపురం మండలం అప్పయ్యపల్లికి చెందిన ఎలకపల్లి రమతో, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రానికి చెందిన ఆరెపల్లి శ్రీనివాస్ తో 2021లో వివాహం జరిగింది. కాగా ఆరు నెలల పాటు కలిసిమెలిసి ఉన్నప్పటికీ, ఆ తర్వాత శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో రమకు వేధింపులు మొదలయ్యాయి. అనేక రకాలుగా భర్త, ఆయన కుటుంబసభ్యులు ఇబ్బందులకు గురి చేస్తుండడంతో గతంలో పోలీస్ స్టేషన్లో భర్త శ్రీనివాస్ పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో భర్త శ్రీనివాస్ నేరుగా కోర్టుకు వెళ్లాడు. కోర్టుకు తిరుగుతున్న క్రమంలో చివరగా భార్యను కాపురానికి తీసుకెళ్లాలని కోర్టు తీర్పునిచ్చింది. ఈ క్రమంలో ఎలుకపల్లి రమ శుక్రవారం సాయంత్రం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని భర్త శ్రీనివాస్ ఇంటికి వచ్చింది. అయితే భర్త శ్రీనివాస్, ఆయన కుటుంబ సభ్యులు ఇంట్లోకి రానివ్వకుండా అడ్డుకుని గేటు పెట్టడంతో బాధిత మహిళ ఆరుబయటే ఉండిపోయింది. శనివారం ఈ విషయం తెలుసుకున్న బాధితురాలు తల్లిదండ్రులు, బంధువులు, మహిళలు జిల్లా కేంద్రానికి చేరుకొని నిరసన చేశారు. భర్త శ్రీనివాస్ తీరు ను నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. ఎలకపల్లి రమను లోపలికి రానివ్వకుండా ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. వారి మాట వినిపించుకోకుండా భర్త శ్రీనివాస్ గేటు పెట్టడంతో బాధితురాలు కుటుంబ సభ్యులు, మహిళలు అక్కడే ఇంటి ఎదుట బైఠాయించారు. శ్రీనివాస్ ను శాపనార్థాలు పెడుతూ రమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. భార్యను కాపురానికి తీసుకెళ్లకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న శ్రీనివాస్ పై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా మహిళలు డిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు పరిస్థితిని తెలుసుకొని పోలీస్ స్టేషన్కు వచ్చి ఫిర్యాదు చేయాల్సిందిగా కోరారు. దీంతో బాధితురాలు కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్ కు తరలి వెళ్లారు. తమకు న్యాయం చేయాలని బాధితురాలు కుటుంబ సభ్యులు పోలీసులను వేడుకుంటున్నారు.

# సాదా సీదాగా.. సరదాగా కాసేపు..

**ప్రతి పక్ష నాయకుని సాధన జీవితం**

**కాటారం సెప్టెంబర్ 4 (జనంసాక్షి ):**
కాటారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ దగ్గర ప్రతిపక్ష నాయకుడు టీ తాగుతూ కనిపించారు. సాధారణంగా రాజకీయ నాయకులు ప్రజల్లోకి వస్తే ఎప్పుడు బిజీగా గడుపుతారు. ఇక ప్రతిపక్ష హెూదా ఉంటే మాత్రం క్షణం తీరిక ఉండదు. ప్రజా సమస్యలపై పోరాడుతూనే ఉండాల్సి ఉంటుంది. కొద్దిసేపు ఎక్కడైనా సరదాగా ఉండేందుకు ప్రయత్నించినా సమయం దొరకదు. కానీ ఇక్కడ మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ కాసేపు సరదాగా స్థానిక నాయకులతో ముచ్చటించారు. కాటారం మండలం కేంద్రం లో ఓ కార్యక్రమానికి వచ్చిన మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ స్థానిక నాయకుల తో కలిసి ఇలా స్థానిక అంబేద్కర్ చౌరస్తాలోనీ ప్రకాష్ శెట్టి టీ స్టాల్ వద్ద సాధారణ వ్యక్తుల్లా టీ తాగుతూ ముచ్చటించారు.



# దామన్న ఆశయ సాధనకు కృషి

- కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆర్డీఆర్ చేసిన సేవలు విస్మరించలేనివి
- రాజకీయాలలో,ప్రజా జీవితంలో ఆయనకు ప్రత్యేక స్థానం
- తనకు అందించిన చేయూతను ఎప్పటికీ మరువలేను : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):దివంగత కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి ఆశయ సాధనకు అవిరళ కృషి చేస్తానని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి అంత్యక్రియల నిమిత్తం ఆయన శనివారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా దివంగత నేత దామన్న పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆయన చేసిన కృషి విస్మరించలేనిదని కొనియాడారు. అన్ని రకాల ఆటుపోట్లను అధిగమించి కాంగ్రెస్ జెండాను రెపరెపలాడించిన ఘనత ఆయనకు దక్కిందన్నారు. వ్యాపార దృక్పథంతో రాజకీయాలు నెరుపుతున్న ఈ రోజుల్లో పార్టీని,పార్టీ యంత్రాంగాన్ని కాపాడుకునేందుకు సొంత ఆస్తులను కర్పూరంలా కరిగించుకున్న మహానేత దామోదర్ రెడ్డి అని పేర్కొన్నారు. రాజకీయాలతో పాటు ప్రజాజీవితంలో ఆర్డీఆర్ ది ప్రత్యేక స్థానమన్నారు. తాను తొలిసారి 1994 ప్రాంతంలో శాసనసభ్యుడిగా ఓటమి చవిచూసినప్పుడు ఆర్డీఆర్ అందించిన చేయూతను ఎప్పటికీ మరచిపోలేమన్నారు. అటువంటి మహానేత మననుండి నిష్క్రమించడం జీర్ణించుకోలేక పోతున్నామన్నారు. దివంగత నేత ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూనే, ఆయన ఆశయాలు ముందుకు తీసుకుపోయేందుకు సహచర మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి,స్థానిక శాసనసభ్యులు, లోకసభ సభ్యులు, పార్టీ యంత్రాంగంతో కలసి పనిచేస్తామని అన్నారు.



## మాజీ మంత్రి దామోదర్ రెడ్డి కి నివాళులర్పించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**పాలకుర్తి, అక్టోబర్ 04 (జనంసాక్షి)**
తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, రాష్ట్ర రాజకీయాల్లో విశిష్టస్థానం సంపాదించిన మాజీ మంత్రి రామిరెడ్డి దామోదర్ రెడ్డి మృతి చెందడంతో, రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ఆయన మరణం పార్టీకి, ప్రజలకు తీరని లోటుగా నాయకులు అభిప్రాయపడుతున్నారు. ఈ సందర్భంగా పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి శనివారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలోని రామిరెడ్డి దామోదర్ రెడ్డి నివాసానికి చేరుకుని పార్థివ దేహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. తదనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి దుఃఖంలో భాగమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రామిరెడ్డి దామోదర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి అంకితభావంతో సేవలందించిన మహానేత. ఆయన ప్రజల అభ్యున్నతికి జీవితాంతం కృషి చేశారన్నారు. పార్టీ కోసం, ప్రజల కోసం నిరంతరం పోరాడిన ఆయన సేవలు మరువలేనివి. ఆయన మరణం పార్టీకి తీరని లోటు, అని తెలిపారు. ఆయన ఆశయాలను కొనసాగించడం ద్వారా ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్టవుతుంది, అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి నియోజకవర్గ నాయకులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు ఘనంగా నివాళులు అర్పించారు.

# సమాజం ఒక కొత్త దృష్టికోణం

### ఇన్ని సిద్ధాంతాలు, ఇన్ని వాదానాలు చాలు!

మనవత్వానికి నేడు కావలసింది ఇంకో సిద్ధాంతం కాదు, కొత్త దృష్టి. మనిషి–మహిళ సంబంధానికి వస్తే, జాతి మాయమవుతుంది, వర్గం మాయమవుతుంది, మతం మాయమవుతుంది. సిద్ధాంతాలు తేనిలో కలిపిన మందు పొడుల్లాంటివి. ప్రతి వర్గం తమ "చింతామణి మాత్రలు" అందిస్తూ, అవి ప్రతి బాధకు పరిష్కారమని చెబుతుంది. మరొక వర్గం కొత్త మిశ్రమం తయారు చేసి, మరింత మంచి మందు అని ప్రకటిస్తుంది. ఈ విధంగా సిద్ధాంతాలు తయారయ్యి, తాగబడి, అమ్మబడుతూనే ఉంటాయి. మధ్యలో వ్యక్తిమనిషికనబడడమే మానిపోతుంది. అవ్యక్తమైన విధానాల తూకంలో తూకాలు వేయబడి, కొలవబడి, తీర్పు ఇవ్వబడతాడు.

ఆ విధంగానే ప్రపంచం అనేక సిద్ధాంతాలకు బందీ అయింది. జాతి, వర్గం, మతం, దేశం, జాతీయత. వీటి నుంచే సాహిత్యం, సినిమా, కళ, ఉద్యమాలు, విప్లవాలు పుట్టాయి. అవి ఒకవైపు ప్రజలను కలుపుతాయి, మరోవైపు వేరు చేస్తాయి. "ఇవ్వాలి మనవి, అవి మనవికావు" అని గోడలు కట్టబడతాయి. కానీ ఆ గోడలు మాయగోడలుఅసంపూర్ణమైనవి, అసహజమైనవి.

కొంతమంది మేధావులు, గాంధారి తన కళ్లను కట్టుకున్నట్లే, వాస్తవాన్ని చూడకుండా గడుపుతారు. ఓ మిత్రుడు ఇటీవల ఒక పండితుడి గురించి చెప్పాడుఅతను ఒక పుస్తకం రాసి, భారతదేశంలో ఇక జాతి లేదు, కేవలం వర్గమాత్రమే ఉందని వాదించాడట! ఆ పుస్తకం నేను చదవలేదు, చదవాల్సిన అవసరం లేదు కూడా. ఎందుకంటే ఆ వాదన మనుష్యులను రెండు వర్గాలుగా చీలుస్తుంది

### పురుషుడు మరియు స్త్రీ.

ఇది మను ధర్మశాస్త్రంలోని ఆ పాత వాక్యంతో సమానయస్త్రీకి జాతి ఉండదు, అందువల్ల ఆమె శూద్రే. ఆతరువాత పుట్టిన ప్రతి సంతానం కూడా శూద్రమే అవుతుంది. అలా అయితే బ్రాహ్మణులు, క్షత్రియులు లుప్తమవుతారు. ఈ తర్కం మొదట్నుంచీ తప్పుజాతి యొక్క అర్థాన్ని, సమాజంలోని వాస్తవ జీవనాన్ని అవగాహన చేయలేకపోతుంది.

ఇప్పటికీ జాతి ఎక్కడైనా ఉందివివాహాలలో, వృత్తిలో, రాజకీయ ఐక్యతలో, అధికార వ్యవస్థల్లో, రిజర్వేషన్ నిర్మాణాల్లో. రిజర్వు కాకపోయిన వర్గాలలోని ప్రత్యేక హక్కులు అనుభవించే వారు మొదటగా "జాతి లేదు" అని చెబుతారు. వారి నిరాకరణ విముక్తి కాదు, అది ప్రత్యేక హక్కు.

ఉత్పత్తి నుండి వేరుపడినవారే జాతి, వర్గం లేవని చెబుతారు. కానీ కూలి చేసేవారు, శ్రమజీవులు తెలుసుకుంటారుప్రతి సంబంధం, ప్రతి నైపుణ్యం, ప్రతి పరికరం, ప్రతి సాంస్కృతిక విలువ ఉత్పత్తితోనే ముడిపడి ఉంటుందని. ప్రతి జాతి లోపల శతాబ్దాల విజ్ఞానం, శాస్త్రం, సాంకేతికత దాగి ఉంది. సృష్టించని వారు, ఉత్పత్తి చేయని వారు ఇవన్నీ ఎరుగరు. వాళ్లు అన్వేషించేది సత్యం కాదుఆధిపత్యం. వినకుండా వినిపించడమే వారి ధ్యేయం. వారి ప్రభావం తగ్గినప్పుడు, కొత్త సిద్ధాంతాలను తయారు చేసుకొని కొత్త అనుచరులను కూడగడతారు. ఇలాంటి వారి కోసం, జాతి–వర్గం వంటి పదాలు కేవలం మోడా మాటలు గౌరవ చిహ్నాల మాదిరిగా ధరించేవి.

### నిజం మరింత ఘాటుగా ఉంది:

భూస్వామి, ఫ్యూడల్ లార్డ్, పోలీసు అధికారి లేదా ఉన్నత జాతికి చెందిన పురుషుడు ఒక మహిళను దోపిడి చేయబోతే జాతి అతన్ని ఆపుతుందా? వర్గం అడ్డుకుంటుందా? జాతీయత అడ్డుకుందా? కాదు. ఆ క్షణంలో ఒకే వాస్తవం నిలుస్తుందిఆమె ఒక స్త్రీ, నేను ఒక పురుషుడు.

చరిత్ర దీన్ని మళ్లీమళ్లీ నిరూపించింది.

హత్రాస్ కేసులో ఒక దళిత బాలిక అత్యాచారానికి గురైంది, కానీ ఆమె జాతి అడ్డుకాలేదు. విదేశీ మహిళపై భారతదేశంలో దాడి జరిగింది, జాతీయత అడ్డుకాలేదు. యూరప్‌లో వలసలు పెరగడంతో దాడులు పెరిగాయివిదేశిత్వం అడ్డుకాలేదు. యు.ఎన్. శాంతి బలగాలే, రక్షణకర్తలుగా వెళ్ళి, అత్యాచారాల ద్వారా పిల్లలను పుట్టించాయి.


అందుకే జాతి, వర్గం, మతం, జాతీయతఇవి పురుషుల మధ్య మాత్రమే పనిచేస్తాయి. పురుషుడు–స్త్రీ సంబంధానికి వచ్చేసరికి అవన్నీ కూలిపోతాయి. మిగిలేది కేవలం పురుషుడు, స్త్రీ మాత్రమే.

### అందువల్ల తాత్పర్యం స్పష్టంగా ఉంది:

పురుష–స్త్రీ సంబంధంలో జాతి మాయం, వర్గం మాయం, మతం మాయం, జాతీయత మాయం. కానీ వివాహ సంస్థలో అవి మళ్లీ బయటకు వస్తాయిఇనుప గోడల్లా.

### ఇదే పితృస్వామ్యం.

కొంతమంది స్త్రీలు తమ శరీరపు అంటరానితనాన్ని అమ్ముకుని, ఉన్నత జాతి పురుషుల నుంచి అధికారం, సంపద, ప్రతిష్ఠ పొందుతారు. సిమోన్ ది బోవర్ తన "సెకండ్ సెక్స్" గ్రంథంలో చూపించింది. మార్క్సిజం, చరిత్రాత్మక భౌతికవాదం, అదనపు విలువ అనే సిద్ధాంతాలన్నీ పురుష దృష్టి నుంచే రాయబడినవని. అంబేద్కర్ జాతి యొక్క కర్కశత్వాన్ని, దాని పుట్టుకను, దాని యంత్రాంగాన్ని బహిర్గతం చేశారు. అయినప్పటికీ ఎందరో ఇప్పటికీ "వర్గమే ముఖ్యం" అని జపిస్తున్నారుజాతి వర్గాన్ని ఆకృతిచేస్తుందనే సత్యాన్ని గమనించకపోతూ. వారు తెలుసుకుంటారు, కానీ అంగీకరిస్తే తమ ఆధిపత్యం పోతుందనే భయం వారిని మౌనం పలికిస్తుంది.



### ఇప్పటికే అసలు ప్రశ్న ఇదే:

ప్రపంచ జనాభాలో సగభాగమైన స్త్రీలు జాతి, వర్గం, మతం, దేశం, పితృస్వామ్యంలాంటి సిద్ధాంతరూపపు పంజరాల నుండి బయటపడాలి. వారు తమకోసం కొత్త తత్వాలు, కొత్త సౌందర్యాలు, కొత్త జ్ఞానవ్యవస్థలు, కొత్త ఆలోచనా పథకాలను సృష్టించాలి.

స్త్రీలు ఒక కొత్త దృష్టిని సృష్టించాలి.

**- బి ఎస్ రాములు**
**సామాజిక తత్వ వేత్త**
**ఫో: 8331966987**

# గోల్వాల్కర్ వారసత్వ చీకటి ఛాయ
# నూరేళ్ళ ఆరెస్సెస్



భారతదేశ రాజకీయ, సామాజిక రంగాల్లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) ప్రభావం ఎప్పుడూ వివాదాస్పదమే. 1925లో ఏర్పడిన ఈ సంఘం, 100వ వర్షికోత్సవాల సందర్భంగా 2023 అక్టోబర్ 4–5 తేదీల్లో ముంబయిలో 'ఇండియా టుడే' నిర్వహించిన వార్షిక సమ్మేళనంలో కేంద్రీకృతమైంది. 'ఆర్‌ఎస్‌ఎస్ 100 ఇయర్స్: వై ఎం.ఎస్. గోల్వాల్కర్ ఇన్స్యూర్స్' అనే అంశంపై జరిగిన చర్చాగోష్ఠి, ఆర్‌ఎస్‌ఎస్ రెండవ సర్‌సంఘచాలక్ ఎం.ఎస్. గోల్వాల్కర్ ప్రభావాన్ని హైలైట్ చేసింది. వివిధ స్రవంతుల నుంచి వచ్చిన ప్యానలిస్టులు పాల్గొన్న ఈ చర్చలో, గోల్వాల్కర్ జాతి నిర్మాణ భావనలు, మైనారిటీల పట్ల వైఖరి, భారత రాజ్యాంగంపై అప్రతిష్ఠ పాలు – ప్రధాన అంశాలుగా నిలిచాయి. అయితే, నేటి మైనారిటీల అవస్థలు, బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని విమర్శించడం వంటి సమకాలీన అంశాలపై చర్చ తక్కువగా జరిగింది. ఇది ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం ఇప్పటికీ ఎలా ప్రభావం చూపుతోందో సూచిస్తుంది.

గోల్వాల్కర్, 1939లో 'వీ ఆర్ అవర్ నేషన్‌హుడ్ డిఫైన్డ్' పుస్తకంలో జాతి గర్వం, స్వచ్ఛత భావనలను జర్మనీ ఉదాహరణతో వివరించాడు. "ఇప్పుడు జర్మన్ జాతి గర్వం చర్చనీయాంశంగా మారింది. జాతి స్వచ్ఛతను, సంస్కృతిని కొనసాగించడానికి యూదుల ప్రక్షాళన ద్వారా జర్మనీ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. భిన్న సంస్కృతులు ఏకీకృతం అసాధ్యమని జర్మనీ చూపించింది. హిందుస్థాన్‌కు మంచి పాఠం" అని రాశాడు. ఇది నాజీ భావజాలాన్ని ప్రతిబింబిస్తుంది. చర్చలో హిందూత్వ మద్దతుదారులు దీన్ని "సందర్భానుసారం చూడాలి, చెర్రీ పికింగ్"గా వర్ణించారు. కానీ, 1972లో కుశ్వంత్ సింగ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో గోల్వాల్కర్ ముస్లింల విభజనకు హిందూ–ముస్లిం ఇద్దరూ బాధ్యులని అన్నాడు. ప్రస్తుత సర్‌సంఘచాలక్ మోహన్ భగవత్ 2018లో విజ్ఞాన్ భవన్ ప్రసంగాల్లో మరింత సామరస్యంగా: "హిందూ–ముస్లిం డీఎన్‌ఏ ఒకటే. హత్యలు హిందూత్వానికి వ్యతిరేకం. ఇస్లాం ప్రమాదంలో ఉందనే భయంలో పడవద్దు" అని చెప్పాడు. భాషలో మార్పు ఉంది, చర్యల్లో ఏమిటి?

ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం సంస్థాగతంగా ప్రభావం చూపుతోంది. శాఖలు, సరస్వతీ విద్యాలయాల్లో మైనారిటీలను 'అంతర్గత విదేశీయులు'గా చూడే దృక్పథం ప్రధానం. అనుబంధ సంస్థలు – వీఎచ్‌పీ, ఏబీవీపీ – సోషల్ మీడియాలో "మేమిద్దరం, వారు ఐదుగురు", "వారి బట్టల ద్వారా గుర్తించ వచ్చు" వంటి విభజనాత్మక కంటెంట్ ప్రచారం చేస్తున్నాయి. ప్రధాని మోదీ, మాజీ ప్రచారక్‌గా, శాఖల్లో శిక్షణ పొంది, కార్యకర్తలను ప్రోత్సహిస్తున్నాడు. రాణా ప్రతాప్ గోరక్షణ కోసం జీవితం అర్పించాడని ప్రచారం – లించింగ్‌లకు న్యాయస్థానం. నేటి సామాజిక దృశ్యాలు గోల్వాల్కర్ భావజాలాన్ని ప్రతిబింబిస్తున్నాయి. 1937లో అతను మైనారిటీలు 'ద్వితీయ స్థానంలో' ఉండాలని చెప్పాడు. ఇప్పుడు, ముస్లిం, క్రైస్తవులపై హత్యలు, బహిష్కరణలు సాధారణం. 2002 గుజరాత్‌లో బిల్కిస్ బానో కేసులో దోషుల ముందస్తు విడుదల, బీజేపీ ఎంపీల స్వాగతం – ఆర్‌ఎస్‌ఎస్ ఆమోదం పొందినట్లే. ఎన్‌ఆర్‌సీ, సీఏఏ ద్వారా ముస్లింల పౌరసత్వం తొలగించే ప్రయత్నాలు, వ్యాపార బహిష్కరణలు, "ఇంటి వదిలి వెళ్లాలి" బెదిరింపులు – ఇవి 1939 గోల్వాల్కర్ దృష్టిని కొనసాగిస్తున్నాయి. ఢిల్లీ 2020 లేదా ఉత్తరప్రదేశ్ లించింగ్‌లు ఇదే సూచిస్తున్నాయి. భగవత్ మాటలు ఉన్నా, చర్యలు లేవు. అనుబంధ సంస్థల 'పని విభజన' మాతృసంస్థను కాపాడుతోంది.

రాజ్యాంగంపై గోల్వాల్కర్ విమర్శలు ఆందోళనకరం. అతను అధినేతగా ఉన్నప్పుడు 'ఆర్గనైజర్' పత్రికలో: "రాజ్యాంగంలో ప్రాచీన భారత రాజ్యాంగ అభివృద్ధి ప్రస్తావన లేదు. మనుస్మృతి చట్టాలు స్పార్టా, పర్షియా చట్టాల కంటే ముందు. రాజ్యాంగ పండితులకు ఇవి ముఖ్యం కావు" అని రాశారు. ఇది మనుస్మృతి వంటి వర్ణవ్యవస్థను ప్రోత్సహిస్తుంది. చర్చలో మద్దతుదారులు సమర్థించారు. ప్రస్తుతం, భగవత్ పీఠిక చదివినా చర్యలు వ్యతిరేకం. జేఎన్‌యూ వీసీ ధూళిపూడి శాంతిశ్రీ: "రాజ్యాంగానికి కట్టుబడి చరిత్ర, సంస్కృతిని విస్మరిస్తున్నారు. భారతదేశాన్ని నాగరికత రాజ్యంగా ఉంచుతాను" అని. జె.సాయి దీపక్: "రాజ్యాంగం వలసవాదం, క్రైస్తవ మూలాలు. డీకాలనైజేషన్ అవసరం" అని. బిబేక్ దేబ్రాయ్: "రాజ్యాంగం వలసవాద వారసత్వం. సోషలిజం, లౌకికవాదం ప్రశ్నార్థం" అని. ఇవి గోల్వాల్కర్ కోరికలే. రాజ్యాంగం ప్రజాస్వామ్య, లౌకిక స్వభావం హిందూ జాతీయవాదుల దాడికి గురవుతోంది. ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండా మారలేదుబీ వ్యక్తీకరణ మార్చి ఆమోదయోగ్యంగా చేస్తున్నారు. గోల్వాల్కర్ పాత తరమైనా, అతని భావజాలం సోషల్ మీడియా, విద్య, రాజకీయాల ద్వారా యువతను ప్రభావితం చేస్తోంది. ఇది మైనారిటీలపై భయం, విభజన సృష్టిస్తోంది. భారతదేశం బహుళ సంస్కృతుల దేశం – హిందూ, ముస్లిం, క్రైస్తవులు ఏకం కావాలంటే, ఇటువంటి భావజాలాలను ప్రశ్నించాలి. రాజ్యాంగ విలువలు – సమానత్వం, సహనం – కాపాడటం అందరి బాధ్యత. పౌరులు, మీడియా, విద్వాంసులు చర్చలను ముందుకు తీసుకెళ్లాలి. లేకపోతే, ఆర్‌ఎస్‌ఎస్ 100 ఏళ్లు ప్రజాస్వామ్యానికి సవాళ్లుగా మారతాయి.

**(అనువాదం,సంపాదకత్వం: బోడపట్ల రవీందర్)**

# కాకలు తీరిన రాజకీయ నేత కాకా

### అక్టోబర్ 5...గడ్డం వెంకట స్వామి జయంతి



రాజకీయాల్లో కాకలు తీరిన నేతగా... 'కాకా'గా చెరగని ముద్ర వేసిన కేంద్ర మాజీ మంత్రి, సుదీర్ఘ రాజకీయ అనుభవ శాలి గడ్డం వెంకట స్వామి(92). భారత రాజ్యాంగ రూపకర్త బాబా సాహెబ్ అంబేద్కర్‌తో కలసి పనిచేసిన వారిలో కాకా ఒకరు. కార్మిక నేతగా ప్రస్థానం ప్రారంభించి కాంగ్రెస్ పార్టీలో అంచెలంచెలుగా ఎదిగారు. భారత దేశ అత్యున్నత రాష్ట్రపతి పదవికి అతి సమీపానికి వెళ్ళి, కొందరి స్వార్థం, కుట్రల మూలంగా, ఆ పదవి పొందలేక పోయానని కాకా పదే పదే చెపుతుండే వారు.

హైదరాబాద్ లో ఖాళీ స్థలాల్లో గుడిసెలు వేయించి గుడిసెల వెంకట స్వామిగా గుర్తింపు పొందారు. ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టుకు మొదటిసారి ప్రతిపాదన చేసిన వ్యక్తి వెంకటస్వామి. సుదీర్ఘ రాజకీయ జీవితంలో కార్మిక నేతగా, ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా, పిసిసి అధ్యక్షుడిగా, ఏఐసిసి బాధ్యునిగా, ఎంపీగా, కేంద్ర మంత్రిగా, ఆయన అందించిన బహుముఖ సేవలు నిత్య జ్ఞాపకాలుగా మిగిలాయి. గడ్డం వెంకటస్వామి 5 అక్టోబర్ 1929న హైదరాబాద్ లో జన్మించారు. చిన్న వయసులోనే నిజాం వ్యతిరేక పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారు. మొదట ఆర్య సమాజ్‌లో, ఆ తర్వాత రామానందతీర్థ శిష్యుడిగా కాంగ్రెస్‌లో పనిచేశారు. సాయుధ పోరాట సమయంలో జైలుకెళ్లిన కాకా.. హైదరాబాద్ విలీనం అనంతరం రాజకీయాలు వదిలేసి కుటుంబ పోషణ కోసం కూలీ పని చేశారు. అప్పుడే కార్మిక నాయకుడిగా ఎదిగారు. హైదరాబాద్‌లో నిలువనీడ లేకుండా ఉన్న పేదల కోసం ఖాళీ స్థలాల్లో గుడిసెలు వేసి వారి కోసం పోరాడారు. ఆర్థికంగా బలపడ్డాక మళ్లీ రాజకీయాల్లోకి వచ్చిన కాకా అనేక పదవులు అలంకరించారు. 1957– 62 మరియు 1978–84 ఆంధ్ర ప్రదేశ్ శాసన సభ్యులుగా రెండు పర్యాయాలు ఉన్నారు. 1967లో 4 వ లోకసభకు ఎన్నికైయ్యారు. 1969–71 వరకు ప్రజా పద్దుల కమిటీ సభ్యుడు. అవిభక్త కరీంనగర్ జిల్లా పెద్దపల్లి లోకసభ నియోజకవర్గం నుండి పార్లమెంట్ కు ప్రాతినిధ్యం వహించారు. 1971లో 5వ లోకసభకు (2వ పర్యాయం), 1977లో 6వ లోకసభకు (3వ పర్యాయం), 1989లో 9వ లోక్ సభ (4వ పర్యాయం), 1991లో 10వ లోకసభకు (5వ పర్యాయం), 1996లో 11వ లోకసభకు (6వ పర్యాయం), 2002–2004 అధ్యక్షుడిగా, ఎ.ఐ.సి.సి. ( ఎస్సి, ఎస్టి ), 2004లో 14వ లోకసభకు (7వ పర్యాయం), ఎన్నికైయ్యారు. 1978 – 1982 లేబర్ మరియు సివిల్ సప్లైస్, ఆంధ్ర ప్రదేశ్ క్యాబినెట్ మంత్రిగా పని చేశారు. ఫిబ్రవరి 1973 – నవంబర్ 1973 వరకు లేబర్ మరియు పునరావాస కేంద్ర ఉపమంత్రిగా పనిచేశారు. నవంబర్ 1973–మార్చి 1977 వరకు సప్లై అండ్ రీహాబిలిటేషన్ కేంద్ర ఉపమంత్రిగా పనిచేశారు. 21 జూన్ 1991 నుండి 17 జనవరి 1993 గ్రామీణాభివృద్ధి కేంద్ర మంత్రిగా, 18 జనవరి1993 నుండి ఫిబ్రవరి 1995 టెక్స్టైల్స్ కేంద్ర సహాయ మంత్రి (ఇండిపెండెంట్ ఛార్జ్)గా, 10 ఫిబ్రవరి నుండి 1995–15 సెప్టెంబర్ 1995 వరకు టెక్స్టైల్స్ కేంద్ర క్యాబినెట్ మంత్రిగా, 15 సెప్టెంబర్ 1995 నుండి 10 మే 1996 వరకు కార్మిక శాఖ కేంద్ర క్యాబినెట్ మంత్రిగా, 20 ఫిబ్రవరి 1996–16 మే 1996 కార్మిక మరియు వస్త్రాల శాఖ కేంద్ర క్యాబినెట్ మంత్రిగా పనిచేశారు. అలాగే డిప్యుటీ లీడర్ కాంగ్రెస్ పార్లమెంట్ పార్టి, లోకసభ మెంబర్, కమిటి ఆన్ ఎనర్జి , మెంబర్, కమిటి ఆన్ ఇన్ స్టాలేషన్ ఆఫ్ పోట్రైస్ / స్టేటస్ ఆఫ్ నేషనల్ లీడర్స్, పార్లమెంటేరియన్ ఇన్ పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్ మెంబర్, కమిటి ఆన్ ఎతిక్స్ మెంబర్, కన్ సులేటివ్ కమిటి, మినిస్ట్రీ ఆఫ్ హెవీ ఇండస్ట్రీస్ మెంబర్, స్టాండింగ్ కమిటి ఆన్ ఎనర్జీ పని చేశారు.

కాకా మొదటి కుమారుడు గడ్డం వినోద్, ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా, రెండవ కుమారుడు గడ్డం వివేకానంద, పెద్దపెల్లి నియోజక వర్గానికి ఎం.పి.గా, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారునిగా పనిచేశారు. కాకా 2014, డిసెంబరు 22వ తేదీ హైదరాబాదులో మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల...**
**9440595494**

### షట్కం

నేను నవ్వుతునే
నాదుఃఖాన్ని గెలుచుకున్న
లోకులు నన్ను దుఃఖంలో
ముంచి
నవ్వుతూ ఉండలేక పోయారు
విరిగి పడిన వాటివల్ల
హృదయానికి ఇబ్బందులు
నిద్ర నమ్మకం ఆశయాలు
ముందుకు సాగని నావలు
ఏ సహాయం వృథా పోదు
ఏరూపంలో నైన తిరిగి
కాల చక్రం లా రాక మానదు
వర్తమాన పిడికిలి లోకి
తప్పుల బురద తడిని
మనసున కడగేసు కున్నాక
చైతన్య కాంతియై వస్తుంది
ఎవరైన ఆహారంలో
విషం కలిపిస్తే
దాన్ని వైద్యంతో
నయం చేయ వచ్చు
ఎవరైన ఆలోచనల్లో
విషం జోడిస్తే
దాన్ని ఏ వైద్యంతోను
నయం చేయలేము
సత్యం ఎపుడు తగాద పడదు
నేను సత్యాన్ని అని
అసత్యం తగాద పడుతుంది
నేనే అసలైన సత్యాన్ని అని

**రేడియమ్**
**9291527757**

### ఏమి కట్టుక పోతవ్

ఏది పట్టుక పోతవ్
ఉన్నది ఒక్కటే జీవితం
నడుసుకో సక్కగ నిత్యం.
భూమ్మీద పుట్టిన ప్రతి
జీవికి ఉన్నది ఒక్కటే జీవితం
నడుసుకో సక్కగ నిత్యం
చేసుకోకు అల్లకల్లోలం
భూమ్మీద పుట్టిన ప్రతి
జీవికి ఉన్నది ఒక్కటే మరణం
నిలిపిపో తరగని మానవత్వం
కాకు క్రూర మృగం
లెక్క లేనంత సంపద ఉన్న
చెప్పలేనంత సంతోషం ఉన్న
వృద్ధాప్యం తథ్యం
కాటిలో కట్టెల్లో కాయం
భస్మం నిజం
కుట్రలు వద్దు కుతంత్రాలు వద్దు
పగలు వద్దు ప్రతీకారాలు వద్దు
దుర్మార్గాలు వద్దు దుశ్చర్యలు వద్దు
కీడు వద్దు చెడు వద్దు
ఏమి కట్టుక పోతవ్
ఏది పట్టుక పోతవ్
మంచిగా బతికితే
నేలన నిలిచి పోతవ్
ఉన్నది ఒక్కటే జీవితం
నడుసుకో సక్కగా నిత్యం.

**అనపురం రమేశ్ గౌడ్ ఎంఏ**

# ఖనిజాల దోపిడే కోసమే 'కగార్'

*కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు పార్టీని, దాని కార్యకలాపాలను వచ్చే ఏడాది మార్చి చివరి నాటికి అంతం చేస్తామంటూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆ పార్టీ ఐడియాలజీ దేశ అంతర్గత భద్రతకు అత్యంత ప్రమాదకారి అని భావిస్తున్నది. అందువల్లనే దేశ సరిహద్దును కాపాడాల్సిన బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ బలగాలను సైతం అబూజ్ ప్రాంతంలోకి పంపుతున్నది. ఐదు దశాబ్దాలకు పైబడి దేశంలోని అనేక ప్రాంతాల్లో విప్లవోద్యమాన్ని నిర్మించిన మావోయిస్టు పార్టీపై గతంలో ఎన్నడూ లేనంతటి భారీ స్థాయిలో పారా మిలిటరీ బలగాలను, రాష్ట్రాల ప్రత్యేక పోలీసులను దించి కూంబింగ్ సాగిస్తున్నది.*


సామ్రాజ్యవాద దేశాలకు, అక్కడి పెట్టుబడిదారలకు దేశ సహజ సంపదను దోచిపెట్టే లక్ష్యంతో పనిచేస్తున్న కేంద్ర ప్రభుత్వం దానికి అడ్డంకిగా ఉన్న మావోయిస్టు పార్టీని తుద ముట్టించాలని నిర్ణయం తీసుకున్నది. దానికి ఆపరేషన్ కగార్ అనే ముద్దు పేరు తగిలించింది. గతంలోని ప్రభుత్వాలు జన జాగరణ్ అభియాన్, సాల్వాజుడుం, ఆపరేషన్ గ్రీన్ హంట్, ఆపరేషన్ ప్రహార్, ఆపరేషన్ సమాధాన్.. ఇలాంటి అనేక పేర్లతో ఇన్ ఫార్మర్, కోవర్టు ఆపరేషన్ల ద్వారా మావోయిస్టు పార్టీని నిర్మూలించేందుకు విఫల ప్రయత్నాలు చేశాయి. ఇప్పుడు వాటికి కొనసాగింపుగా మోడీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో గతేడాది జనవరి నుంచి మొదలుపెట్టింది.

మావోయిస్టు పార్టీని, దాని అగ్రనేతలను, పీఎల్‌పీ రూపంలో సమీకృతమైన పార్టీ సభ్యులు, మిలిటెంట్లను నిర్మూలించడం కేంద్ర ప్రభుత్వ ఎత్తుగడ. ఆ ఐడియాలజీకి మద్దతు ఇస్తున్న మేధావులకు అర్బన్ నక్సలైట్ల ముద్ర వేసి రకరకాల కేసులు పెట్టి అరెస్టు చేస్తున్నది. బెయిల్ రాకుండా న్యాయస్థానాలను ప్రభావితం చేసి జైలుపాలు చేస్తున్నది. చివరకు కనీసమైన ఆరోగ్య అవసరాలను కూడా తీర్చకుండా చనిపోయేలా వ్యవహరిస్తున్నది. స్టాన్ స్వామి, ప్రొఫెసర్ సాయిబాబా, పాండు నరోటే, కంచన్ నరవరే తదితరులు చనిపోయేలా చేసింది. వరవరరావు, గౌతమ్ నవలాఖా లాంటి కొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించి బెయిల్ పొందగలిగినా నాలుగు గోడలకే పరిమితమయ్యేలా ఆంక్షలు తప్పలేదు. ఇప్పటికీ బహిరంగంగా బంధీలుగానే ఉన్నారు.

మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, చత్తీస్గఢ్, జారండ్, ఒడిశా, ఉత్తరాంధ్ర తదితర ప్రాంతాల్లోని సహజ వనరులను కొల్లగొట్టేందుకు అక్కడ నివాసం ఉంటున్న ఆదివాసీలను మైదాన ప్రాంతాలకు తరలించే ప్రయత్నాలు విస్తృతంగా జరుగుతున్నాయి. అడవిలో తప్ప మైదాన ప్రాంతాల్లో బతకలేని అమాయక ఆదివాసీ ప్రజలకు మావోయిస్టు పార్టీ మద్దతు పలుకుతున్నది. వారికి అండగా నిలబడింది. మావోయిస్టు పార్టీని ప్రజలకు దూరం చేయడం ద్వారానే అనుకున్న లక్ష్యా న్ని సాధించవచ్చని భావించిన కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరిట ముప్పేట దాడిని ప్రారంభించింది. గడచిన 21 నెలల వ్యవధిలో మావోయిస్టు పార్టీ నేతలు సహా దాదాపు 700 మందిని ఎన్ కౌంటర్ల పేరుతో హతమా ర్చింది. మావోయిస్టు పార్టీ (గతంలోని పీపుల్స్ వార్ చరిత్రను కలుపుకుని) చరిత్రలోనే మొట్టమొదటిసారి ప్రధాన కార్యదర్శిని చంపివేసింది.

ఒకవైపు ఆపరేషన్ కగార్ జరుగుతున్న సమయంలోనే గడ్చిరోలి జిల్లాలో పుష్కలంగా ఇనుప ఖనిజాలున్న ప్రాంతాన్ని లాయిడ్స్ కంపెనీకి ధారాదత్తం చేసే ఒప్పందాన్ని కేంద్ర ప్రభుత్వం చేసుకున్నది. యాధృచ్ఛికమో లేక పకడ్బందీ ప్లాన్ ప్రకారమోగానీ మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు చనిపోయిన మే 21 నాడే ఈఒప్పందం జరిగింది. మైనింగ్ కార్యకలాపాలు నిర్వహించాలంటే 1996 పీసా చట్టం ప్రకారం గ్రామ సభల తీర్మానం తప్పనిసరి. కానీ ఆదివాసీలు తీర్మానాలు చేయడానికి వ్యతిరేకంగా ఉన్నారు. మైనింగ్ జరిగితే ఇక్కడి నుంచి వెళ్ళిపోవాల్సి వస్తుందని, నిలువ నీడ లేకుండా పోతుందన్నదే ఆదివాసీ ప్రజల భయం. ఈ తీర్మానాలు చేయనందుకు లాయిడ్స్ కంపెనీ వేధించింది. మైనింగ్ చేయడానికి వచ్చిన లాయిడ్స్ కంపెనీకి చెందిన యంత్రాలను ఆదివాసీలు తగులబెట్టారు. దీంతో ఆదివాసీలను అక్కడి నుంచి ఖాళీ చేయించాలంటే తొలుత మావోయిస్టు పార్టీని తుదముట్టించాలని కేంద్రం స్పష్టమైన నిర్ణయానికి వచ్చి ఆపరేషన్ కగార్ ను ప్రారంభించింది.

దేశభక్తి, జాతీయవాదం అంటూ గొంతు చించుకుంటూనే సొంత దేశ ప్రజలను హతమార్చి విదేశీ కంపెనీలకు సహజ వనరులను అప్పగిస్తున్న కేంద్ర సర్కార్. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ టారిఫ్ పేరుతో భారత దేశ ఉత్పత్తులపై టారిఫ్ విధిస్తే స్వదేశీ వస్తువులు.. అంటూ గంభీర డైలాగులు కొట్టిన



ప్రధాని మోడీ ఇప్పుడు మధ్యభారతంలో అపారమైన ఖనిజ నిక్షేపాలున్న ప్రాంతాన్ని మాత్రం బహుళజాతి సంస్థలకు దోచిపెడుతున్నారు. మరోవైపు ఎలక్షన్ ఫండింగ్ చేస్తున్న అదానీ, అంబానీలకు వేర్వేరు రూపాల్లో సంపదను ధారాదత్తం చేస్తున్నారు. ఇందుకు అవసరమైన పాలసీలనూ మందబలంతో రూపొందిస్తున్నారు. ప్రతిపక్ష పార్టీలు సైతం ఈ విషయంలో మోడీకి వంత పాడుతున్నాయి. ఒకవేళ వ్యతిరేకత వచ్చినా అప్రాధాన్యం చేసే తీరులో మోడీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. ఈ బండారం బైటపడవద్దనే ఉద్దేశంతో జాతీయ, ప్రాంతీయ ప్రధాన మీడియా సంస్థలను నయానా, భయానా లోబర్చుకున్నారు. ప్రభుత్వ వ్యతిరక స్వరమే కాకుండా ప్రజల గొంతు కూడా వినిపించకుండా ప్రజాస్వామ్యానికి నాల్గవ పిల్లర్‌గా ఉన్న మీడియా గొంతునూ నొక్కేస్తున్నారు.

మావోయిస్టు పార్టీలో లొంగుబాట్లు ఈనాడు కొత్తేమీ కాదు. ఉద్యమంలో యాక్టివ్‌గా పాల్గొనడంలోని ఇబ్బందులు, కష్టాల రీత్యా గతంలో లొంగిపోయారు. గత కొన్ని దశాబ్దాలుగా ఈ ప్రక్రియ కొనసాగుతున్నది. ప్రభుత్వాలు సైతం లొంగుబాట్లను ప్రోత్సహిస్తున్నాయి. కానీ ఆయుధాలతో లొంగిపోయినవారు వేళ్ళమీద లెక్కపెట్టగలిగిన స్థాయిలోనే ఉన్నారు. లొంగిపోయిన తర్వాత పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడే మాజీలు చాలా తక్కువ మంది. కానీ ఇప్పుడు మావోయిస్టు పార్టీని పూర్తిస్థాయిలో నిర్మూలించడానికి ఆపరేషన్ కగార్ సైద్ధాంతిక విభేదాలు, అగ్ర నాయకుల మధ్య భిన్నాభిప్రాయాలు, పార్టీలో చీలిక లాంటి అస్త్రాలనూ కేంద్ర సర్కారు ఎంచుకున్నది. తాజాగా సమాజంలో చర్చకు దారితీసిన అభయ్ అలియాస్ సోనూ పేరుతో వస్తున్న లేఖాస్త్రాలు, అందులో ప్రస్తావిస్తున్న పార్టీ పంథా, మార్చుకోవాల్సిన అవసరం.. ఇవన్నీ ప్రభుత్వాలు సృష్టించిన అస్త్రమే. అనివార్యంగా కొందరు నేతలు ప్రభుత్వాల చేతుల్లో పావులుగా మారి మావోయిస్టు పార్టీలో సంక్షోభానికి కారకులయ్యారు.

ఐదు దశాబ్దాల విప్లవోద్యమం తెలంగాణ హద్దులు దాటి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఒడిశా, చత్తీస్ఘడ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, జారండ్, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలకు విస్తరించింది. తమిళనాడు, కేరళ, హర్యానా, పంజాబ్ తదితర రాష్ట్రాల్లో పట్టణ యూనిట్లు రహస్యంగా పనిచేస్తున్నాయని ప్రభుత్వాలే వివిధ సందర్భాల్లో అర్బన్ నక్సలైట్లు అని కామెంట్ చేసినప్పుడు ప్రస్తావించాయి. ఈశాన్య రాష్ట్రాల్లోని జాతుల పోరాటం కొనసాగిస్తున్న పార్టీలతోనూ మావోయిస్టు పార్టీ సన్నిహిత సంబంధాల్లో ఉన్నట్లు కేంద్ర హోంశాఖ నివేదికలు కూడా వెల్లడించాయి. తెలంగాణ ఏర్పడిన తరవాత ప్రజాస్వామిక తరహా పాలన వస్తుందని భావించిన ప్రజలకు నిరాశ ఎదురుకావడంతో ఇప్పుడు మావోయిస్టులు ఉంటేబాగుండేదని ఓపెన్ కామెంట్లే వచ్చాయి. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి నిజామాబాద్ పర్యటన సందర్భంగా రైతులు కూడా ఇదే కోరుకుంటున్నారంటూ వ్యాఖ్యానించారు.

దేశంలోని అనేక ప్రాంతాల్లోనూ ఇలాంటి అభిప్రాయమే ఉన్నది. ప్రజల తలలో నాలుక లాగా మారిన మావోయిస్టు పార్టీని నిర్మూలించడం మాత్రమే కాక దానిపట్ల ప్రజల్లో ఏహ్యాభావం కలిగేలా చీలిక, సైద్ధాంతి పోరాటం, సాయుధ పోరాట పంథాలో భిన్నాభిప్రాయాలు, ఆయుధాల అప్పగింత.. ఇలాంటి గందరగోళం తలెత్తేలా వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నది. మరోసారి మావోయిస్టు ఉద్యమం ఏ రూపంలోనూ ఉనికిలోకి రాకుండా, ప్రజలు దానిపట్ల ఆకర్షితులు కాకుండా మైండ్ గేమ్ ఆడుతున్నది. ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నంతకాలం ప్రతిఘటన తప్పదని, అది ఏదో ఒక రూపంలో బద్దలు కాక తప్పదని, అలాంటి పరిస్థితులు కొనసాగినంతకాలం ప్రజల మద్దతుతో విప్లవోద్యమ పార్టీలు ఉంటాయన్న వాదనలూ లేకపోలేదు. సముద్రానికి ఆటుపోట్లు ఎంత సహజమో ప్రజల కష్టాలు ఉన్నంతకాలం వారికి నాయకత్వం వహించే ఉద్యమ పార్టీలూ ఉండడం అంతే అనివార్యం.

ఆరు నెలల మంగ్లీ సోడి ఉదంతంతో ప్రారంభమైన ఆపరేషన్ కగార్ హత్యాకాండ 70 ఏండ్ల వయసున్న మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు హత్యతో ఆగిపోదు. ఆదివాసీలకు అడవి తప్ప మరో ఆధారం లేనంతకాలం వారు ఉద్యమిస్తూనే ఉంటారు.. వారికి నాయకత్వం వహించడానికి మావోయిస్టు పార్టీ లాంటివి ఉంటూనే ఉంటాయి. కానీ ఎప్పటికైనా ఉద్యమ పార్టీలను నిర్మూలిస్తామని భావిస్తున్న కేంద్ర ప్రభుత్వం గతంలోని సాల్వ జుడుం ఆపరేషన్ గ్రీన్ హంట్, ఆపరేషన్ ప్రహార్, ఆపరేషన్ సమాధాన్ లాంటివి సక్సెస్ కాలేదనే సత్యాన్ని గమనంలో ఉంచుకోవాలి. సమస్యలున్నంతకాలం పరిష్కారం కోసం, న్యాయం కోసం ప్రజా పోరాటాలు ఉంటాయనేది ప్రపంచ చరిత్ర చెప్పిన సత్యం. వాటికి అణచివేత, ఆపరేషన్లు, ఎన్కౌంటర్లు ఎన్నటికీ పరిష్కారం కాదు. ఆదివాసీ ప్రజలు సాధించుకున్న అడవి హక్కుల చట్టం, పీసీ చట్టం, 1/70 చట్టం.. ఇవన్నీ ఉద్యమాలు, పోరాటాల ద్వారా ప్రజాస్వామ్యబద్ధంగా పార్లమెంటు వేదికగా రూపొందినవే. వాటి అమలులోనే ప్రజాస్వామిక స్ఫూర్తి పరిఢవిల్లుతుంది.

ప్రజలను నిర్మూలించి లేదా తరలించి మైనింగ్ కార్యకలాపాలను సాగించడం లేదా మన సహజ వనరులను బడా బహుళజాతి సంస్థలకు కట్టబెట్టడమంటే దేశాన్ని వాటికి అప్పగించడమే. బ్రిటిషు పాలకులు దేశాన్ని వలసగా మార్చుకుని చేసిన ఘనకార్యాన్నే ఇప్పుడు ఏడున్నర దశాబ్దాల స్వతంత్ర భారతదేశంలో మోడీ సర్కారు చేస్తున్నది. సొంత గడ్డపై ఆదివాసీలు పరాయిజీవులుగా మిగిలిపోతున్నారు.



**ఎన్. నారాయణ రావు**
**ప్రధాన కార్యదర్శి**
**పౌరహక్కుల సంఘం**

# స్థానిక సంస్థల ఎన్నికలపై ఉత్కంఠ..

- ఎన్నికలు జరిగేటట్ల లేనట్లా..
- ఈనెల 8వ తేదీన హైకోర్టు ఇచ్చే తీర్పుపై నాయకుల్లో టెన్షన్
- గ్రామాల్లో కనిపించని ఎన్నికల సందడి
- అయోమయంలో పోటీ చేసే యోచనలో అభ్యర్థులు



**వికారాబాద్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 4 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడానికి రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన గ్రామాల్లో ఎన్నికల సందడి మొదలు కాలేదు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయా లేదా అనే విషయమై గ్రామాల్లో నాయకులంతా సంశయం లో ఉన్నారు. ఈనెల 8వ తేదీన స్థానిక సంస్థల నిర్వహణపై హైకోర్టు తీర్పు వెలబడనుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఒక జీవో జారీ చేసింది. ఇది విషయమై బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించాలని రాష్ట్ర గవర్నర్ ఆమోదం కోసం ఒక నివేదికను పంపింది. ఈ రిజర్వేషన్ల ఆమోదముకై కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి ఆమోదంపై ప్రతిపాదన చేయవలసి ఉంది. గవర్నర్ రాష్ట్రపతి ఆమోదం లేకుండా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎలా జారీ చేస్తుందని విషయమై హైకోర్టు వ్యాఖ్యానించడంతో ఎన్నికలు జరుగుతాయా లేదా అనే విషయమై గ్రామాల్లో నాయకులు సందిగ్ధంలో పడ్డారు. ఎన్నికలు నిర్వహించడానికి మరో మూడు నెలలు పాటు అవకాశాన్ని తీసుకోవచ్చని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అన్ని వర్గాలకు 50 శాతానికి మించి రిజర్వేషన్లు ఉండకూడదు అని రాజ్యాంగంలో పొందుపరిచిన కారణంగా రిజర్వేషన్లు ఎలా సర్దుబాటు చేస్తారనే విషయమై రాజకీయ నాయకులు సందిగ్ధంలో ఉన్నారు. దీంతో దసరా పండగలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలని భావించే రాజకీయ నాయకుల సందడి కనిపించలేదు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఎన్నికల షెడ్యూలు విడుదల చేయగానే దసరా పండుగలు రాజకీయ నాయకులు సందడి చేసి ఓటర్లను ఆకట్టుకునే యోచనలో ఉండిరి. కానీ స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టులో పిటీషన్లు దాఖలు కావడం వాటిపై హైకోర్టు వ్యాఖ్యానించడం పట్ల రాజకీయ నాయకుల్లో ఉన్న జోష్ తగ్గిపోయింది. స్థానిక సంస్థల నిర్వహణపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా హైకోర్టు తీర్పు వస్తే ఎన్నికలు ఎలా నిర్వహించాలనే విషయమై రాష్ట్ర ప్రభుత్వం మరో ప్రతిపాదన సిద్ధం చేసే అవకాశం ఉంటుందని రాజకీయ నాయకులు భావిస్తున్నారు. అది సాధ్యం కాకపోవచ్చునని ప్రతిపక్ష పార్టీలు భావిస్తున్నాయి. కానీ కాంగ్రెస్ బి ఆర్ ఎస్ బిజెపి పార్టీల నాయకులు గ్రామాల్లో ఉన్న నాయకుల్లో జోష్ పెంచడానికి కసరత్తు ప్రారంభించారు. ఎంపీటీసీ జెడ్ డ్పీటీసీల అభ్యర్థుల ఎంపిక కోసం గ్రామ మండల స్థాయిలో ముగ్గురేసి అభ్యర్థుల పేర్లు అధిష్టాన వర్గానికి పంపించాలని హై కమాండ్ ఆదేశించింది. దీనికోసం మండల జిల్లా స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసి గ్రామాల్లో ప్రజా ఆదరణ ఉన్న నాయకులను అభ్యర్థులుగా ఎంపిక చేయాలని యోచిస్తుంది. ఏది ఏమైనా నాయకులంతా కోర్టు తీర్పుపై ఆధారపడి ఉన్నారు. కోర్టు తీర్పు ఎలా ఉంటుందో వేచి చూద్దాం...

## అమ్మవారి ఆశీస్సులు భక్తులపై నిరంతరం ఉండాలి

- అన్న ప్రసాద దాతకు ఘనంగా సన్మానం
- మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వర్త్య విఠల్ నాయక్



**తాండూరు, అక్టోబర్ 4 (జనంసాక్షి) :** అమ్మవారి ఆశీస్సులు భక్తులపై నిరంతరం ఉండాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వర్త్య విఠల్ నాయక్ పేర్కొన్నారు. శనివారం తాండూరు పట్టణంలోని ఆదర్శనగర్ లో వెలసిన కట్టమైసమ్మ దేవాలయంలో తొమ్మిది రోజుల పాటు నవరాత్రి ఉత్సవాల్లో చివరి రోజు బతుకమ్మ సంబరాల్లో అన్న ప్రసాద దాత అయినటువంటి మారేపల్లి సంజీవరెడ్డిని శ్రీ మాతా కట్ట మైసమ్మ ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు వర్త్య విఠల్ నాయక్, ఆలయ అధ్యక్షులు నరేష్ ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వర్త్య విఠల్ నాయక్ మాట్లాడుతూ భక్తులకు అమ్మవారి ఆశీస్సులు నిండుగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. దాతలు ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ మెకానిక్ , నల్ల పాపయ్య , అంజలయ్య తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ నీళ్ల సరఫరాలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం

- మాజీ మంత్రి మహేశ్వరం సబితాఇంద్రారెడ్డి



**చేవెళ్ల, అక్టోబర్ 4 (జనంసాక్షి) :** మిషన్ భగీరథ నీళ్ల సరఫరాలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమని మాజి మంత్రి మహేశ్వరం సబితాఇంద్రారెడ్డి అన్నారు. చేవెళ్ల నియోజకవర్గం అంతారం గ్రామంలో మిషన్ భగీరథ నీళ్లు సరఫరా లేక ఇబ్బంది పడుతున్న గ్రామ ప్రజల కష్టాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సబిత ఇంద్రా రెడ్డి మాట్లాడుతూ...మిషన్ భగీరథ నీళ్ల సరఫరాలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం పిల్లలకు శాపంగా మారిందని, తల్లిదండ్రులు పొలం పనులకు పోతే నేటి బాలలే రేపటి పౌరులుగా ఎదగాల్సిన ఈ చిన్న పిల్లలు మిషన్ భగీరథ రాక బోరు నీళ్లు పట్టుకోవడం చాలా బాధాకరమని, గ్రామ ప్రజలు తాగు నీటి కోసం పడుతున్న కష్టం మారుమూల ప్రజలకు శాపంగా మారింది అని ఆవేదన వ్యక్తము చేశారు, నాటి నీటి గోస దృశ్యాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వల్ల మళ్ళీ చూస్తున్నాం అని తెలిపారు. పథకాలు అమలులో వైఫల్యం. పరిపాలనలో వైఫల్యం, చివరకు కెసిఆర్ ప్రారంభించిన మిషన్ భగీరథ ద్వారా నీళ్ళు సరఫరా చేయడంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందినదని అన్నారు.

## ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన నేత ఇంద్రారెడ్డి

- మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి



**చేవెళ్ల, అక్టోబర్ 4 (జనంసాక్షి) :** స్వర్గీయ మాజీ హెూంశాఖ మంత్రి పట్లోళ్ల ఇంద్రారెడ్డి సేవలు ఎప్పటికీ మరువలేనివని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రా రెడ్డి అన్నారు. శనివారం ఇంద్రారెడ్డి జయంతి సందర్భంగా చేవెళ్ల మండలంలోని స్వగ్రామం కౌకుంట్లలో ఆయన సమాధి వద్ద సబితారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...ప్రజల కోసం ఇంద్రారెడ్డి ఎన్నో ఉద్యమాలు చేసి వారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారు. హెూంశాఖ మంత్రిగా రాష్ట్రానికి స్ఫూర్తిదాయకమైన సేవలందించారు. ఆయన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుంది అని కొనియాడారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, రాష్ట్ర కనీస వేతన సలహామండలి మాజీ చైర్మన్ నారాయణ, రంగా రెడ్డి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్, బీఆర్ఎస్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వంగ శ్రీధర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కోనపురం శశిపాల్, దశరత్, స్థానిక నాయకులు దర్శన్, వనం మహేందర్‌రెడ్డి, ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కెప్టెన్ అంజన్‌గౌడ్, చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, నేతలు బేగరి సుదర్శన్, కావలి శేఖర్, మల్లారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, దండు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మోత్కూర్‌లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలు



**దోమ, అక్టోబర్ 4 (జనం సాక్షి) :** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మోత్కూర్ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి విజయదశమి ఉత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జంగం నాగయ్య మరియు వక్తగా పాలమూరు విభాగ సహకార్యవాహ కెరలి అనంతరెడ్డి పాల్గొనడం జరిగింది. అనంత రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తీసుకున్నటువంటి పంచ పరివర్తన్ అయినటువంటి ఐదు నియమాలు 1.సామాజిక సమరతత,2.పర్యావరణ పరిరక్షణ, 3.కుటుంబ ప్రబోధన్,4.స్వదేశీ,5. పౌర నియమావళి గురించి ఉపన్యాసించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.

## పథకాలను విస్తృతంగా ప్రచారం చేయండి



**మహేశ్వరం, అక్టోబర్ 4 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులకు మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేఎల్ఆర్ సూచించారు. శనివారం తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహేశ్వరం, కందుకూరు మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ...ఫ్యూచర్ సిటీతో మహేశ్వరం నియోజకవర్గం మహానగరంగా మారుతుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో చేయలేని సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లలో అనేక సంక్షేమ పథకాలను చేపట్టిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు,రేషన్ కార్డు,సన్నబియ్యం, ఉచిత విద్యుత్,రెండు లక్షల రుణమాఫీ,పేదలకు ఇందిరమ్మ ఇండ్లు అందిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంద్రారెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలి



**రాజేంద్రనగర్, అక్టోబర్ 4 (జనంసాక్షి) :** ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిన మహా నాయకుడు స్వర్గీయ మాజీ హెూంమంత్రి పట్లోళ్ల ఇంద్రారెడ్డి అని రాజేంద్రనగర్ నియోజకవర్గం టిఆర్ఎస్ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తిక్ రెడ్డి పేర్కొన్నారు. నార్సింగి మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డిఆధ్వర్యంలో ఇంద్రారెడ్డి జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి జయంతి నివాళులు అర్పించారు. శనివారం గండిపేట చౌరస్తా లో ఉన్న ఇంద్రారెడ్డి విగ్రహానికి ఆయన జయంతి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన రంగారెడ్డి జిల్లాలో ప్రజా సమస్యలపై ఆయన చేసిన పోరాటం అలుపెరగనిదని, ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్న ప్రజా నాయకుడు ఇంద్రారెడ్డి అని ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ నిజాముద్దీన్, ముక్తార్, ముత్యాలు, మల్లేష్, చిరంజీవి, సయ్యద్ సత్తార్ ఖాన్, మహమూద్ విష్ణువర్ధన్, సయ్యద్, నరసింహ,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## లౌకిక ప్రజాస్వామ్య పార్టీలో కలిసి పోటీ చేస్తాం

- సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమకుల జంగయ్య

**రాజేంద్రనగర్, అక్టోబర్ 4 (జనం సాక్షి) :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కలిసివచ్చే లౌకిక ప్రజాస్వామ్య పార్టీలతో కలిసి పోటీ చేస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమకుల జంగయ్య పేర్కొన్నారు. శనివారం సిపిఐ జిల్లా కౌన్సిల్ సమావేశం శంషాబాద్ పట్టణంలోని విస్తా హెూటల్ కాన్ఫరెన్స్ హాల్లో పల్నాటి యాదయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే జెడ్పిటిసి, ఎంపిటిసి సర్పంచి ఎన్నికలలో కలిసివచ్చే ప్రజాస్వామ్య లౌకిక పార్టీలతో కలిసి కూటమిగా ఏర్పడి పోటీ చేయాలని మతతత్వ శక్తులను ఓడించాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గ్రామాలలో సిపిఐ కార్యకర్తలు ప్రజా సమస్యల మీద పోరాడుతూనే ప్రజలకు చేరువ కావాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర నాయకులు పుస్తకాల నర్సింగ్ రావు, పానుగంటి పర్వతాలు, కె. రామస్వామి ఓరుగంటి యాదయ్య, బుద్ధుల జంగయ్య, టి. రామకృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## మతసామరస్యాలకు ప్రతీక గ్యార్మి ఉత్సవాలు



**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 4 (జనం సాక్షి) :** మతసామరస్యాలకు ప్రతీకగా గ్యార్మీ ఉత్సవాలు ఉండాలని కుత్బుల్లాపూర్ బిఆర్ఎస్ నాయకులు కొలుకుల జైహింద్ అన్నారు. శనివారం షేక్ ఫిరోజ్ ఆధ్వర్యంలో గ్యార్మి ఉత్సవాలను పురస్కరించుకుని జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీ లోని దర్గా ను సందర్శించి ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగద్గిరిగుట్ట డివిజన్ సర్వమతాలకు నిలయమన్నారు. ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సయ్యద్ సాజిద్, సయ్యద్ మాజీద్, మోజస్, ఫిరోజ్, ప్రభాకర్, మైలారం రాజు, శ్రీనివాస్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 6న చలో హైదరాబాద్ హెచ్ఎండిఏ కార్యాలయం ముట్టడి

- ఆర్ఆర్ఆర్ అలైన్మెంట్‌పై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతనివ్వాలి
- సిపిఎం డిమాండ్



**మోమిన్‌పేట, అక్టోబర్ 4 (జనం సాక్షి) :** వికారాబాద్ జిల్లా లోని మోమిన్ పేట్ మండల పరిధిలోని దేవరంపల్లి, టేకులపల్లి గ్రామంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్ జిల్లా కమిటీ సభ్యులు సతీష్ లు రీజినల్ రింగ్ రోడ్డు బాధితులతో శనివారం మాట్లాడి సమస్యలు తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్ మాట్లాడుతూ ఆర్ ఆర్ ఆర్ లో భూ బాధితులతో మాట్లాడి వారి అభిప్రాయాలు లేకుండా బలవంతపు పంట పొలాలో భూ సేకరణ చెయ్యడం వెంటనే ఆపాలిలి ఈ పాలకుల ప్రభుత్వ నియంత పోకడలు ఆపాలి. ఈ నియంత పోకడలు ఎండగడుతూ, ఈ నెల 'ఆరు'న సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో 'హెచ్ఎండీఏ ముందు నిర్వాసితుల ధర్నా నిర్వహిస్తున్నము భూ బాధితులు అందరూ పాల్గొనాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్ తెలిపారు. రీజనల్ రింగ్ రోడ్డు ఆర్ ఆర్ ఆర్ మార్పు, ప్రజల్లో వ్యక్తమవుతున్న అనుమానాలు, ఆరోపణలతో పాటు నిర్వాసితుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతనివ్వాలనీ, 2013 చట్టం ప్రకారం పేర రైతులకు న్యాయం చేయాలని సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఈ ప్రభుత్వనికి డిమాండ్ చేసింది. ఈ నెల 6న సిపిఐఎం హైదరాబాదులో హెచ్ఎండీఏ కార్యాలయం ముందు నిర్వాసితులతో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులతో మాట్లాడకుండా, గ్రామ సభలు, నిర్వహించకుండా, భూమి సేకరణలో స్పష్టతనివ్వకుండా బలవంతంగా భూములను తీసుకోవాలని ప్రయత్నం చేస్తే రైతుల నుండి తీవ్రమైన ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. అలాంటి పరిస్థితి రాకుండా రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. మొత్తం 8 జిల్లాలు, 33 మండలాలు, 163 గ్రామాల పరిధిలో 200 మీటర్ల వెడల్పుతో ఆ రోడ్డును నిర్మించాలని హెచ్ఎండీఏ నోటిఫికేషన్ ఇచ్చిందని గుర్తు చేశారు. దీనికోసం భూములు తీసుకుంటామనీ, రైల్వే ట్రాక్ కోసం మరొక 40 అడుగుల వెడల్పుతో రోడ్డును పెంచుతామని ప్రభుత్వం చెబుతున్నదని తెలిపారు. ఇంతకు ముందు మొదటి అలైన్ మెంట్ తయారుచేశారనీ, తర్వాత దాన్ని మార్చి రెండోసారి అలైన్మెంట్, ఇప్పుడు మూడో అలైన్మెంట్ను తయారుచేసి విడుదల చేశారని చెప్పారు. ఇందులో రాజకీయ అండదండలు, డబ్బు, పలుకుబడి ఉన్న వారి భూముల జోలికి వెళ్లకుండా లేకుండా ఎకరం, రెండు, మూడెకరాలున్న చిన్న, సన్నకారు రైతులకు సంబంధించిన భూములున్న ప్రాంతాన్నే రింగ్ రోడ్డు కోసం తీసుకుంటున్నట్లుగా పెద్దఎత్తున ఆరోపణలొస్తున్నాయని గుర్తు చేశారు. 2013 చట్టం ప్రకారం గ్రామ సభల ద్వారా రైతుల ఆమోదం తీసుకోవాలన్నారు. భూమికి భూమి ఇవ్వాలనీ, మార్కెట్ రేటుకు మూడింతలు అదనంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులకు తగిన విధంగా న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. 'ఆ భూములను నమ్ముకునే బ్రతుకుతున్నామనీ, మరో అవకాశం లేదనీ' రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రింగ్ రోడ్డు అలైన్మెంటును ఎందుకు మార్చుతున్నారో స్పష్టతనివ్వాలనీ, కొద్దిమంది పెద్దల ప్రయోజనాల కోసం సామాన్యమైన చిన్నరైతుల జీవితాలను దెబ్బతీసేవైఖరిని మార్చుకోవాలని సూచించారు. ఈనెల 6న జరగనున్న హైదరాబాదులో జరగనున్న రీజినల్ రింగ్ రోడ్డు ధర్నాలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఆర్ ఆర్ భూ బాధితులు కృష్ణ రెడ్డి శశికళ నాగిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి,నర్సింలు ప్రభు సిద్ధ రెడ్డి, బాబు బాలరాజు అనిల్ రెడ్డి రామచంద్రారెడ్డి రవి మానేయా నర్సింలు దేవయ్య రాములు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
05 అక్టోబర్ 2025

# అమ్మాయిలు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలి

- సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్

**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 4 (జనం సాక్షి) :** సమాజంలో ఆర్థికంగా, గౌరవప్రదంగా ఎదిగేందుకు అమ్మాయిలు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ అన్నారు. సెర్ప్, యూనిసెఫ్ ఆధ్వర్యంలో శనివారం గద్వాల వజ్రా అభినందన్ బ్యాంకేట్ హాల్లో స్నేహ సంఘాల కిషోర్ బాలికలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నుంచి సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. విద్యాపరంగా, ఆర్థికంగా వెనకబడ్డ జోగులాంబ గద్వాల జిల్లాలో స్నేహ సంఘాలు బాలికల సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేస్తాయని అన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు ఇప్పటికే ఎంవిఎఫ్ ఫౌండేషన్ కృషి చేస్తుండగా ప్రస్తుతం యూనిసెఫ్ సహకారంతో కిషోర్ బాలికల సాధికారతకు ముందుకెళ్లడం జరుగుతుందన్నారు. చదువు మానేసిన బాలికలు తిరిగి విద్యను



అభ్యసించేందుకు ఓపెన్ టెన్త్, ఇంటర్ చదివేలా ప్రోత్సహించాలన్నారు. బాలికల సమస్యలు గుర్తించడంలో ఆయా గ్రామాల్లోని స్వయం సహాయక సంఘాల సభ్యులు తోడ్పాటు అందించాలన్నారు. స్నేహ సంఘాలు మన రాష్ట్రానికే కాక యావత్ దేశానికి రోల్ మోడల్గా నిలవాలని ఆకాంక్షించారు. అదనపు కలెక్టర్ నర్సింగరావు మాట్లాడుతూ స్నేహ సంఘాల సభ్యులు తమకు ఏ సమస్య ఉన్న సంబంధిత అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. స్నేహ సంఘాల ద్వారా ఆధార్ కార్డులు,జనన ధ్రువీకరణ పత్రాలు లేనివారికి ఇప్పించడమే కాక బ్యాంకు ఖాతాలు సైతం ఓపెన్ చేయించడం జరుగుతుందన్నారు. జిల్లాలో 8 వేల మందికి పైగా బాలికలు సంఘాల్లో ఉన్నారని, ఇంకా సుమారు 15 వేల మంది బాలికలు సంఘాల్లో చేరాల్సి ఉందని తెలిపారు. చదువుతోపాటు ఆరోగ్యంపై దృష్టి సాధించినప్పుడే అనుకున్న లక్ష్యాలు నెరవేర్చుకునేందుకు అవకాశం ఉందన్నారు. అనంతరం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన పలువురు బాలికలు వివిధ అంశాలపై ఆటపాటలు, నాటికలతో అలరించారు. సమావేశంలో యూనిసెఫ్ ప్రతినిధులు మురళీకృష్ణ, మేరీ జోన్స్, ఇన్చార్జి డిఇఓ విజయలక్ష్మి, డిఆర్డిఏ ఏపీడి శ్రీనివాస్, డిప్యూటీ డిఎంహెచ్వో సంధ్య కిరణ్మయి, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ప్రభావతి, డిఆర్డిఏ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కోడ్ ముగిసే వరకు ప్రజావాణి రద్దు

- కలెక్టర్ పట్నాయక్



**నారాయణపేట జిల్లా బ్యూరో, అక్టోబర్ 4 (జనం సాక్షి) :** జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో ప్రతి సోమ వారం కలెక్టరేట్లో నిర్వహిం చే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పిటిసి ఎంపీటీసీ, స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరగదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని జిల్లాలోని ప్రజలంతా గమనించి ప్రజలు సహకరించాలని తెలిపారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు సహకరించాలి



**మల్దకల్, అక్టోబర్ 4 (జనంసాక్షి) :** స్థానిక సంస్థలఎన్నికలు 2025 సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎన్నికలు సజావుగా సాగుటకు,ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎంపిటిసి,జడ్పిటిసి,సర్పంచ్ ఎన్నికలకు సహకరించాలని మండల పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో మండల తహసిల్దార్ ఝాన్సీరాణి, మండల ఎస్సై నందికర్, ఎంపీడీవో ఆంజనేయరెడ్డి, మండల పంచాయతీ అధికారి రాజశేఖర్,పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం



**మక్తల్, అక్టోబర్ 4 (జనంసాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదామని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మక్తల్ పట్టణంలోని ద్వారకా ఫంక్షన్ హాల్ లో మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశానుసారం శనివారం మక్తల్ మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రాబోయే ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసే ప్రతి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మఖ్తల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గణేష్ కుమార్, మాజీ జెడ్పిటిసి లక్ష్మారెడ్డి, మాజీ ఎంపిపి గడ్డంపల్లి హనుమంతు, మాజీ ఉప సర్పంచ్ కట్టా సురేష్, మత్స శాఖ జిల్లా మాజీ అధ్యక్షులు కోళ్ల వెంకటేష్, మార్కెట్ డైరెక్టర్లు డైరెక్టర్లు, శ్రీనివాసులు, రంజిత్ రెడ్డి, ఫయాజ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బిల్డర్ తాయప్ప, కావలి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో వివిధ విపత్తు పరిస్థితులపై మాక్ వ్యాయామాలు నిర్వహించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

**గద్వాల నడిగడ్డ, అక్టోబర్ 4 (జనం సాక్షి) :** జిల్లాలో వివిధ విపత్తు పరిస్థితులపై మాక్ వ్యాయామాలు నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం మరియు టేబుల్ టాప్ వ్యాయామం నిర్వహించబడినది.ఈ మాక్ వ్యాయామాలు జిల్లా అధికారులు, సివిల్ డిఫెన్స్,అగ్నిమాపక శాఖ, సివిల్ పోలీస్, హెూంగార్డ్స్ మరియు ఇతర సంబంధిత శాఖల సమన్వయంతో నిర్వహించబడతాయి. ఈ నెల 9వ తేదీన అలంపూర్ నది దగ్గర ఉదయం 10:00 నుండి 01:00 ప్రధాన మాక్ ఎక్సర్సైజ్ నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, అలాగే ప్రభుత్వానికి నివేదిక పంపుటకు ఆదేశాలు అందాయనీ



అన్నారు. సంబంధిత శాఖలు, అధికారులు ఈ కార్యక్రమాలకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ఎన్డిఆర్ఎఫ్ కమాండెంట్ దామోదర్ సింగ్, ఎస్డిఆర్ఎఫ్ కమాండెంట్ పాణి, అసిస్టెంట్ కమాండెంట్, 10వ బెటాలియన్, అగ్నిమాపక సిబ్బంది, ట్రాఫిక్ ఎస్ఐ తదితరులు పాల్గొన్నారు.

## బొబ్బిలిగామ లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

- నేటివ్ ఇండియన్స్ ఫోరం ఆధ్వర్యంలో వేడుకలు



**సదాశివపేట, అక్టోబర్ 4 (జనం సాక్షి) :** దసరా పండగ అనంతరం నిర్వహించే బతకమ్మ సంబరాలు సదాశివపేట మండల పరిధి బొబ్బిలిగామ గ్రామంలో శనివారం బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను గ్రామ మహిళలు, యువతులు ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు. పూలతో అలంకరించిన బతుకమ్మలను గ్రామంలోని మహిళలు సమూహాలుగా తీసుకువచ్చి, బతుకమ్మ పాటలు పాడుతూ, ఆట పాటలతో గ్రామ వాతావరణాన్ని పండగ శోభతో నింపారు.ఈ వేడుకలో ప్రఖ్యాత జానపద గాయకురాలు తేలు విజయ బృందం ప్రదర్శించిన ఆట పాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తెలంగాణ జానపద కళలకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చిన ఈ ప్రదర్శనలు గ్రామ ప్రజలను అలరించాయి. జానపద గేయాలు, సంప్రదాయ నృత్యాలు పల్లె వాతావరణాన్ని మేళవించాయి.ఈ సందర్భంగా నేటివ్ ఇండియన్స్ ఫోరం జాతీయ అధ్యక్షులు బీరయ్య యాదవ్, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బత్తుల విక్రమ్, గ్రామ సర్పంచ్ కుమార్, వార్డ్ సభ్యులు, గ్రామ పెద్దలు, యువత, గ్రామస్తులు అందరూ ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. బతుకమ్మ పండుగ ద్వారా గ్రామమంతా పూల వాసనలతో, ఆట పాటల సందడితో నిండిపోయింది. ఈ వేడుకలు కొత్త తరానికి తెలంగాణ సంప్రదాయాలపై అవగాహన కలిగించడంతో పాటు, పల్లె జీవితానికి ఆధ్యాత్మిక ఆనందాన్ని అందించాయని నిర్వాహకులు తెలిపారు.

## కురుమలు అన్ని రంగాల్లో ముందుండాలి

- స్థానిక సంస్థల్లో కురుమల ఐక్యతను చాటి చెప్పాలి
- జీహెచ్ఎంసీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్ప నగేష్ కురుమ
- సిద్దిపేటలో కురుమల అలాయ్-బలాయ్

**చేర్యాల/సిద్దిపేట, అక్టోబర్ 4 (జనంసాక్షి) :** కురుమ కులస్తులు అన్ని రంగాల్లో రాణించి స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించి సత్తా చాటాలని జీహెచ్ఎంసీ కార్పొరేటర్, కురుమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూరుగడ్డ పుష్ప-నగేష్ కురుమ అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని శనివారం పటేల్ గార్డెన్ లో కురుమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కురుమల అలాయ్ - బలాయ్ కార్యక్రమానికి కురుమ సంఘం జిల్లా అధ్యక్షులు కోరె ఎల్లయ్య అధ్యక్షతన వహించగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జనాభా ప్రాతిపదికన 18 శాతం ఉన్న కురుమలు విద్య, వైద్యం, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో వెనుకబడి ఉన్నారని, మేమెంతో మకంత వాటా వచ్చేంతవరకు పోరాటం



నిర్వహిస్తామని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు కురుమలకు సముచిత స్థానం కల్పించి సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం బర్మ రాజమల్లయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి అందె నాని బాబు, మీస సత్యనారాయణ, శేవల్ల రాజయ్య, అందె అశోక్, సిగిరి కొమురయ్య, బింగి ఐలయ్య, మేక మల్లేశం, సంగం ఐలయ్య, బింగి స్వామి, ఎర్రోళ్ల రమేష్, ఈరి భూమయ్య, శెట్టె కొమురయ్య, అతిన మధు, తదితరులు పాల్గొన్నారు.

## శోభాయమానంగా దుర్గామాత నిమజ్జన శోభా యాత్ర



**నారాయణపేట, అక్టోబర్ 4 (జనం సాక్షి) :** దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నారాయణపేట మండల పరిధిలోని జాజాపూర్ ఈశ్వర్ మందిర్ లో ప్రతిష్టించిన దుర్గామాత నిమజ్జన వేడుకలు డాక్టర్ రాజకుమార్ గురుస్వామి ఆధ్వర్యంలో శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో చెరువులో ఘనంగా నిమజ్జనం చేశారు.ఈ సందర్భంగా ఉదయం దుర్గామాతకు డాక్టర్ రాజ్ కుమార్ ఆధ్వర్యంలో డాక్టర్ మధుసూదన్ రెడ్డి దంపతు లు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం దుర్గామాత శోభయాత్ర గ్రామ పురవీధుల గుండా శోభయామానంగా కొనసాగింది. శనివారం చండీ హెూమం పూర్ణాహుతి మహా మంగళ హారతి తదితర పూజలు చేపట్టారు.నిమర్జనం ఊరేగింపులో మహిళలు చిన్నారులు నృత్యాలు చేస్తూ భక్తులను విశేషంగా ఆకట్టుకున్నారు. జాజాపూర్ భజన మండలి మహిళా సంఘాల సభ్యులు భక్తులు నిమర్జనం వేడుకలు తిలకించేందుకు భారీ ఎత్తున తరలివచ్చి తమ భక్తిని చాటారు.ఈ సందర్భంగా గురు స్వామి డాక్టర్ రాజ కుమార్ మాట్లాడుతూ దుర్గా మాత ఆశీస్సులు ప్రతి ఒక్క రిపై ఉండాలని అన్నారు. దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మ వారిని రోజుకో రూపం లో అలంకరించామని అన్నారు. దుర్గాదేవి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతు లతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్ర మంలో గ్రామంలోని యువ కులు మహిళలు పెద్దలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## సమిష్టిగా పనిచేసి స్థానికంలో గెలవాలి

- బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి బలరాంరెడ్డి

**కృష్ణ, అక్టోబర్ 4 (జనం సాక్షి) :** పార్టీలో విభేదాలకు తావులేకుండా అందరూ కలిసికట్టుగా కృషి చేస్తు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపిని గెలిపించాలని జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి బలరాం రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన మాగనూర్, కృష్ణ, ఉమ్మడి మండల బిజెపి కార్యకర్తల సమావేశం మండల అధ్యక్షుడు నల్లే నర్శప్ప అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కమిటీలో ప్రధాన కార్యదర్శిగా బలరాం రెడ్డి, ఉపాధ్యక్షులుగా కర్నె స్వామి, కార్యదర్శిగా కనకరాజు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఉమ్మడి మండల శాఖ తరపున ఘనంగా సన్మానించారు.



సమావేశంలో బలరాం రెడ్డి మాట్లాడుతూ నాయకులు కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి పార్టీని బలోపేతం చేయాలనీ కోరారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి జెండా ఎగురవేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా మాజీ కిసాన్ మోర్చా అధ్యక్షులు దేవరింటి నర్సింహ రెడ్డి, మక్తల్ అధ్యక్షులు ప్రతాప్ రెడ్డి, మాజీ అధ్యక్షులు జెగిలి ఊసేనప్ప, ఉట్కూరు అధ్యక్షులు చంద్రశేఖర్, మాజీ అధ్యక్షులు రమేష్, ప్రధాన కార్యదర్శులు డి రాఘవేంద్ర, కరిమని తిమ్మప్ప, అయోధ్య కరసేవకులు నాగరాజ్ కుల్కర్ని, ఉపాధ్యక్షులు వడ్ల మరెప్ప, డీకే కిష్టప్ప, బీజేవైఎం నాయకులు సంజీవ్ రెడ్డి గౌడ, సుధాకర్ రెడ్డి గౌడ, మల్రెడ్డి గౌడ, యంకప్ప కార్యదర్శి యంకప్ప గౌడ, శంకరాయ్య శెట్టి, మరెప్ప,, నారాయణబాట్, శంక్రప్ప, మాజీ సర్పంచ్ గుంతలు హన్మంత్రాయ, జెంసేర్ నర్సింగ్, ఉపసర్పంచ్ తిమ్మప్ప, బూత్ అధ్యక్షులు రాజు, పంతిగి చిన్న, గుండెల మహేష్ ఈశప్ప, మనివర్ధన్ శ్రీనందు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దుర్గామాత నిమజ్జనం



**చేర్యాల, అక్టోబర్ 4 (జనంసాక్షి) :** చేర్యాల మండలంలోని పలు గ్రామాలలో శరన్నవరాత్రుల సందర్భంగా తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న దుర్గాదేవి శుక్రవారం గ్రామాలలో అంగరంగ వైభవంగా వాడలన్నీ తిప్పుతూ పుజాలందుకొని నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఆయా మండపాల వారు దుర్గమాత విగ్రహాలను అందంగా అలంకరించి ఘనంగా శోభా యాత్ర నిర్వహించారు. భజంత్రీలతో దుర్గ మాత ఊరేగింపులో మహిళలు, యువతులు నృత్యాలు చేశారు.

## ప్రిసైడింగ్ ఆఫీసర్లకు శిక్షణ ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 4 (జనంసాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగ ప్రిసైడింగ్ ఆఫీసర్లకు శిక్షణ ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో పిఒ,ఏపీఓ లకు అక్టోబర్ 6న నిర్వహించనున్న ఒకరోజు శిక్షణ కార్యక్రమం పై ఎంపీడీఓలు, తహసీల్దార్లతో వెబ్ ఎక్స్ ద్వారా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.కలెక్టర్ వివరిస్తూ స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ నిర్వహణలో కీలక పాత్ర వహించే ప్రీసైడింగ్ ఆఫీసర్లకు శిక్షణ ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. సరైన శిక్షణ గదులు, మైక్ సిస్టమ్, పవర్ పాయింట్ ద్వారా అవగానం కల్పించేందుకు ఏర్పాట్లు తదితర అన్ని రకాల ఏర్పాట్లు ముందుగానే చేసుకోవాలని సూచించారు.ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికల



నిర్వహణ కోసం పీఓ లకు సోమవారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహించాలన్నారు. పీఓలకు ఈ ట్రైనింగ్ కార్యక్రమం చాలా కీలకమని, ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు నిబంధనలు అవగాహన చేసుకుని సన్నద్ధత కావాల్సి ఉంటుందన్నారు. శిక్షణ సందర్భంగా పోలింగ్ నిర్వహణకు సంబంధించిన అన్ని విషయాలు, పిఒల బాధ్యతలు తెలుసుకున్నప్పుడే పీఓలు సక్రమంగా పోలింగ్ కేంద్రంలో పోలింగ్ నిర్వహించగలరని, కాబట్టి శిక్షణను సీరియస్గా, శ్రద్ధగా నిర్వహించాలన్నారు. పీఓలకు శిక్షణ సమయంలో వారి విధులకు సంబంధించిన హ్యాండ్ బుక్ అందజేయాలని, నిబంధనలతో పాటు బ్యాలెట్ బాక్స్ నిర్వహణ హ్యాండ్స్ ఆన్ శిక్షణ ఇవ్వాలనీ సూచించారు. శిక్షణకు వచ్చే పీఓలకు పోస్టల్ బాలట్ ఫారం 14 కూడా అందజేయాలన్నారు. పోలింగ్ కేంద్రంలో ఏం జరిగిన పీఓలదే బాధ్యత అని, జాగ్రత్త గా వ్యవహారించాలని వారికి తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్య నాయక్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, ఆర్డివో సుబ్రహ్మణ్యం, డీపీఓ రఘునాథ్, డప్యూటీ సీఈఓ రామ మహేశ్వర్, డి ఈ ఓ అబ్దుల్ఇ ఘని, ఏ ఓ భాను, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా సహాయక కేంద్రం ఏర్పాటు

- జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

**సంగారెడ్డి, అక్టోబర్ 4 (జనం సాక్షి) :** 2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా, సంగారెడ్డి జిల్లా జడ్పీ కార్యాలయ భవన సముదాయంలో ప్రత్యేక సహాయక కేంద్రం (హెల్ప్ లైన్) ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో జిల్లా ప్రజా పరిషత్ (జెడ్ పీ టీ సీ), మండల ప్రజా పరిషత్ (ఎం పీ టీ సీ), ఎన్నికల నేపథ్యంలో నామినేషన్లు, పరిశీలన, ఉపసంహరణ,



అభ్యర్థుల తుది జాబితా, పోలింగ్ కేంద్రాలు, పోలింగ్, పోస్టల్ బ్యాలెట్ మరియు ఇతర ఎన్నికల సంబంధిత విషయాలపై సమాచారం, ఫిర్యాదులు, దరఖాస్తుల స్వీకరణ కొరకు ఈ కేంద్రం ఏర్పాటు చేయబడిందని తెలిపారు. హెల్ప్ లైన్ నంబర్ 8125352721 ద్వారా సహాయక సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రస్తుతం అమలులో ఉందని, ఉల్లంఘనకు సంబంధించిన వివరాలు పై నంబర్ ద్వారా తెలియజేయవచ్చని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా ప్రజలు ఎన్నికల నిర్వహణ, ఫిర్యాదులు, సమాచారానికి సంబంధించి, సహాయక కేంద్రాన్ని సంప్రదించవచ్చని తెలిపారు.

# మరిన్ని ప్లాట్లను విక్రయించనున్న హౌజింగ్ బోర్డు

- ఈ నెల 6 నుండి 20 వరకు వివిధ ప్రాంతాల్లో వేలం



**హైదరాబాద్, అక్టోబర్ 4 (జనంసాక్షి) :** తెలంగాణ హౌసింగ్ బోర్డు మరిన్ని ప్లాట్ల విక్రయానికి సిద్ధం అయ్యింది. ఈ నెల 6 నుండి 20 వరకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో సుమారు 100 ప్లాట్ల వేలాన్ని నిర్వహించనుంది. గత నెలలో ఈ వేలానికి సంబంధించిన నోటిఫికేషన్ జారీ చేసింది తెలంగాణ ప్రభుత్వం. ఈ భూముల వేలం మేడ్చల్, ఐఖఊః, నాంపల్లి, నిజామాబాద్, గద్వాల, సదాశివపేట, రావిర్యాల వంటి ప్రాంతాల్లో జరుగుతుంది. వేలంలో రెసిడెన్షియల్, కమర్షియల్, ఓపెన్ ప్రతి ప్లాట్‌కు ప్రత్యేకంగా రిజర్వ్ ప్రైస్ నిర్ణయించబడింది. తగిన రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించిన తర్వాత ఓ÷ుఅ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ బిడ్డింగ్ ద్వారా వేలం జరగనుంది. హౌసింగ్ బోర్డు అంచనా ప్రకారం, ఈ భూముల వేలం ద్వారా సుమారు 200 నుండి 300 కోట్ల రూపాయల వరకు ఆదాయం రావొచ్చు. ఈ విధంగా రాష్ట్రానికి అదనపు రాబడి వచ్చినట్టే, పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు కూడా వేగవంతం అయ్యే అవకాశం ఉంది. ప్లాట్ల వేలం ద్వారా జనరేటెడ్ రెవెన్యూని వివిధ సివిల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులలో వినియోగించేలా ప్రణాళికలు రూపొందిస్తోంది. కొత్త హౌసింగ్, రోడ్డులు, పార్కులు, కమ్యూనిటీ సెంటర్లు వంటి అభివృద్ధి పనులు వేగవంతం అవుతాయని అధికారులు తెలిపారు.

# అందుబాటులోకి కాలుష్య రహిత ప్రజారవాణా వ్యవస్థ

- టీజీఎస్ఆర్టీసీ నిర్ణయం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైదరాబాద్‌లో కాలుష్యరహిత ప్రజారవాణా వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నగరవాసులను అనారోగ్యానికి గురి చేసే వాయు కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు పర్యావరణ హితమైన ఎలక్ట్రిక్ బస్సులను వినియోగించాలని టీజీఎస్ఆర్టీసీని ఆదేశించింది. హైదరాబాద్ ఓఆర్ఆర్ లోపల 2027 నాటికి 2800 ఎలక్ట్రిక్ బస్సులను డీజిల్ బస్సుల స్థానే ప్రవేశ పెట్టాలని నిర్దేశించింది. నగరంలోని ప్రజా రవాణా వ్యవస్థను క్లీన్ అండ్ గ్రీన్ దిశగా నడిపించేందుకు, పర్యావరణ పరిరక్షణలో ఇది విప్లవాత్మక అడుగు అని పేర్కొంది. పూర్తి స్థాయిలో 2800 కొత్త ఎలక్ట్రిక్ బస్సులు వినియోగంలోకి వస్తే వ్యక్తిగత వాహనాల కొనుగోళ్లు తగ్గడంతో పాటు ప్రజా రవాణా వినియోగం పెరుగుతోంది. ఫలితంగా వాహనాల నుంచి వెలువడే ఉద్గారాలు తగ్గుతాయి. నగరవాసులకు శ్వాసకోశ సమస్యలు, గుండె జబ్బులు తగ్గి.. ప్రజల ఆయుర్ధాయం మెరుగుపడుతుంది.

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో 2800 కొత్త ఎలక్ట్రిక్ బస్సులను సమకూర్చుకునేందుకు టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం ఇప్పటికే చర్యలు చేపట్టింది. రాబోయే రెండేళ్లలో దశల వారీగా ఎలక్ట్రిక్ బస్సులను వాడకంలోకి తెచ్చేలా ప్రణాళిక రూపొందించింది. ఎలక్ట్రిక్ బస్సులకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకుంటోంది. ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ లో 25 డిపోలున్నాయి. అందులో 6 డిపోల పరిధిలో 265 ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తుండగా.. ఈ ఏడాదిలో మరో 275 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి వస్తున్నాయి. ఒక్కో డిపోలో రూ.8 కోట్ల వ్యయంతో పూర్తిస్థాయిలో చార్జింగ్ కోసం హెచ్‌టీ కనెక్షన్లను టీజీఎస్పీడీసీఎల్, ట్రాన్ కో ద్వారా నిర్మించింది. రాబోయే 2800 కొత్త ఎలక్ట్రిక్ బస్సుల కోసం 19 డిపోల్లో చార్జింగ్ కోసం హెచ్‌టీ కనెక్షన్లను సంస్థ ఏర్పాటు చేయనుంది. అలాగే, ఎలక్ట్రిక్ బస్సుల ద్వారా హైదరాబాద్ లో ప్రజా రవాణాను మరింతగా విస్తరించేందుకు కొత్తగా 10 డిపోలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అలాగే, కొత్తగా 10 చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనుంది. ఈ మౌలిక సదుపాయాలకు రానున్న సంవత్సరంలో రూ.392 కోట్ల మేర వ్యయమవుతుందని టీజీఎస్ఆర్టీసీ అధికారులు అంచనా వేశారు. టీజీఎస్ఆర్టీసీ ఇప్పుడున్న పరిస్థితుల్లో ఈ ఆర్థిక భారాన్ని మోయలేదు. ప్రభుత్వం, ప్రజల సహకారంతో ఈ వ్యవస్థను ముందుకు తీసుకెళ్లాలని కోరుకుంటోంది.

ఈ నేపథ్యంలోనే ఎలక్ట్రిక్ బస్సుల మౌలిక సదుపాయాల వ్యయాన్ని సమకూర్చుకునేందుకు సిటీ బస్సుల్లో అదనపు ఛార్జీని విధించేందుకు అనుమతి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనను సెప్టెంబర్ 23న రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది.

హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలో నడిచే అన్ని బస్సుల్లో అదనపు ఛార్జీని సంస్థ వసూలు చేయనుంది. సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఈ-ఆర్డినరీ, ఈ-ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మొదటి మూడు స్టేజిలకు రూ.5, 4వ స్టేజి నుంచి రూ.10 అదనపు ఛార్జీని సంస్థ విధించనుంది. అలాగే మెట్రో డీలక్స్, ఈ-మెట్రో ఏసీ సర్వీసుల్లో మొదటి స్టేజీకి రూ.5, రెండో స్టేజీ నుంచి రూ.10 అదనపు ఛార్జీని వసూలు చేయనుంది. హైదరాబాద్ సిటీ బస్సుల్లో ఈ అదనపు చార్జీ అమలు ఈ నెల 6(సోమవారం) నుంచి అమల్లోకి వస్తుంది.

హైదరాబాద్ భవిష్యత్ బాగు కోసం వాడకంలోకి తీసుకువస్తోన్న ఎలక్ట్రిక్ బస్సులను ప్రజలు ఆదరించాలని, నగర ప్రజా రవాణా ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చబోతున్న ఈ గ్రీన్ జర్నీలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని సంస్థ కోరుతోంది. ఈ పర్యావరణహిత కార్యక్రమానికి సహకరించి..గతంలో మాదిరిగానే ఆర్టీసీ సేవలను ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేస్తోంది.

# పేటబషీరాబాద్‌లో యువతి ఆత్మహత్య

- పెదనాన్న శ్రీనివాస్ అరెస్ట్..రిమాండ్‌కు తరలింపు



**హైదరాబాద్, అక్టోబర్ 4 (జనంసాక్షి) :** హైదరాబాద్ నగరంలోని పేట్ బషీరాబాద్ ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య ఘటనలో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. ఈ కేసులో మృతురాలి పెదనాన్న శ్రీనివాస్‌ను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఫైనాన్స్ వేధింపులతో పాటు, తమ పెద్దనాన్న శ్రీనివాస్ అప్పు తీర్చాలని వేధిస్తున్నాడని శుక్రవారం ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఆరు నెలల క్రితమే విద్యార్థిని తండ్రి మరణించాడు. తండ్రి చనిపోయిన తర్వాత 5 స్టార్ ఫైనాన్స్ వాళ్ళు అప్పు చెల్లించాలని పెదనాన్న మీద ఒత్తిడి తీసుకొచ్చారని.. దీంతో పెద్దనాన్న తమను డాక్యుమెంట్ల కోసం వేధిస్తున్నాడంటూ చనిపోయే ముందు మృతురాలు సూసైడ్ నోట్‌లో పేర్కొంది. 'రోజూ మా పరువు పోతుంది, అమ్మ ఒక్కతే ఇన్ని అప్పులు చెల్లించలేదు. అందుకే చనిపోతున్నా' అంటూ సూసైడ్ నోట్ రాసింది. లెటర్‌లో పెద్దనాన్నపై ఆరోపణలు చేయడంతో శ్రీనివాస్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.

# జూబ్లీహిల్ ఉప ఎన్నికల్లో గెలిపించండి

- ఎర్రగడ్డ డివిజన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు పొన్నం శంకుస్థాపన



**హైదరాబాద్, అక్టోబర్4 (జనంసాక్షి) :** కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో ఎలా గెలిపించారో.. జూబ్లీహిల్స్ లోనూ గెలిపించాలని కార్యకర్తలకు మంత్రి పొన్నం ప్రభాకర్ దిశానిర్ధేశం చేశారు. జూబ్లీహిల్స్ అభివృద్ధి ముఖ్యమంత్రి తీసుకున్నారని.. కాంగ్రెస్ కు అవకాశం ఇవ్వాలని ఆయన సూచించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోనీ ఎర్రగడ్డ డివిజన్ లో హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఎర్రగడ్డ డివిజన్ లోని 2.16 కోట్ల రూపాయల వ్యయంతో నటరాజ్ నగర్, శంకర్‌లాల్ నగర్, ఛత్రపతి శివాజీ నగర్ వద్ద అఅ రోడ్లు వేయడం / నటరాజ్ నగర్, బంజారా నగర్, కమ్యూనిటీ హాల్‌ల పునరుద్ధరణ కు శంకుస్థాపన పనులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు మీర్జా రహమత్ బెగ్ ఖాద్రి ,మీర్జా రియాజ్ హాల్ హాసన్ ఎఫండీ, కౌసర్ మొహినుద్దీన్, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, కూడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, డైరీ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్, కార్పొరేటర్ సీఎన్ రెడ్డి ,నవీన్ యాదవ్, అజారుద్దీన్,జోనల్ కమిషనర్ హేమంత్ ,ఇతర ముఖ్య నేతలు, అధికారులు పాల్గొన్నారు.ఎర్రగడ్డ డివిజన్ లో 2.16 లక్షల రూపాయల తో సీసీ రోడ్లకు / కమ్యూనిటీ శంకుస్థాపన చేశామని మంత్రి పొన్నం చెప్పుకొచ్చారు. 54 లక్షల రూపాయలతో మురుగు నీటి కాలువల పునరుద్ధరణకు శంకుస్థాపన చేసుకున్నాం. పక్కన ఉన్న స్థలం ఈ ప్రాంత ప్రజలకు ఉపయోగపడే విధంగా పార్క్ ఏర్పాటు చేసుకుంటున్నాం..రేపటి నుండి పనులు ప్రారంభం అవుతాయని.. వాకింగ్ ట్రాక్ ,పిల్లల గేమ్స్ తదితర ఏర్పాటు చేస్తారు..అధికారులకు ఇప్పటికే ఆదేశించామన్నారు. డ్రింకింగ్ వాటర్ ,శానిటేషన్ ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ లో 60 వేలకు పైగా నూతన రేషన్ కార్డులు పంపిణీ చేశాం..200 యూనిట్ల ఉచిత విద్యుత్ ,500 కి గ్యాస్ అందిస్తున్నామన్నారు. కొంత మంది పిల్లలను తీసుకొచ్చి సానుభూతి తో ఓట్లు అడగాలని చూస్తున్నారు..ప్రజలు అభివృద్ధికి పట్టం కడతారు. కంటోన్మెంట్ ఎన్నికల మాదిరి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఓటర్లకు సూచించారు. జూబ్లీహిల్స్ అభివృద్ధి ముఖ్యమంత్రి గారు తీసుకున్నారు..అధికార కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. ఇక్కడ కూడా డబుల్ బెడ్ రూం లు పంపిణీ చేస్తున్నామని.. ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ప్రజా పాలన ప్రభుత్వంలో సంక్షేమం అభివృద్ధి జోడెద్దుల మాదిరి పని చేస్తుందని ఆయన అన్నారు.



# లోతుకుంటలో అగ్నిప్రమాదం

- ఆరు దుకాణాలు అగ్నికి ఆహుతి

**హైదరాబాద్, అక్టోబర్4 (జనంసాక్షి) :** సికింద్రాబాద్‌లోని తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధి లోతుకుంట వద్ద ఓ దుకాణంలో అగ్ని ప్రమాదం సంభవించింది. లోతుకుంట ప్రధాన రహదారి పక్కనే ఉన్న సైకిల్ దుకాణంలో చెలరేగిన మంటలు ఇతర దుకాణాలకు వ్యాపించడంతో అగ్నిప్రమాద తీవ్రత పెరిగింది. ఈ అగ్ని ప్రమాద ఘటనలో ఆరు దుకాణాలు దగ్ధం కాగా ఆస్తి నష్టం వాటిల్లింది. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో సకాలంలో ఘటన స్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. దుకాణాలలో అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. షార్ట్ సర్క్యూట్ కారణంగానే అగ్ని ప్రమాదం సంభవించి ఇతర దుకాణాలకు మంటలు వ్యాపించినట్లు అగ్నిమాపక అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు.

# అభిమానికి మంత్రి లోకేశ్ షాక్

**పెళ్లి పత్రిక రావడంతో సడన్‌గా హాజరు**

**విజయవాడ, అక్టోబర్4 (జనంసాక్షి) :** తమ పెళ్లికి రావాలని ఓ మహిళా అభిమాని పంపిన ఆహ్వానాన్ని మంత్రి లోకేష్ మన్నించారు .. గతంలో చేపట్టిన యువగళం పాదయాత్రలో భాగంగా 2023 ఆగస్టు 20వ తేదీన యువనేత నారా లోకేష్ విజయవాడలో పాదయాత్ర నిర్వహించారు. విజయవాడ మొగల్రాజపురానికి చెందిన భవానీ ఆనాటి పాదయాత్రలో ఉత్సాహంగా పాల్గొన్నారు.. యువగళం యాత్ర ద్వారా లోకేష్ అభిమానిగా మారిన భవ్య.. తన పెళ్లికి విచ్చేసి ఆశీర్వదించాలంటూ ఇటీవల మంత్రి నారా లోకేష్ కు ఆహ్వానపత్రిక పంపించారు. శనివారం రాత్రి గన్నవరం ఎయిర్ పోర్టు సమీపంలోని ఓ కళ్యాణ మండపంలో భవ్య వివాహం జరగనుంది. బిజీ షెడ్యూలు ఉన్నప్పటికీ మంత్రి లోకేష్ శనివారం మధ్యాహ్నం మొగల్రాజపురంలోని తన అభిమాని భవ్య ఇంటికి వెళ్లి ఆమెకు ఆశీర్వచనాలు అందజేశారు. అకస్మాత్తుగా అభిమాన నేత లోకేష్ తమ ఇంటికి రావడంతో భవ్యతోపాటు ఆమె తల్లిదండ్రులు నాగుమోతు రాజా, లక్ష్మి ఆనందంతో పొంగిపోయారు.



# జాతీయ స్థాయిలో సత్తా చాటిన పల్లవి

- ప్రత్యేకంగా అభినందించిన ఉప ముఖ్యమంత్రి

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ లో సత్తా చాటిన ఖమ్మం రూరల్ మండలం ఆరెంపుల గ్రామానికి చెందిన తాల్లూరి పల్లవిని చూసి ఖమ్మం జిల్లా మొత్తం గర్విస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. జిల్లాకు చెందిన బిడ్డ జాతీయ స్థాయిలో సత్తా చాటడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ విభాగంలో జాతీయ స్థాయిలో టాపర్ గా నిలవడం మనందరికీ గర్వకారణం అని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కౌశల్ దీక్షాంత్ సమారోహ్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా పల్లవి శనివారం జాతీయ అవార్డును స్వీకరించడం సంతోకరమని అన్నారు. తాల్లూరి పల్లవిని ఆదర్శంగా చేసుకుని యువత ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, శాస్త్రసాంకేతిక రంగాల్లో తమ ప్రతిభను చాటాలని ఉప ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తాల్లూరి పల్లవి తల్లిదండ్రులు తల్లూరి రవి, అజితలను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేకంగా అభినందించారు.

# చెల్లని బీసీ జీవోతో కాంగ్రెస్ ఎన్నికల ప్రకటన

- ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారు
- మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆరోపణ



**జనగామ, అక్టోబర్ 4 (జనంసాక్షి) :** చట్టపరంగా చెల్లని జీఓ తెచ్చి స్థానిక సంస్థల ఎన్నికల ప్రకటన చేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేయాలని చూస్తోందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. మహబూబాబాద్ జిల్లా, తొర్రూరు మండలంలోని హరిపిరాల, వెలికట్టే గ్రామాల్లో శనివారం నిర్వహించిన ఎంపీటీసీ క్లస్టర్ సమావేశాలకు ఎర్రబెల్లి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే కాంగ్రెస్ బాకీ కార్డులను విడుదల చేసి, ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి నిజంగా ధైర్యం ఉంటే ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేయాలని సవాల్ విసిరారు. సీఎం రేవంత్ రెడ్డి తన శిష్యుడేనని, కానీ బ్రోకర్ రాజకీయాలు ఆడుతున్నట్లు దుయ్యబట్టారు. మూడుసార్లు గెలవకపోయినా బ్రోకర్ పనులు చేస్తూ ముఖ్యమంత్రి అయ్యాడన్నారు.రెండు సంవత్సరాల క్రితం జరగాల్సిన స్థానిక సంస్థల ఎన్నికలను తరచూ వాయిదా వేస్తూ గ్రామ పంచాయతీలను నిర్వీర్యం చేసినట్లు తెలిపారు. హైకోర్టు గడువు ఒత్తిడిలోనే ప్రభుత్వం బీసీలపై మొసలి కన్నీరు కారుస్తూ రాజ్యాంగబద్ధం కానీ జీఓను తెచ్చిందన్నారు. బీసీ సంఘాలు, రాజ్యాంగ నిపుణులు కూడా ఈ జీఓ చెల్లదని చెబుతున్నా, ప్రభుత్వం నోరు మెదపకపోవడం వెనుక దాగివున్న మతలబు ఏంటని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల ప్రకటన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తప్పా మరే ఒక్క మంత్రి, ఎమ్మెల్యే ఎన్నికలపై మాట్లాడక పోవడం కాంగ్రెస్ లోపాలను బయట పెడుతోందన్నారు. ఎన్ని సర్వేలు చేయించినా తీవ్ర ప్రజా వ్యతిరేకత కాంగ్రెస్‌పై ఉందని తెలుసుకున్న రేవంత్ రెడ్డి ఇప్పుడు మోసపూరిత పద్ధతులు అవలంబిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత 22 నెలల్లో ప్రజలకు ఎంత బాకీ పడిందో స్పష్టంగా చూపించేందుకు బీఆర్ఎస్ పార్టీ రూపొందించిన 'కాంగ్రెస్ బాకీ కార్డులను' ఇంటింటికి పంపిణీ చేయాలని పార్టీ శ్రేణులను సూచించారు. ప్రజల అవగాహన పెరిగింది, పాలకుర్తి నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగురడం ఖాయం అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు. ఇదిలావుంటే ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పాలకుర్తి నియోజకవర్గంలో పలవురు కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారు.తాజాగా పాలకుర్తి కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు తార హస్తం పార్టీకి రాజీనామా చేశారు. అనంతరం ఆమె గులాబీ కండువా కప్పుకున్నారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సమక్షంలో తార బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆమెకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఓయూ నేత పృథ్వీ రెడ్డి కూడా బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. వీరితో పాటు దేవరుప్పుల మండలం నీర్మాల గ్రామం నుండి 120 మంది కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఝాన్సీ రెడ్డి తీరు వల్లే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశామని నేతలు పేర్కొన్నారు.

# హాలిడే ట్రిప్‌కు వెళ్లి వేశ్యలపై దాష్టీకం

**ఇద్దరు భారతీయ పర్యాటకులకు జైలు**

**సింగపూర్, అక్టోబర్4 (జనంసాక్షి) :** హాలీడే ట్రిప్ కోసం సింగపూర్ వెళ్లిన ఇద్దరు భారతీయులు క్రిమినల్ కేసులో చిక్కుకున్నారు. హోటల్ గదుల్లో ఇద్దరు వేశ్యలపై దాడి చేయటంతోపాటు వారి వద్ద నుంచి వస్తువుల్ని దొంగిలించారన్న ఆరోపణలతో సింగపూర్ పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. శుక్రవారం విచారణ జరిపిన కోర్టు వారికి శిక్షలు ఖరారు చేసింది. ఇద్దరికీ చెరో 5 ఏళ్ల చొప్పున జైలు శిక్ష విధించింది. జైలు శిక్షతోపాటు 12 చెరకు గడ దెబ్బలు కూడా విధించింది.వివరాల్లోకి వెళితే.. భారత్‌కు చెందిన 23 ఏళ్ల ఆరోక్యసామి డైసన్, 27 ఏళ్ల రాజేంద్రన్ మాయిలరసన్ గత ఏప్రిల్ 24వ తేదీన సింగపూర్‌కు వెకేషన్‌కు వెళ్లారు. రెండు రోజుల తర్వాత లిటిల్ ఇండియా ఏరియాలో నడుచుకుంటూ వెళు తున్నారు. ఈ నేపథ్యంలోనే ఓ వ్యక్తి వారి దగ్గరకు వచ్చి వేశ్యల గురించి చెప్పాడు. ఓ ఫోన్ నెంబర్ ఇచ్చి వెళ్లిపోయాడు. అయితే, ఆ ఇద్దరికీ డబ్బులు అవసరం ఉండటంతో క్రిమినల్ ఐడియా వేశారు. అదే రోజు సాయంత్రం 6 గంటలకు ఓ వేశ్యను హోటల్ గదిలో కలిశారు. గదిలోకి వచ్చిన వెంటనే వారు ఆమె కాళ్లు, చేతులు కట్టేశారు. ఆమెను కొట్టి నగలు, డబ్బు, పాస్‌పోర్టు, బ్యాంక్ కార్డులు దోచుకున్నారు. తర్వాత కట్లు విప్పేసి బయటకు వెళ్లిపోయారు. అదే రోజు రాత్రి 11 గంటల సమయంలో మరో వేశ్యతోనూ ఇలానే చేశారు. రెండో వేశ్య ఈ విషయాన్ని తనకు తెలిసిన వ్యక్తికి చెప్పింది. అతడు పోలీసులకు కంప్లైంట్ ఇవ్వమని చెప్పాడు. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయటంతో ఇద్దరూ అరెస్ట్ అయ్యారు. శుక్రవారం ఈ కేసుకు సంబంధించిన తుది తీర్పు వెలువడింది. కోర్టు వారికి 5 ఏళ్ల జైలు శిక్షతోపాటు 12 చెరకు గడ దెబ్బలు విధించింది.

# మలేషియాలో భారతీయుల ఐక్యతకు అద్దం పట్టిన దసరా - బతుకమ్మ - దీపావళి వేడుకలు



**కౌలాలంపూర్, అక్టోబర్ 4 (జనంసాక్షి) :** భారతీయ అసోసియేషన్ ఆఫ్ మలేషియా ఆధ్వర్యంలో మలేషియాలోని అన్ని భారతీయ సమాజాలు కలసి ఘనంగా 'దసరా - బతుకమ్మ - దీపావళి 2025" మహోత్సవాన్ని టానియా బ్యాంక్వెట్ హాల్, బ్రిక్ఫీల్డ్స్ లో నిర్వహించాయి. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా ఎంపీ ఈటల రాజేందర్ హాజరై ఆశీస్సులు అందించారు. భారత హైకమిషనర్, మలేషియా ప్రభుత్వ ప్రతినిధులు పాల్గొని వేడుకకు విశిష్టతను తీసుకువచ్చారు. అతిథులు మాట్లాడుతూ 'ఈ వేడుక తెలుగు వారికే పరిమితం కాకుండా భారత దేశం నలుమూలల నుంచి వచ్చిన ప్రతి భారతీయుడు ఐక్యంగా జరుపుకున్న ఒక గొప్ప సాంస్కృతిక మహోత్సవం. నిజంగా కన్నుల పండుగగా నిలిచింది" అని అభినందించారు. సాంప్రదాయ నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, పాటలు, పండుగ ప్రత్యేకతలతో కూడిన కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. ఈ వేడుకలో మలేషియాలో నివసిస్తున్న అన్ని భారతీయ ఎన్ఐఆర్‌లు విశేషంగా పాల్గొని బీఏఎం మహోత్సవాన్ని విజయవంతం చేశారు. బీఏఎం అధ్యక్షుడు చొప్పరి సత్య, ఉపాధ్యక్షుడు భాను ముత్తినేని, ఐటీ పీఆర్ కమ్యూనికేషన్ ప్రధాన కార్యదర్శి రవితేజ శ్రీదశ్యం, కోశాధికారి, రుద్రాక్షల సునీల్ కుమార్, సంయుక్త కోశాధికారి గజ్జడ శ్రీకాంత్, యువజన నాయకుడు రుద్రాక్షల రవికిరణ్ కుమార్, మహిళా సాధికారత నాయకురాలు గీత హజారే, కార్యవర్గ సభ్యులు సొప్పరి నవీన్, యెనుముల వెంకట సాయి, అపర్ణ ఉగంధర్, సైచరణి కొండ, రహిత సొప్పరి రాజేష్, పలకలూరి నాగరాజు పాల్గొన్నారు. బీఏఎం అధ్యక్షుడు చోప్పరి సత్య మాట్లాడుతూ 'ఈ వేడుకను విజయవంతం చేయడంలో సహకరించిన భారత హైకమిషన్, మలేషియా ప్రభుత్వ అధికారులు, అతిథులు, స్పాన్సర్లు, కమిటీ సభ్యులు మరియు మలేషియాలోని భారతీయ సమాజానికి మనఃపూర్వక కృతజ్ఞతలు" అని తెలిపారు.

# యాదాద్రిలో భక్తుల కిటకిట

- నిండిపోయిన క్యూలైన్లు



**యాదాద్రి, అక్టోబర్4 (జనంసాక్షి) :** యాదాద్రి శ్రీలక్ష్మి నరసింహ స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. శనివారం కావడంతో భక్తుల రాక పెరిగింది. లక్ష్మీ నరసింహ స్వామి వారి దర్శనానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. క్యూలైన్లన్ని భక్తులతో నిండిపోయాయి. స్వామి వారి సర్వదర్శనానికి రెండు గంటల సమయం, ప్రత్యేక దర్శనానికి ఒక గంట సమయం పట్టింది. ఆదివారంతో దసరా సెలవులు ముగియనుండడంతో.. యాదాద్రి ఆలయానికి భక్తులు పోటెత్తారు. అందులోనూ శనివారం కావడంతో.. భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా.. అధికారులు, పోలీసులు తగు చర్యలు తీసుకుంటున్నారు. భక్తుల రద్దీ ఆదివారం మరింత పెరిగే అవకాశం ఉందని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు.

# జనసంద్రంగా మారిన తుంగతుర్తి

- మాజీ మంత్రి ఆర్డీఆర్‌కు ఘన నివాళులర్పించిన మంత్రులు
- ప్రభుత్వ లాంచనాలతో అంత్యక్రియలు
- తమ అభిమాన నాయకుడిని కడసారి చూసేందుకు పోటెత్తిన జనం

**తుంగతుర్తి, అక్టోబర్ 4 (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి అంత్యక్రియలు శనివారం తుంగతుర్తిలోని ఆయన వ్యవసాయ క్షేత్రంలో అధికారిక లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. తమ అభిమాన నాయకుడిని కడసారి చూసేందుకు పార్టీలకతీతంగా ప్రజలు తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాల నుండి పెద్దఎత్తున తరలివచ్చారు. అభిమానులు, పార్టీ కార్యకర్తలు, నాయకుల రాకతో తుంగతుర్తి జనసంద్రంగా మారింది. తాము అభిమానంగా పిలుచుకునే టైగర్ దామన్న ఇక లేరనే వార్త విని శోక సముద్రంలో మునిగిపోయారు. ఆర్డీఆర్‌తో తమకున్న అనుబంధాన్ని, ఆయన చేసిన సేవలను గుర్తుకు చేసుకున్నారు. కమ్యూనిస్టులకు కంచుకోటగా ఉన్న తుంగతుర్తి ప్రాంతంలో కాంగ్రెస్ జెండా ఎగురవేశారు.నాలుగు దశాబ్దాలకు పైగా తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాల్లో పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేశారు.ఐదు సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా



పని చేసిన ఆర్డీఆర్ ప్రజల్లో పట్టు సాధించారు. ఈ మేరకు ఆయన పార్థివ దేహాన్ని వారి నివాసం నుండి వ్యవసాయ క్షేత్రం వరకు వాహనంలో తరలించారు.నాయకులు, కార్యకర్తలు, అభిమానులు టైగర్ దామన్న అమర్ రహే, లాంగ్ లీవ్ దామన్న అంటూ నినాదాలు చేశారు. అశ్రునయనాల మధ్య కుటుంబసభ్యుల మధ్య పోలీసులు,అధికారులు అధికారిక లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.అంతకుముందు టిపిసిసి రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వి.హనుమంతరావు,మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి, ఎమ్మెల్యేలు మందుల సామెల్,యశస్విని రెడ్డి, కుంభం అనిల్ కుమార్ రెడ్డి, బాలు నాయక్,నాయిని రాజేందర్ రెడ్డి,కోరం కనకయ్య, బత్తుల లక్ష్మారెడ్డి,వేముల వీరేశం, ఉత్తమ్ పద్మావతి రెడ్డి, ఎమ్మెల్సీలు సత్యం, శంకర్ నాయక్, ఎంపీ జైవీర్ రెడ్డి, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, రాష్ట్ర రైతు కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, రాష్ట్ర పర్యాటక సంస్థ అభివృద్ధి చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధ కిషన్ రావు, నాయకులు గుడిపాటి నరసయ్య, గుడిపాటి సైదులు, అన్యపర్తి జ్ఞాన సుందర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిషోర్ కుమార్, చందర్ రావు, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్,తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, పారిశ్రామికవేత్త సంకినేని కృష్ణారావులు ఆయన భౌతికకాయంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ, సూర్యాపేట డీఎస్పీ ప్రసన్న కుమార్ అంత్యక్రియల ఏర్పాట్లను సమీక్షించారు. పోలీసులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, ప్రజలు సందర్శనార్థం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టారు.

## మాజీ మంత్రి ఆర్డీఆర్‌కు ఘన నివాళులు అర్పించిన ప్రముఖులు



**సూర్యాపేట ప్రతినిధి, అక్టోబర్ 4 (జనంసాక్షి) :** మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, సూర్యాపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ రాంరెడ్డి దామోదర్ రెడ్డి అంత్యక్రియలు శనివారం తుంగతుర్తిలోని వారి వ్యవసాయ క్షేత్రంలో అధికార లాంఛనాలతో పూర్తయ్యాయి. ఆర్డీఆర్‌ను కడసారి చూసేందుకు ప్రజలు, అభిమానులు,వివిధ పార్టీల నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.మంత్రులు,ప్రముఖులు, నాయకులు పార్టీలకతీతంగా పెద్ద ఎత్తున తరలి వచ్చి దామన్నకు ఘన నివాళులర్పించారు.ప్రజల కడసారి సందర్శనార్థం మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి పార్థివ దేహాన్ని తుంగతుర్తిలోని వారి వ్యవసాయ క్షేత్రంలో ఉంచారు.రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి,రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ,మైనార్టీ, వృద్ధులు,వికలాంగుల సంక్షేమ శాఖ, ఇన్చార్జి మంత్రి లక్ష్మణ్ కుమార్,టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ దివంగత నేత రాంరెడ్డి దామోదర్ రెడ్డి పార్థివ దేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఆర్డీఆర్ కుమారుడు సర్వోత్తమ్ రెడ్డిని, కుటుంబ సభ్యులను ఓదార్చారు.రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య,రాష్ట్ర పర్యాటక సంస్థ అభివృద్ధి చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి,ఎంపీ రఘు వీర్ రెడ్డి,ఎమ్మెల్యేలు మందుల సామెల్, ఉత్తమ్ పద్మావతి రెడ్డి, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి, బి.లక్ష్మారెడ్డి , అనిల్ కుమార్ రెడ్డి, వేముల వీరేశం,యశస్విని రెడ్డి,ఎమ్మెల్సీ శంకర్ నాయక్, అగ్రికల్చర్ కమిషన్ మెంబర్లు రాంరెడ్డి గోపాల్ రెడ్డి,చెవిటి వెంకన్న యాదవ్, మాజీ ఎంపీ హనుమంతరావు,మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్,ఇతర ప్రముఖులు నివాళులర్పించారు.అనంతరం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.నివాళులు అర్పించిన వారిలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ కె.నరసింహ, ఆర్డీఓ వేణుమాధవ్ తదితరులు ఉన్నారు.

## బండమీదిపల్లిలో ఘనంగా దసరా సంబరాలు

- అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పల్లకిసేవా..
- రావణ కాష్టంతో బాణాసంచ కాల్చి వేడుకలు
- అలైబలైతో ఐక్యమత్య చాటుకున్న గ్రామస్తులు



**తాండూరు అక్టోబర్ 4 (జనంసాక్షి) :** తాండూరు నియోజకవర్గం యాలాల :మండలంలోని బండమీదిపల్లి గ్రామంలో గురువారం దసరా పండుగా సంబురాలు అంబరాన్ని అంటాయి. గ్రామంలోని ఆడపడచులు, చిన్న, పెద్ద అందరు ఊరడమ్మ దగ్గర చేరుకొని సంబరాల్లో పాల్గొన్నారు. చిన్నారులు శ్రీరాములు, సీతామాత, లక్ష్మణుడు, ఆంజనేయుడి వేశాధారణలో గ్రామస్తులు భజనలు చేస్తూ ధుర్గామాత అమ్మవారికి పల్లకి సేవా నిర్వహించారు. అంతకు ముందు జమ్మి చెట్టుకు పూజలు చేశారు. అనంతరం రావణుడి సంహారం కోసం చిన్నారి రాములు భాణం ఎక్కుపెట్టి పదితలల రావణుడిని దహనం చేశారు. దీంతో గ్రామస్తులు పెద్ద ఎత్తున భాణా సంచాకాల్చి సంబరాలు చేసుకున్నారు. ఆటపాటలతో అలరించారు. అనంతరం అలయ్‌బలయ్ నిర్వహించి గ్రామస్తుల ఐక్యమత్యాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ గడ్డలి రాంచంద్రమ్మ, గడ్డలి లక్ష్మయ్య, గ్రామ పెద్దలు కొమ్ము లక్ష్మయ్య, కొమ్ము చంద్రయ్య, కొమ్ము అనంతయ్య, చెట్టుకింది అంజయ్య, కొమ్ము కృష్ణ, గడ్డలి నర్సిములు, గడ్డలి పకీరప్ప, ఇందూరు విజయ్‌కుమార్, బలిజ బస్వరాజ్, వీరన్న, దత్తు నర్సిములు, దత్తు బాలప్ప, ఈడిగి ఆంజనేయులు, దౌల్తాబాద్ వెంకటేశ్, మంగలి లక్ష్మప్ప, బెస్త బసన్న, దత్తు లక్ష్మణ్, బొల్లె హన్మప్ప, పి. చంద్రప్ప, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

**మణుగూరు, అక్టోబర్ 4 (జనంసాక్షి) :** ప్రశాంత వాతావరణంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని సహాయ జిల్లా ఎన్నికల అధికారి తెల్లూరి శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పలు రాజకీయ పార్టీ ప్రతి నిధులతో సమావేశం నిర్వహించారు.. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఎన్నికల నియమావళి పై ప్రతీ గ్రామంలో ఆయా రాజకీయ పార్టీలకు చెందిన కనీసం ఒక్కో కార్యకర్తకైనా అవగాహన కలిగించాలన్నారు. ప్రభుత్వ భవనాలు, ఆస్తులపై రాజకీయ ప్రచారాలకు సంబంధించి ఎలాంటి రాతలు రాయకూడదని, పోస్టర్లు అతికించరాదన్నారు. ప్రైవేట్ భవనాలపై సైతం ఏమైనా పోస్టర్లు అతికిస్తే సంబంధిత యజమానుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎన్నికలకు సంబంధించి పోటీ చేసే అభ్యర్థులకు ఎలాంటి సందేహాలున్నా సంబంధిత అధికారులను సంప్రదించాలన్నారు ఎలాంటి ఘర్షణకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసేందుకు అభ్యర్థులు సహకరించేలా ఆయా పార్టీల నాయకులు కృషి చేయాలన్నారు.

ముఖ్యంశాలు:

**మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసిసి) :**

రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటనతో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోకి వచ్చినట్లు తెలియజేయబడింది. ఎన్నికల ప్రక్రియలో ఏ రకమైన ఉల్లంఘనలపైనా కఠినమైన చర్యలు తీసుకోబడునని స్పష్టం చేశారు. ప్రచారం, సమావేశాలు, ప్రభుత్వ ఆస్తుల వినియోగం , ఓటర్లను ప్రలోభపెట్టడం వంటి విషయాలలో అనుసరించవలసిన నియమాలు వివరించబడ్డాయి.

**ఎన్నికల షెడ్యూల్ :**

నామినేషన్ల దాఖలు, పరిశీలన, ఉపసంహరణ, పోలింగ్, ఓట్ల లెక్కింపు తేదీలు, సమయాలు స్పష్టం చేయబడ్డాయి. అన్ని పార్టీలు షెడ్యూల్ ప్రకారం వారి కార్యకలాపాలను నిర్వహించుకోవాలని కోరారు. జిల్లా ప్రజా పరిషత్ నియోజకవర్గం (జెడ్ పి టి సి) వివిధ మండల ప్రజా పరిషత్ నియోజకవర్గాల (ఎంపీటీసీ) కోసం నామినేషన్లు దాఖలు చేసే స్థలాలు, సంబంధిత రిటర్నింగ్ ఆఫీసర్ల వివరాలు అందించబడ్డాయి. ఎన్నికలను నిర్వహించడానికి నియమించబడిన మండల స్థాయి ప్రధాన అధికారులు రిటర్నింగ్ అధికారుల పరిచయం చేయడం జరిగింది. మండలంలోని అన్ని పోలింగ్ స్టేషన్లు, వాటి స్థానాలు, ఓటర్ల సంఖ్య ఇతర లాజిస్టిక్ వివరాలు వివరించబడ్డాయి. అభ్యర్థులు, పార్టీలు అనుసరించవలసిన ఎన్నికల ఖర్చు పరిమితులు గురించి మార్గదర్శకాలు అందించబడ్డాయి.ఈ ఎన్నికలు స్వచ్ఛంగా, పారదర్శకంగా శాంతియుతంగా జరగడానికి అన్ని రకాల



ఏర్పాట్లు చేయబడినట్లు తెలియజేశారు. అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని, ఎన్నికల నియమాలను గౌరవించాలని ప్రజాస్వామ్య ప్రక్రియను సుస్థిరంగా విజయవంతంగా చేయడానికి కలిసి పని చేయాలని అభ్యర్థించారు. ఎన్నికల సంబంధిత ఏవైనా సమస్యలు సందేహాలు కోసం సహాయ జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు.ఈ సమావేశంలో తహసిల్దార్ అద్దంకి నరేష్, సీఐ నాగబాబు, జడ్పీటీసీ రిటర్నింగ్ అధికారి స్వర్ణ లత, లేనినా డి డబ్ల్యు ఓ, ఎంపిటిసి రిటర్నింగ్ ఆఫీసర్లు, వివిధ విభాగాల నోడల్ అధికారులు పంచాయతీ కార్యదర్శులు, కాంగ్రెస్, బి ఆర్ ఎస్, టీడిపి, సిపిఐ, సిపిఎం, ఎమ్మార్పీఎస్ పార్టీ అధ్యక్షులు కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

## ఆయిల్‌ఫామ్ సాగుతో రైతులకు మహర్దశ



**దమ్మపేట, అక్టోబర్ 4 (జనంసాక్షి) :** తెలంగాణ లో పది లక్షల ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు విస్తరణకు ప్రణాళిక సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతాంగం సంక్షేమం కోసం లక్షన్నర కోట్లు ఖర్చు పామాయిల్ రైతుల రాష్ట్ర స్థాయి సమ్మేళనంలో మంత్రి తుమ్మల ఆయిల్ ఫామ్ సాగు చేసే రైతులకు మహర్దశ పట్టనుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం లింగాలపల్లి లో ఆయిల్ ఫామ్ రైతుల రాష్ట్ర స్థాయి సమ్మేళనంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల మాట్లాడుతూ పూజ్యులు ఎన్టీఆర్ గారి చేతుల మీదుగా నాటిన పామాయిల్ మొక్కతో ఆయిల్ ఫామ్ సాగు విస్తరణ కు శ్రీకారం చుట్టామన్నారు. 31 జిల్లాల్లో ఆయిల్ ఫామ్ సాగుకు అవకాశాలు ఉన్నాయన్నారు. ఏ ప్రభుత్వంలో ఉన్నా ఆయిల్ ఫామ్ సాగు విస్తరణకు కృషి చేశామన్నారు. అప్పారావు పేట పామాయిల్ ఫ్యాక్టరీ ఓ.ఈ.ఆర్ ఆధారంగానే పామాయిల్ గెలలు ధర నిర్ణయం జరుగుతుందని తెలిపారు. రూ. 15 వేలు ఎకరాలు పైగా ఆయిల్ ఫామ్ ఉన్నచోట పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం చేస్తామన్నారు. నర్మేట్ట పామాయిల్ ఫ్యాక్టరీ అత్యాధునిక టెక్నాలజీతో నిర్మాణం జరిగిందని త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం చేస్తామని మంత్రి తుమ్మల తెలిపారు. ఆయిల్ ఫామ్ లో అంతర పంటల సాగుతో రైతులకు అదనపు లాభాలు ఉంటాయని కోకో జాజి వక్క అవకాడో అంతర పంటల సాగుకు అవకాశాలు ఉన్నాయని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. లక్షన్నర కోట్ల రూపాయలు విలువ చేసే వంట నూనెలు దిగుమతి చేసుకుంటున్నాం. పామాయిల్ రైతులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా కార్బన్ క్రెడిట్ పథకంలో నిధులు అందే విధంగా డిమాండ్ చేస్తామని తెలిపారు. ఆయిల్ ఫామ్ సాగు విస్తరణ కోసం అన్ని మండలాల్లో రైతు సమావేశాలు ఏర్పాటు చేస్తామన్నారు.పామాయిల్ గెలలు ధర టన్ను ఇరవై ఐదు వేలు మద్దతు ధర కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలనీ కోరారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనలో రైతు సంక్షేమం కోసం లక్షన్నర కోట్లు ఖర్చు చేసామన్నారు. ఏడాదికి రెండు లక్షల ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు విస్తరణ టార్గెట్‌గా ప్రభుత్వం పామాయిల్ సాగును ప్రోత్సహిస్తుందని మంత్రి తుమ్మల తెలిపారు. ఆయిల్ ఫామ్ రైతులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావుని సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి ఎమ్మెల్యే లు కూనంనేని జారే ఆదినారాయణ ఆయిల్ ఫామ్ రైతు అసోసియేషన్ అధ్యక్షుడు ఆలపాటి రామచంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

## కామారెడ్డిలో జరిగినవి కత్తిపోట్లు కాదు, గ్లాస్ పోట్లు..

- ఈ గొడవలకు పాత కక్షలే కారణం
- కామారెడ్డి ఏఎస్పి చైతన్య రెడ్డి

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 4 (జనం సాక్షి) :** కామారెడ్డి జిల్లా కేంద్రంలో విజయదశమి దసరా రోజు కత్తిపోట్లు జరిగాయని సోషల్ మీడియాలో ప్రచారం జరిగిందని అది కత్తిపోట్లు కాదని గ్లాస్ పోట్లు అని పాత కక్షల కారణంగానే దాడులు జరిగాయని కామారెడ్డి ఏఎస్పీ చైతన్య రెడ్డి తెలిపారు.శనివారం కామారెడ్డి పట్టణంలో డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ విజయదశమి దసరా రోజు అర్ధరాత్రి కలకలం రేపిన దాడుల ఘటనపై పోలీసులు విచారణ ముమ్మరం చేశారనీ, ఘటనకు కారకులైన ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించడం జరిగిందన్నారు. విజయదశమి దసరా రోజు అర్ధరాత్రి తమకు '100'కు కాల్ వచ్చిందని, వెంటనే తమ సిబ్బంది ఆ ప్రాంతానికి వెళ్లగా.అక్కడ రెండు గ్రూపులు కొట్టుకుంటున్నాయని తెలిపారు. వెంటనే ఆ గ్రూపులను అక్కడనుండి చెదరగొట్టడం జరిగిందని, ఈ ఘటనలో పలువురిని అదుపులోకి తీసుకుని విచారించగా గాజుముక్కతో దాడి జరిగినట్లు తేలిందన్నారు. కేతన్, ప్రఫుల్ అనే ఇద్దరు యువకులపై సిద్దార్థ్ అనే వ్యక్తి పాత కక్షల నేపథ్యంలో గాజు ముక్కతో దాడి చేశాడన్నారు. ఈ దాడిలో నలుగురికి గాయాలయ్యాయని, సిద్దార్థ్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఎవరు పాల్పడినా వదిలిపెట్టేది లేదని ఏఎస్పీ హెచ్చరించారు. 100కు ఫోన్ చేస్తే పోలీసులు స్పందించాలి.100 నెంబర్కు అక్కడ గొడవ జరగకముందే ఆ కాలనీవాసులు అక్కడ డీజే పెట్టుకుని డాన్స్ చేస్తుండడం వల్ల తమకు ఇబ్బంది కలుగుతుందని రాత్రి 12 గంటలకు 100కు డయల్ చేస్తే స్పందించలేదని ఆ కాలనీవాసులు పేర్కొన్నారని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ 100 కాల్ రెండు గంటలకు వచ్చిందని వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని అక్కడ రెండు గ్రూపులు కొట్టుకుంటుండగా వారిని చెదరగొట్టడం జరిగిందన్నారు. నాలుగు కిలోల గంజాయిని సీజ్ చేశాం. కామారెడ్డి పట్టణంలో 10 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు తెలిసిందని విలేకరుల ప్రశ్నించగా 10 కిలోలు కాదని నాలుగు కిలోలు గంజాయిని పట్టుకొని సీజ్ చేయడం జరిగిందన్నారు. ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు జరిగితే సమాచారం ఇవ్వాలన్నారు.ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతే తమ దృష్టికి తేవాలన్నారు. కామారెడ్డి పట్టణంలోని టీ పాయింట్లలో ధూమపానం ఎక్కువగా జరుగుతుందని అక్కడ గంజాయి సరఫరా అయ్యే అవకాశం ఉందని విలేకరులు పేర్కొనగా అలాంటి చోట్ల ఉంటే తమకు సమాచారం ఇవ్వాలని, వెంటనే దానిని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే డాబాల్లో సిట్టింగ్ బంద్ చేయించడం జరిగిందని ఆమె పేర్కొన్నారు.గ్రూపులుగా మద్యం సేవించి తిరిగితే కఠిన చర్యలు తీసుకుంటాం అన్నారు.కామారెడ్డి పట్టణంలో కొందరు యువకులు మద్యం సేవించి రాత్రి పొద్దుపోయిన తర్వాత వాహనాలపై తిరుగుతూ ఇతరులకు ఇబ్బందులు కలగజేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందనీ అలాంటివారిని పట్టుకొని కేసులు చేస్తామన్నారు. బస్టాండ్ ఏరియాలలో ప్రధాన కూడలిలో మద్యపానంపై అలాగే త్రిబుల్ రైడింగ్ పై అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. తల్లిదండ్రులు ఉత్తమ పిల్లల పై దృష్టి పెట్టి ఇలాంటి అలవాట్లు లేకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ఈ సమావేశంలో పట్టణ సీఐ నరహరి, ఎస్సై నరేష్‌లు పాల్గొన్నారు.





## ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, అక్టోబర్ 4 (జనంసాక్షి) :** ప్రభుత్వ ఆస్పత్రులలో సాధారణ ప్రసవాలు పెంచేలా చూడాలని, ఈ విషయంలో గర్భిణీలకు సైతం అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.శనివారం అర్వపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు.ఆరోగ్య సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.పిహెచ్సీ ద్వారా ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవల గురించి డాక్టర్ భూక్య నగేష్ నాయక్ ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రిజిస్టర్స్, రికార్డ్ లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.జిల్లా కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్రీకాంత్, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

# ఎన్నికల విధుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలి

**నిజామాబాద్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 4 (జనం సాక్షి) :** ఎన్నికల విధుల పట్ల పరిపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. ఎం.పీ.టీ.సీ, జెడ్.పీ.టీ.సీ ఎన్నికలకు సంబంధించిన రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో శనివారం శిక్షణ తరగతులు నిర్వహించారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, అభ్యర్థుల తుది జాబితా ప్రకటన, పోటీలో ఉన్న అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు, ఏజెంట్ల నియామకం, పోస్టల్ బ్యాలెట్ తదితర అంశాలపై మాస్టర్ ట్రైనర్లచే అవగాహన కలిపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎం.పీ.టీ.సీ, జెడ్.పీ.టీ.సీ ఎన్నికల నిర్వహణ కోసం ముందస్తుగానే అన్ని ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని సూచించారు. నియమ, నిబంధనలపై పూర్తి అవగాహనను ఏర్పర్చుకోవాలని, ఎలాంటి వివాదాలు, తప్పిదాలకు తావులేకుండా నిబంధలను తు.చ తప్పకుండా పాటిస్తూ ఎన్నికల విధులను ఎంతో జాగ్రత్తగా, పూర్తి పారదర్శకంగా నిర్వర్తించాలని హితవు పలికారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటనను అనుసరిస్తూ ఆర్.ఓలు నోటిఫికేషన్ జారీ చేసి, ఆ రోజు నుండే ప్రాదేశిక నియోజకవర్గ స్థానాల ఎన్నిక కోసం నామినేషన్లు స్వీకరించాల్సి ఉంటుందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు సంబంధించి నోటిఫికేషన్ లో స్పష్టంగా వివరాలను పొందుపర్చాలని అన్నారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ ప్రక్రియలను మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలని, సమయ పాలనను పక్కాగా పాటించాలన్నారు. నోటిఫికేషన్ జారీ చేసిన నాటి నుండి ప్రతి రోజు త్వరితగతిన డైలీ రిపోర్టును పంపించాలని, సంబంధిత వెబ్ సైట్లో అభ్యర్థుల నామినేషన్ పత్రాలను స్కాన్ చేసి అప్లోడ్ చేయాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణ చివరి సమయంలో, విత్ డ్రా సమయాల్లో వీడియో చిత్రీకరణ చేయిస్తే, అవి తగిన ఆధారాలుగా ఉపయోగపడతాయని తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ నిబంధనలకు అనుగుణంగా పక్కాగా జరిగితే, పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలు సజావుగా జరిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని నోటిఫికేషన్ జారీ,



నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ ప్రక్రియలను సమర్ధవంతంగా నిర్వహించాలని ఆర్.ఓలు, సహాయ ఆర్.ఓలకు కలెక్టర్ మార్గనిర్దేశం చేశారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా, ఏమాత్రం సంకోచించకుండా పై అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఏ దశలోనూ సొంత నిర్ణయాలు తీసుకోకుండా, రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా విధులు నిర్వర్తిస్తూ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను సాఫీగా పూర్తి చేయాలని అన్నారు. శిక్షణ అదనపు కలెక్టర్ అంకిత్, జెడ్పీ సీ.ఈ.ఓ సాయాగౌడ్, డిప్యూటీ సీ.ఈ.ఓ సాయన్న, డీ.ఈ.ఓ అశోక్, హౌసింగ్ పీ.డీ పవన్ కుమార్, ఆర్.ఓలు, సహాయ ఆర్.ఓలు పాల్గొన్నారు.




# లగ్జరీ ఇళ్లదే హవా..

### మూడు నెలల్లో 97,080 ఇళ్ల అమ్మకం..

**న్యూఢిల్లీ:**ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితులు, భౌగోళిక రాజకీయ అస్థిరతలు కొనసాగుతున్నప్పటికీ.. మన దేశంలో నివాస విభాగం స్థిరమైన వృద్ధిని నమోదు చేస్తోంది. పెరుగుతున్న ఆదాయాలు, పట్టణీకరణ, గృహ యజమానుల అభిరుచులతో గృహాల కొనుగోళ్లు స్థిరంగానే ఉంటున్నాయి. దేశంలోని ఏడు ప్రధాన నగరాలలో ఈ ఏడాది మూడో త్రైమాసికం(క్యూ3)లో 97,080 ఇళ్లు అమ్ముడుపోయాయి. గతేడాది క్యూ3లో విక్రయమైన 1,07,060 యూనిట్లతో పోలిస్తే 9 శాతం తగ్గగా.. ఈ ఏడాది క్యూ2లో సేల్ అయిన 96,290 నివాసాలతో పోలిస్తే 1 శాతం వృద్ధి చెందాయని అనరాక్ రీసెర్చ్ రిపోర్ట్ వెల్లడించింది. ఇక, 2025 క్యూ3లో 96,690 యూనిట్లు లాంచింగ్ అయ్యాయి. క్యూ2లో సరఫరా అయిన 98,630 యూనిట్లతో పోలిస్తే 2 శాతం క్షీణించగా.. గతేడాది క్యూ3లో సప్లయ్ అయిన 93,750 యూనిట్లతో పోలిస్తే మాత్రం 3 శాతం పెరిగాయి. అయితే ఇళ్ల అమ్మకాలు తగ్గినప్పటికీ వాటి విలువ మాత్రం 14 శాతం పెరిగింది. గతేడాది క్యూ3లో అమ్ముడైన ఇళ్ల విలువ రూ. 1.33 లక్షల కోట్లుగా ఉండగా.. ఈ ఏడాది క్యూ3లో విక్రయమైన గృహాల విలువ రూ. 1.52 లక్షల కోట్లుగా ఉంది. ఇళ్ల విక్రయాలు, లాంచింగ్స్‌లో ముంబైలో అత్యధికంగా జరిగాయి. దేశ ఆర్థిక రాజధానిలో 2025 క్యూ3లో 30,260 గృహాలు



అమ్ముడుపోగా.. 29,565 యూనిట్లు ప్రారంభమయ్యాయి. ఆ తర్వాత పుణెలో 16,620 ఇళ్లు విక్రయం కాగా.. 19,375 యూనిట్లు లాంచింగ్ అయ్యాయి. లాంచింగ్స్‌లో అత్యధికంగా లగ్జరీ గృహాలదే ఆధిపత్యం కొనసాగుతుంది. రూ.కోటిన్నర కంటే ఎక్కువ ధర ఉన్న విలాసవంతమైన ఇళ్ల వాటా 38 శాతంగా ఉండగా.. అందుబాటు గృహాల వాటా 16 శాతంగా ఉంది. రూ. 80 లక్షల నుంచి రూ.కోటిన్నర ధర ఉన్న ప్రీమియం గృహాల వాటా 24 శాతం, రూ. 40-80 లక్షల ధర ఉన్న మధ్యతరగతి ఇళ్ల వాటా 23 శాతంగా ఉంది. అమ్మకానికి సిద్ధంగా ఉన్న(ఇన్వెంటరీ) యూనిట్ల సంఖ్య గతేడాది క్యూ3లో 5.64 లక్షలుగా ఉండగా.. ఈ క్యూ3 నాటికి 5.61 లక్షలకు తగ్గాయి. ఏడాదిలో ప్రాపర్టీల ధరలు 9 శాతం పెరిగాయి.

వార్షిక ప్రాతిపదికన అత్యధికంగా ఎన్‌సీఆర్‌లో ధరలు 24 శాతం పెరగగా.. బెంగళూరులో 10 శాతం వృద్ధి చెందాయి. ఈ ఏడాది మూడో త్రైమాసికంలో హైదరాబాద్‌లో 8,630 గృహాలు లాంచింగ్ అయ్యాయి. గతేడాది ఇదే కాలంలో ప్రారంభమైన 13,890 యూనిట్లతో పోలిస్తే ఇది 38 శాతం తక్కువ. ఏడాది కాలంలో నగరంలో లాంచింగ్స్ 22 శాతం మేర తగ్గాయి. నగరంలో ప్రీమియం, లగ్జరీ, అల్ట్రా లగ్జరీ గృహాల డిమాండ్ కొనసాగుతోంది. అందుకే ఈ క్యూ3లో లాంచింగ్ అయిన యూనిట్లలో రూ. 80 లక్షల కంటే ఎక్కువ ధర ఉన్న ఇళ్ల వాటా ఏకంగా 87 శాతంగా ఉంది. ఇక, 2025 క్యూ3లో నగరంలో 11,305 యూనిట్లు అమ్ముడుపోయాయి. గతేడాది ఇదే కాలంలో విక్రయమైన 12,735 ఇళ్లతో పోలిస్తే ఇది 11 శాతం తక్కువ.



## షాపింగ్ మాల్స్ విస్తరణ

- రిటైల్ కేంద్రాలకు అవకాశం

సంస్థాగత పెట్టుబడులు ద్వితీయ శ్రేణి పట్టణాలకు శరవేగంగా విస్తరిస్తున్నాయి. పట్టణీకరణ, అధిక జనాభా, కొనుగోలు శక్తి పెరుగుతుండటంతో వ్యవస్థీకృత రిటైల్ కేంద్రాలకు అవకాశాలు లభిస్తున్నాయి. మారుతున్న వినియోదారుల అభిరుచులతో ప్రపంచ బ్రాండ్లు విస్తరణపై దృష్టిసారిస్తున్నాయి. చండీఘడ్, ఇండోర్, సూరత్, భువనేశ్వర్, కోయంబత్తూరు వంటి ద్వితీయ శ్రేణి పట్టణాలు నెక్సస్(బ్లాక్ స్టోన్), డీఎల్ఎఫ్, ఫీనిక్స్ మిల్స్, ప్రెస్టీజ్ ఎస్టేట్స్, లేక్‌షోర్, రహేజా గ్రూప్, పసిఫిక్ వంటి సంస్థాగత దిగ్గజాలను ఆకర్షిస్తున్నాయి. ఈ ఏడు సంస్థలు వచ్చే 3-5 ఏళ్లలో 4.25 కోట్ల చ.అ. కంటే ఎక్కువ విస్తీర్ణంలో కొత్తగా 45 షాపింగ్ మాల్స్‌ను అందుబాటులోకి తీసుకురానున్నాయి. ప్రస్తుతం ఈ ఏడు సంస్థలకు సమష్టిగా 3.4 కోట్ల చ.అ. విస్తీర్ణంలో 58 మాల్స్ ఉన్నాయి. ప్రస్తుతం దేశంలో గ్రేడ్-ఏ, బీ, సీ కేటగిరీ మాల్స్ అన్నీ కలిపి 650 షాపింగ్ మాల్స్ ఆపరేషనల్‌లో ఉన్నాయి. ఇండియాలో 11 కోట్ల చ.అ. నాణ్యమైన రిటైల్ స్పేస్ ఉంది.



## గణనీయంగా పెరిగిన మారుతి సుజుకి అమ్మకాలు

- సెలవుల్లేవ్.. వారంలో 7 రోజులు పని!

భారతదేశంలో మారుతి సుజుకి అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. దీంతో కంపెనీ సెప్టెంబర్ నెలలో తమ ఉత్పత్తిని 26 శాతం పెంచింది. వాహనాల ఉత్పత్తి పెరగడం వల్ల..కొనుగోలుదారులకు సకాలంలో డెలివరీలు జరిగాయి. ఈ తరుణంలో ఉత్పత్తిలో గణనీయమైన వృద్ధిని సాధించడానికి.. ప్రొడక్షన్ టీమ్ ఆదివారాలు సెలవు దినాలలో పని చేయాలని మారుతి సుజుకి మార్కెటింగ్ అండ్ సేల్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ తెలిపారు. నవరాత్రి మొదటి ఎనిమిది రోజుల్లో మారుతి సుజుకి దాదాపు 1,65,000 వాహనాలను డెలివరీ చేసింది. ఈ అమ్మకాలు గత ఏడాది సెప్టెంబర్‌తో పోలిస్తే 27.5 శాతం ఎక్కువ. త్వరలో డెలివరీలు రెండు లక్షలకు చేరుకుంటుందని చెబుతున్నారు. కంపెనీ సేల్స్ పెరగడానికి జీఎస్టీ 2.0 కూడా సహకరించింది. గత పదేళ్లలో ఇంతటి వృద్ధి ఎప్పుడూ చూడలేదని కూడా పార్థో బెనర్జీ అన్నారు. డిమాండుకు తగ్గ డెలివరీలు చేయడానికి.. మారుతి సుజుకి గత నెలలో 12,318 యూనిట్ల ఆల్టో ఎస్ ప్రెస్సో మోడళ్లను ఉత్పత్తి చేసింది.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
| --- | --- |
| ₹ 5.00 | ₹ 5.20 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| 22 క్యారెట్లు | 24 క్యారెట్లు |
| --- | --- |
| ₹ 1,09,450 | ₹ 1,19,400 |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 1,65,000

## ఇల్లు కొనేవాళ్లకు భరోసా.. అక్రమ డెవలపర్లకు కొరడా!

**చట్టం అమలులో నాల్గో స్థానంలో తెలంగాణ**

**టీజీ రెరాలో 10,123 ప్రాజెక్ట్‌లు, 4,516 మంది ఏజెంట్ల నమోదు**

**న్యూఢిల్లీ:**ప్రీలాంచ్‌లు, సాఫ్ట్‌లాంచ్‌ల పేరుతో ప్రాజెక్ట్‌ను స్టార్ట్ చేయక ముందే కస్టమర్ల నుంచి ముందస్తుగా డిపాజిట్లు సేకరించడం, వసూలు చేసిన సొమ్ము వ్యక్తిగత అవసరాలకు మళ్లించడం, న్యాయపరమైన చిక్కులతో నిర్మాణ అనుమ తులు రాకపోవడం, ఒకవేళ వచ్చినా నిర్మాణ వ్యయ భారం తో నిర్మాణ పనులను మధ్యలోనే ఆపేయడం, సంవత్సరాల కొద్దీ నిర్మాణ పనులు కొనసాగిస్తుండటం..ఇలా ఒకట్రెండు కాదు సొంతింటి కలకు సవాలక్ష సవాళ్లు. కానీ, ఇవన్నీ రెరా కంటే ముందు మాట. దేశంలో రెరా చట్టం అమలులోకి వచ్చిన తర్వాత డెవలపర్లలో స్థిరాస్తి రంగంలో పారదర్శకత, ఆర్థిక క్రమశిక్షణ పెరిగింది. దీంతో గృహ కొనుగోలు దారులు, పెట్టుబడిదారుల్లో విశ్వాసం నెలకొంది. దేశంలో 2016లో అమలులోకి వచ్చిన రెరా.. రియల్ ఎస్టేట్ రంగంలో ఒక కీలకమైన ఘట్టం. దశాబ్దాలుగా అనిశ్చితి దేశీయ స్థిరాస్తి రంగాన్ని సంఘటితంగా, పారదర్శక, జవాబు దారీతనంగా మార్చింది మాత్రం రెరానే. విక్రయాలు, ప్రాజెక్ట్ డెలివరీ, స్థిరమైన ధరల పెరుగుదలను తీసుకురావడంతో పాటు రియల్టీలోకి సంస్థాగత, ప్రైవేట్ ఈక్విటీ పెట్టుబ డులకు అవకాశాలను కల్పించిందని నైట్‌ఫ్రాంక్, నరెడ్కో సంయుక్త నివేదిక వెల్లడించింది. అయితే రెరా అమలు అన్ని రాష్ట్రాల్లో ఏకరీతిగా లేకపోయినప్పటికీ.. చట్టం ప్రధాన ఉద్దేశం మాత్రం విప్లవాత్మకమైనదే. దేశం పట్టణీకరణ, ఆర్థిక వృద్ధి ప్రయాణాన్ని కొనసాగిస్తున్న ప్రస్తుత తరుణంలో అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో రెరా స్థిరమైన, సమానమైన అమలు సాగడం అత్యవసరం. ఇప్పటి వరకు మన దేశంలో నాగాలాండ్ మినహా 27 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాల్లో రెరా నోటిఫై అయ్యింది. దేశవ్యాప్తంగా రెరాలో 1.50 లక్షలకు పైగా ప్రాజెక్ట్‌లు, లక్ష కంటే ఎక్కువ మంది ఏజెంట్లు నమోదయ్యారు. ఇప్పటి వరకు 1.50 లక్షలకుపైగా ఫిర్యాదులు పరిష్కృతమయ్యాయి. దేశీయ రియల్ ఎస్టేట్ మార్కెట్ విలువ 648 బిలియన్ డాలర్లకు చేరింది. ఇందులో 52 శాతం వాటా ఉన్న నివాస సముదాయం విభాగంలో పారదర్శకత అత్యవసరం. కస్టమర్ల నుంచి వసూలు చేసే సొమ్ములో 70 శాతాన్ని ప్రత్యేకంగా ఎస్క్రో బ్యాంక్ ఖాతా తెరిచి అందులో వేయాలి. ఆయా సొమ్మును కేవలం నిర్దిష్ట ప్రాజెక్ట్ నిర్మాణ పనుల కోసం మాత్రమే వెచ్చించాలి. 2016లో రెరా అమలులోకి వచ్చినప్పటి నుంచి మహారాష్ట్ర రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (మహారెరా) ముందంజలో ఉంది. పారదర్శకత, సామర్థ్యం, చురుకైన అమలుతో దేశంలో అత్యధిక ప్రాజెక్ట్‌లు, ఏజెంట్ల నమోదులో ఇతర రాష్ట్రాల కంటే తొలిస్థానంలో నిలిచింది. మహా రెరాలో ఇప్పటివరకు 50 వేలకు పైగా ప్రాజెక్ట్‌లు, 52 వేల మంది ఏజెంట్లు రిజిస్టరయ్యారు. ఆ తర్వాత తమిళనాడు, గుజరాత్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలు ఉన్నాయి. ప్రస్తుతం టీజీ రెరాలో 10,123 ప్రాజెక్ట్‌లు, 4516 ఏజెంట్లు రిజిస్టరయ్యారు. 2,340 ఫిర్యాదులు అందగా.. 1,566 పరిష్కృతమయ్యాయి. గత దశాబ్దంలో దేశీయ ఆర్థిక వ్యవస్థ రియల్ ఎస్టేట్ రంగంలో వేగవంతమైన విస్తరణకు కారణమైంది. రెరా కంటే ముందు రియల్టీ పరిశ్రమలో అనిశ్చితి ఉంది. ప్రత్యేక నియంత్రణ వ్యవస్థ అంటూ లేదు. డెవలపర్లను, లావాదేవీలను నియంత్రించడానికి నిర్దిష్టమైన చట్టాలు లేవు. ముంబై, ఢిల్లీ-ఎన్‌సీఆర్, బెంగళూరు, హైదరాబాద్, పుణె, చెన్నై, అహ్మదాబాద్, కోల్‌కతా వంటి ప్రధాన మెట్రో ప్రాంతాలలోనే రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు ఎక్కువగా కేంద్రీకృతమై ఉన్నాయి. ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో పెద్దగా రియల్టీ మార్కెట్ ఉండేది కాదు. డెవలపర్లు తరచూ ఊహాజనిత పెట్టుబడులపై ఆధారపడేవారు. లావాదేవీలలో పారదర్శకత లోపించేది. దీంతో అధిక పరపతి, విస్తృత రుణ డిఫాల్ట్‌లు, ప్రాజెక్ట్ డెలివరీలో తీవ్ర జాప్యం, వ్యయాల పెరుగుదల, గృహ కొనుగోలుదారుల నిధులను ఇతర అవసరాలకు మళ్లించడం వంటివి జరిగేవి. ఈ వ్యవస్థాగత వైఫల్యాలతో అనేక ప్రాజెక్ట్‌లు మధ్యలోనే నిలిచిపోయాయి. దీంతో కొనుగోలుదారుల విశ్వాసం దెబ్బతింది. లక్షలాది మంది కస్టమర్లు ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుపోయారు. స్థిరాస్తి మార్కెట్ కార్యకలాపాలు క్షీణించాయి. దీంతో విధానపరమైన జోక్యం, కఠిన నిబంధనల అమలు అత్యవసరమయ్యాయి. 2016లో రియల్ ఎస్టేట్ రెగ్యులేషన్



## వయసు 31.. సంపద రూ.21వేలకోట్లు!

**భారతదేశపు అతి పిన్న వయసున్న బిలియనీర్‌గా అరవింద్ శ్రీనివాస్‌కు ప్రత్యేక గుర్తింపు**

**న్యూఢిల్లీ:**భారతదేశపు అతి పిన్న వయసున్న బిలియనీర్‌గా అరవింద్ శ్రీనివాస్(31)కు ప్రత్యేక గుర్తింపు లభించింది. చెన్నైలో జన్మించిన ఈయన పెర్‌ప్లెక్సిటీ ఏఐ సహ వ్యవస్థాపకుడిగా, ఆ సంస్థ సీఈఓగా ఉన్నారు. దాంతోపాటు హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2025లో రూ. 21,190 కోట్ల (సుమారు 2.5 బిలియన్లు) నికర విలువతో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. తమిళనాడులోని చెన్నైలో పెరిగిన అరవింద్ శ్రీనివాస్ ప్రతిష్ఠాత్మక ఐఐటీ మద్రాస్ నుంచి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశారు. మెషిన్ లెర్నింగ్, ఏఐ పట్ల అభిరుచి పెంచుకున్నారు. తన ఆశయాలను మరింత ముందుకు తీసుకెళ్లడానికి ఉన్నత విద్య కోసం యూఎస్ వెళ్లారు. కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం, బెర్క్లీ నుంచి కంప్యూటర్ సైన్స్‌లో పీహెచ్‌డీ సంపాదించారు. ఈ ప్రయాణంలో శ్రీనివాస్ తన నైపుణ్యాలను ప్రపంచంలోని అత్యంత ప్రభావవంతమైన ఏఐ సంస్థలతో కలిసి మెరుగుపరుచుకున్నారు. ఈ క్రమంలో గూగుల్, డీప్ మైండ్‌ల్లో పనిచేశారు. ఇక్కడ అతను అత్యాధునిక ఏఐ నమూనాలు, ఎల్ఎల్ఎం(లార్జ్ ల్యాంగ్వేజీ మోడల్స్)పై అనుభవం సాధించారు. ఇది అతని సొంత కంపెనీ స్థాపనకు కీలకంగా మారింది. 2022లో శ్రీనివాస్ డెనిస్ యారాట్స్, జానీ హెూ, ఆండీ కొన్విన్‌స్కీతో కలిసి పెర్‌ప్లెక్సిటీ ఏఐను స్థాపించారు. ఇది సాధారణ సెర్చ్ ఇంజిన్ కాదు. ఇది ఒక ఇంటెరాక్షన్ ఏఐ సెర్చ్ ఇంజిన్. ఏదైనా ప్రశ్నలకు సమాధానాలు పొందడానికి వేగవంతమైన మార్గంగా దీన్ని శ్రీనివాస్ అభివర్ణించారు. మార్కెట్‌లో తన పోటీదారులకు బలమైన ప్రత్యామ్నాయంగా పెర్‌ప్లెక్సిటీ నిలుస్తుంది. సంప్రదాయ సెర్చ్ ఇంజిన్ల మాదిరిగా హైపర్‌లింక్‌ల జాబితాను అందించడానికి బదులుగా పెర్‌ప్లెక్సిటీ ప్రత్యక్ష, ఇంటెరాక్షన్ సమాధానాలను అందిస్తుంది. ఇది మరింత కచ్చితమైన ప్రతిస్పందనలను రూపొందించడానికి జనరేటివ్ ఏఐను రియల్‌టైమ్ వెబ్ డేటాతో విలీనం చేస్తుంది. ఈ కంపెనీకి సిలికాన్ వ్యాలీలో గుర్తింపు లభించింది. ఈ స్టార్టప్‌కు అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్‌తో సహా అగ్రశ్రేణి పెట్టుబడిదారుల నుంచి నిధులు సమకూరాయి.

## నోబెల్.. ఎందుకంత స్పెషల్ ?

- 50 ఏళ్లగా సీక్రెట్‌గా అత్యంత రహస్యంగా ఎంపిక

**న్యూఢిల్లీ:** అత్యంత ప్రతిష్ఠాత్మక నోబెల్ బహుమతి విజేతలను ప్రకటించే వారం దగ్గరపడింది. ఈ సోమవారం అంటే అక్టోబరు 6 నుంచి అక్టోబరు 13 వరకు విజేతల ప్రకటన ప్రక్రియ కొనసాగనుంది. వైద్య రంగం, భౌతిక శాస్త్రం, సాహిత్యం,రసాయన శాస్త్రం, ఆర్థిక శాస్త్రం, శాంతి తదితర విభాగాల్లో అత్యుత్తమ సేవలు అందించేవారిని నోబెల్ బహుమతులతో సత్కరించనున్నారు.

**జ్యూరీ అనుసరించే విధానం**

నోబెల్ బహుమతుల ఎంపిక ప్రక్రియ ఎంతో ఆసక్తికరంగా సాగుతుంది. అవార్డుల విజేతలను జ్యూరీ అత్యంత రహస్యంగా ఎంపిక చేస్తుంది. గోప్యత అనేది విజేతల ఎంపికలో తప్పనిసరి విధానం. ఇది నిష్పాక్షికతను నిర్ధారిస్తుంది. నామినీలు, నామినేటర్ల గుర్తింపులను గత 50 ఏళ్లగా ఎంతో గోప్యంగా ఉంచుతున్నారు. ఇటువంటి విధానం బాహ్య ఒత్తిళ్లు, ఊహాగానాలను నివారిస్తుంది. అవార్డుల గొప్పతనాన్ని కాపాడుతూ, విజేతలు ఎవరనే ఉత్కంఠను కొనసాగిస్తుంది. ప్రముఖ ప్రొఫెసర్లు, మునుపటి అవార్డు గ్రహీతలు,




ప్రభుత్వాలు, పార్లమెంటు సభ్యులు, శాంతి పరిశోధన సంస్థల డైరెక్టర్లు.. నోబెల్ బహుమతులకు అర్హులైవారిని నామినేట్ చేస్తారు.

**శాంతి బహుమతి విభాగంలో..**

నామినేషన్ల ప్రక్రియ ముగిసిన తర్వాత ప్రతి వర్గానికి లేదా విభాగానికి చెందిన నిపుణుల కమిటీలు నామినేషన్లను సమీక్షిస్తాయి. ఈ కమిటీలు నివేదికలను సిద్ధం చేస్తాయి. ఆల్ఫ్రెడ్ నోబెల్ వీలునామాలో పేర్కొన్న బహుమతి ప్రమాణాలకు అనుగుణంగా అభ్యర్థులు ఉన్నారా? లేదా అనే దానిపై చర్చలు జరుగుతాయి. నోబెల్ శాంతి బహుమతి విభాగంలో నార్వే పార్లమెంట్ నియమించిన ఐదుగురు సభ్యుల 'నార్వేజియన్ నోబెల్ కమిటీ' ఎంపికకు సారథ్యం వహిస్తుంది. వారు తమకు అందిన నామినీల నుండి ఒక షార్ట్‌లిస్ట్‌ను తయారు చేస్తారు. అభ్యర్థులను ఖరారు చేసేందుకు నిపుణుల అభిప్రాయాలను తీసుకుంటారు. తుది నిర్ణయాన్ని సాధారణంగా ఏకాభిప్రాయం మేరకు తీసుకుంటారు. అక్టోబర్‌లో అధికారిక ప్రకటనకు ముందు ఈ తతంగమంతా జరుగుతుంది.

ఎంపిక ప్రక్రియలో వీటికి తావుండదు


సాహిత్యంలో నోబెల్ బహుమతి విషయానికొస్తే స్వీడిష్ అకాడమీ సభ్యులు నామినేటెడ్ అభ్యర్థులను రచనలను రహస్యంగా అంచనా వేస్తారు. అకాడమీ సభ్యుల మెజారిటీ మద్దతును అందుకున్నవారే తుది అర్హత సాధిస్తారు. గోప్యతా నియమం అన్ని బహుమతి విభాగాలకు వర్తిస్తుంది. లాబీయింగ్, మీడియా హైప్, రాజకీయ జోక్యం మొదలైనవాటికి ఎంపిక ప్రక్రియలో తావుండదు. కఠినమైన గోప్యత, నిపుణుల నిర్ణయం, మెజారిటీ సభ్యుల ఏకాభిప్రాయం మేరకే నోబెల్ బహుమతులకు అత్యంత అర్హులైనవారిని ఎంపిక చేస్తారు.

## 'జాక్' 38 డిమాండ్‌లకు పాక్ అంగీకారం

**జమ్మూకశ్మీర్:** అప్నీ అమన్ కమిటీ(జేఏఏసీ-జాక్)ప్రతిపాదించిన 38 డిమాండ్లను పాకిస్తాన్ ప్రభుత్వం శనివారం ఆమోదించింది. అలాగే పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఇటీవల చోటుచేసుకున్న నిరసనకారుల మరణాలపై న్యాయ విచారణకు, నిర్బంధించిన ప్రదర్శనకారుల విడుదలకు పాకిస్తాన్ ప్రభుత్వం అంగీకారం తెలిపింది. అలాగే జమ్మూకశ్మీర్ శరణార్థుల కోసం రిజర్వు చేసిన 12 అసెంబ్లీ సీట్లను రద్దు చేయడంపై ఉన్న చట్టపరమైన సాధ్యాసాధ్యాలను ఉన్నత స్థాయి కమిటీ పరిశీలిస్తుందని తెలియజేసింది. పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్(పీఓకే)లో అవామీ యాక్షన్ కమిటీ (ఏఏసీ) నేతృత్వంలో కొన్ని రోజులుగా నిరసనలు కొనసాగుతున్నాయి. పీఓకేలో మౌలిక సంస్కరణలు తీసుకురావాలని తమ 38 డిమాండ్లను అమలు చేయాలని ఏఏసీ ఆందోళనలకు పిలుపునిచ్చింది. దీంతో, భారీ సంఖ్యలో ప్రజలు బయటకు వచ్చి నిరసనల్లో పాల్గొన్నారు. తమ ప్రాథమిక హక్కులను పాకిస్తాన్ హరిస్తోందని నిరసనకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా చోటుచేసుకున్న ఘర్షణల్లో 10 మంది మరణించగా, 50 మందికి పైగా జనం గాయపడ్డారు. ఆందోళనకు నాయకత్వం వహిస్తున్న'జాక్', ప్రభుత్వ ప్రతినిధుల మధ్య రెండు రౌండ్ల ఉన్నత స్థాయి చర్చల దరిమిలా పాకిస్తాన్ ప్రభుత్వం దిగివచ్చింది. సెప్టెంబర్ 29న సమ్మెకు పిలుపునిచ్చిన తర్వాత ఈ ప్రాంతంలో హింస చెలరేగింది. కాగా పీఓకేలో కొనసాగుతున్న హింస విషయంలో తీవ్ర ఆందోళన చెందుతున్నట్లు గతంలో పాకిస్తాన్ మానవ హక్కుల కమిషన్ పేర్కొంది.

## ఉల్లంఘనల్లో దొరికిన ఐదు బ్యాంకులు.. ఆర్బీఐ కఠిన చర్యలు

**ముంబై:**దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఉన్న ఐదు బ్యాంకులపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కఠిన చర్యలు తీసుకుంది. మార్గదర్శకాలను పాటించనందుకు ద్రవ్య జరిమానాలు విధించింది. ఈ జాబితాలో ఒక నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ కూడా ఉంది. ఈవివరాలనుఆర్బీఐపత్రికా ప్రకటనలో తెలియజేసింది. ఆర్బీఐ చర్యలకుగురైనబ్యాంకులలోరెండుకర్ణాటకకుచెందినవి. బీఆర్ చట్టాన్ని ఉల్లంఘించి ఇతర సహకార సంఘాలలో వాటాలను కలిగి ఉన్నందుకు హసన్ డిస్ట్రిక్ట్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ లిమిటెడ్ కు రూ .1 లక్ష జరిమానా విధించింది. అలాగేనిర్ణీత కాలవ్యవధిలోగా కస్టమర్ కేవైసీ రికార్డులను సెంట్రల్ కెవైసి రికార్డ్స్ రిజిస్ట్రీకి అప్ లోడ్ చేయడంలో ఈబ్యాంక్ విఫలమైంది. డైరెక్టర్లసంబంధీకులకురుణాలు మంజూరు చేసినందుకు గానూబాగల్‌కోట్ డిస్ట్రిక్ట్ సెంట్రల్ కో-ఆపరేటివ్ బ్యాంక్కుఆర్బీఐరూ. 5.50 లక్షల జరిమానా విధించింది. నిర్ణీత కాలపరిమితిలో నాబార్డుకుకొన్ని చట్టబద్ధమైన రిటర్నును సమర్పించడంలోనూఇది విఫలమైంది. క్రెడిట్, డెబిట్ కార్డులకు సంబంధించిన నిబంధనలను ఉల్లంఘించినందుకు ఎక్స్ప్రెస్ బ్యాంకింగ్ కార్పొరేషన్ కు ఆర్బీఐ రూ. 31.80 లక్షల జరిమానా విధించింది. కొంతమంది క్రెడిట్ కార్డుదారుల క్రెడిట్ బ్యాలెన్స్ లను వారి బ్యాంకు ఖాతాలకు తిరిగి చెల్లించడం/ఫెయిల్/రివర్స్ చేయడంలో బ్యాంకు




విఫలమైందని దర్యాప్తులో తేలింది. గుజరాత్ లోని పటాన్ లో ఉన్న రనూజ్ నగరిక్ సహకార బ్యాంక్ లిమిటెడ్ మంజూరు చేసిన కొన్ని రుణాలుదారిమళ్లకుండా చూడటంలోవిఫలమైనందుకు రూ .3 లక్షల జరిమానా ఎదుర్కొంది. ఇంకా, అనధికార ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్ లావాదేవీలపై అభ్యంతరాలను లేవనెత్తడానికి ఎస్ఎంఎస్ హెచ్చరికలకు వెంటనే స్పందించడంలో తన వినియోగదారులను అనుమతించడంలోనూ విఫలమైంది. తమిళనాడులోని దివ్యం విద్యాలయం టౌన్ కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ కు రూ. 1లక్ష జరిమానా విధించింది. చట్టం కింద జారీ చేసిన ఆదేశాలను ఉల్లంఘిస్తూ రిస్క్ పరిమితికి మించి కొన్ని కొత్త రుణాలు, అడ్వాన్సులు, 100% కంటే ఎక్కువ రిస్క్ ఎక్స్పోజర్లతో కొన్ని రుణాలు, అడ్వాన్సులను మంజూరు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అలాగేనిర్ణీత కాలవ్యవధిలోగా కస్టమర్ కేవైసీ రికార్డులను సెంట్రల్ కెవైసి రికార్డ్స్ రిజిస్ట్రీకి అప్ లోడ్ చేయడంలో బ్యాంక్ విఫలమైంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో తన ఖాతాల్లో పాన్సమాచారం లేదా ఫారం నంబర్ 60 పత్రాలను అందించడంలో విఫలమైనందుకు హెచ్డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ కు ఆర్బీఐ రూ .4.20 లక్షల జరిమానా విధించింది.



## జాతీయ రహదారులపై క్యూఆర్ కోడ్ బోర్డులు

**ముంబై:**జాతీయ రహదారులపై క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేయడానికి.. నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా సన్నద్ధమవుతోంది. ఇంతకీ ఈ క్యూఆర్ కోడ్ ఎందుకు?, దీనివల్ల వాహనదారులకు ఉపయోగం ఏమిటి? అనే వివరాలు ఈ కథనంలో చూసేద్దాం. ప్రయాణీకులకు అవసరమైన సమాచారాన్ని తక్షణమే పొందేలా చేయడానికి.. ఎన్‌హెచ్ఏఐ జాతీయ రహదారులపై క్యూఆర్ కోడ్‌లతో కూడిన సైన్‌బోర్డులను ఏర్పాటు చేయనుంది. రోడ్డు రవాణా రహదారుల మంత్రిత్వ శాఖ పత్రికా ప్రకటన ద్వారా ఈ విషయాన్ని వెల్లడించింది. జాతీయ రహదారులపై ఏర్పాటు చేయనున్న క్యూఆర్ కోడ్ సైన్ బోర్డులు.. వాహనదారులకు చాలా సౌలభ్యంగా ఉంటాయి. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా.. నేషనల్ హైవేల సంఖ్య, చైనేజ్, ప్రాజెక్ట్ పొడవును సంబంధించిన వివరాలతో పాటు.. 1033తో సహా ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్ నంబర్‌లను తెలుసుకోవచ్చు. టోల్ మేనేజర్, ప్రాజెక్ట్ మేనేజర్, రెసిడెంట్ ఇంజనీర్, ఎన్‌హెచ్ఏఐ ఫీల్డ్ ఆఫీసులు వంటి కీలక అధికారుల సంప్రదింపు వివరాలను కూడా పొందవచ్చు. క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేయడం ద్వారా.. హాస్పిటల్స్, పెట్రోల్ పంపులు, టాయిలెట్లు, పోలీస్ స్టేషన్లు, రెస్టారెంట్లు, వెహికల్ రిపేర్ షాప్స్, టోల్ ప్లాజాలు, ఎలక్ట్రిక్ వాహన ఛార్జింగ్ స్టేషన్లు వంటి సమీపంలోని అత్యవసర సేవలకు గురించి కూడా తెలుసుకోవచ్చు. రహదారి భద్రతను మెరుగుపరచడంతో పాటు.. అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణికులకు అవసరమైన సేవలను గుర్తించడంలో సహాయపడటం ఈ క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేయడం వెనుక ఉన్న ప్రధాన లక్ష్యం. జాతీయ రహదారులపై ఈ క్యూఆర్ సైన్‌బోర్డులను.. రోడ్ స్టార్టింగ్, ఎండింగ్ పాయింట్ల వద్ద మాత్రమే కాకుండా, టోల్ ప్లాజాల దగ్గర, రోడ్డుపక్కన కూడా ఏర్పాటు చేయనున్నట్లు ఎన్‌హెచ్ఏఐ వెల్లడించింది. ఈ క్యూఆర్ కోడ్స్ రహదారి భద్రతను మెరుగుపరచడంలో సహాయపడటమే కాకుండా.. దేశవ్యాప్తంగా జాతీయ రహదారుల గురించి వినియోగదారు అనుభవాన్ని, అవగాహనను మెరుగుపరచడంలో కూడా సహాయపడతాయని మంత్రిత్వ శాఖ తెలిపింది.

## బీహార్‌లో ఎన్నికలు ఒకేవిడత నిర్వహించండి

**ఈసీకి అఖిలపక్ష నేతల వినతి**

**పాట్నా(జనంసాక్షి):**బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఎన్నికల సన్నద్ధతపై రెండ్రోజుల పాటు అధికారులతో సమీక్షించేందుకు ఎన్నికల ప్రధానాధికారి జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు వివేక్ జోషి, ఎస్ఎస్ సంధు శనివారం ఉదయం పాట్నా చేరుకున్నారు. తాజ్ హోటల్‌లో నిర్వహించిన అఖిల పక్ష సమావేశంలో పాల్గొన్నారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈసీఐ సీనియర్ అధికారులు, బిహార్ చీఫ్ ఎలక్టోరల్ అధికారి వినోద్ గుంజ్యాల్ పాల్గొన్నారు. రాష్ట్రంలో గుర్తింపు పొందిన 12 రాజకీయల పార్టీలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. ఎన్నికల నిర్వహణపై వారి అభిప్రాయలను ఈసీఐ అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో ఒకే విడతలో ఎన్నికలు నిర్వహించాలని తాము కోరినట్టు జేడీ(యూ) ఎంపీ సంజయ్ ఝా తెలిపారు.

# బాకీ కార్డును గడపగడపకు తీసుకెళ్లి ప్రజలను చైతన్యం చేయాలి

- ఆవిష్కరించిన మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



మంథని, (జనంసాక్షి) : ప్రతి కార్యకర్త కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డును గడపగడపకు తీసుకెళ్లి ప్రజలను అప్రమత్తం, చైతన్యం చేస్తూ ఇచ్చిన హామీలు అమలు చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు అడిగేందుకు రావాలని కాంగ్రెస్ నాయకులను నిలదీసేలా ప్రజలకు అవగాహన కల్పించాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ బిఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం మంథని పట్టణంలోని రాజగృహాలో భూపాలపల్లి జిల్లా మాజీ జడ్పీ చైర్పర్సన్ జక్కు శ్రీహర్షిని తదితరులతో కలిసి కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డును ఆవిష్కరించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఆనాడు అధికారం కోసం అనేక హామీలు ఇచ్చి ఒక్కటి నెరవేర్చకుండా మోసం చేసిందన్నారు. ఆరు గ్యారెంటీలు వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి 22 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు అమలు చేయలేదని, ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ మోసాన్ని ప్రజల దృష్టికి తీసుకెళ్లడానికి బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ పార్టీ బాకీకార్డు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. అయితే నిత్యం బీఆర్ఎస్ పార్టీపై తనలాంటి బీద బిడ్డపై విషం కక్కే మీడియా సంస్థలు సైతం హామీలకు రూపకల్పన చేసిన వారి నీతిని సమాజానికి చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. 22 నెలల కాంగ్రెస్ పార్టీ పాలనలో అక్కా చెల్లెలకు ఒక్కొక్కరికి 55 వేలు, వృద్దులు వితంతులు,బీడి కార్మికులకు 44 వేలు, దివ్యాంగులకు 44 వేలు, ఆడబిడ్డలకు తులం బంగారం, చిన్నారులు కళాశాలకు వెళ్లే స్కూటీలు, ఫీజురియింబర్స్ మెంట్ కింద వివిధ సంస్థలకు 8 వేల కోట్లు బాకీ ఉన్నట్లు ఆయన తెలిపారు. అలాగే రైతు భరోసా కింద ఒక్కో రైతుకు 76 వేలు, రుణమాఫీ 80 శాతం కూడ పూర్తి చేయకుండా అనేక మంది రైతులకు రెండు లక్షల చొప్పున బాకీ ఉందన్నారు. రైతు కూలీలకు 24వేలు, నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి కింద 88 వేలు, విద్యాభరోసా కార్డు ఇస్తమని చెప్పిన ప్రభుత్వం ఒక్కొక్కరికి 5 లక్షలు, ఉచితబస్సుతో మోసపోయిన ఆటో అన్నలకు రెండేళ్లలో 24 వేలు బాకీ ఉన్నట్లు వివరించారు. 200 యూనీట్లు ఫ్రీ అని చెప్పినా ఎక్కడా అది అమలు కావడం లేదని, ఇల్లు లేని నిరుపేదకు ఇండ్లు ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు ఒక్క ఇల్లుకట్టించలేదన్నారు. ఉద్యమకారులను మభ్యపెట్టిండ్లు 250 చదరపు గజాల ఇంటి స్థలం 5 లక్షలు ఇస్తమని మోసం చేశారని, రాజీవ్ యువకిరణాల పేరు నాలుగు సార్లు దరఖాస్తులు తీసుకుని దాని ఊసే ఎత్తడం లేదన్నారు. ఇలా హామీల పేరుతో మోసం చేసిన కాంగ్రెస్‌ను ఉపేక్షించుకుంటూ పోతే వాళ్ల మోసాలకు హద్దులు ఉండవని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఒక్కటే కాదు ప్రజాస్వామ్యం తెలిసిన వాళ్లు ఓట్లు వస్తే నోట్ల సంచులు, పథకాలను చూపి వాటిని అమలు చేయకుండా మోసం చేసే వాళ్ల గురించి సమాజానికి తెలియజేయాల్సిన బాధ్యత ఉందన్నారు. కాంగ్రెస్‌ను నమ్మితే చీకటే తప్ప వెలుగులు ఉండవని, 78 ఏండ్లలో 50 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ ఇప్పటికి చీకట్లోనే ఉంచిందన్నారు. దేశం నుంచి మొదలై రాష్ట్రం గ్రామం వరకు కాంగ్రెస్ అనాదిగా మోసం చేస్తూనే వస్తుందన్నారు. ఈసారి ఎమ్మెల్యే కుటుంబం మంథని నియోజకవర్గాన్నే కాకుండా యావత్ తెలంగాణ రాష్ట్రాన్ని మోసం చేసిందనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. 22 నెలల కాలంలో ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం బాకీ పడిందని, ఆ విషయాన్ని గడపగడపకు తీసుకెళ్లాలని, మన పోరాటంతో కాంగ్రెస్ పార్టీలో చీకట్లో ఉన్న వాళ్లకు మేలు జరిగే అవకాశం ఉందన్నారు. మనం అధికారం కోసం కాదు ప్రజల కోసమే పని చేస్తున్నామని, అధికారంలో ఉంటే ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించడం.. అధికారంలో లేకపోతే ప్రతిపక్షంలో ఉంటూ ప్రభుత్వం మెడలు వచ్చి పనులు చేయించాలన్నారు. ఆనాడు ఎమ్మెల్యే ఉండి కాళేశ్వరం ప్రాజెక్టు రివ్యూ మీటింగ్ పేరుతో పనులు చేయవద్దని చెప్పిన చరిత్ర మంథని ఎమ్మెల్యేదని ఆయన గుర్తు చేశారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త ఒక్క క్షణం కూడా అలసత్వం చేయకుండా కాంగ్రెస్ బాకీ కార్డును గడపగడపకు తీసుకెళ్లి ప్రజలను చైతన్యం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలపై నియోజకవర్గ నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించి దిశానిర్ధేశం చేశారు.



# పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించిన కలెక్టర్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 4 (జనంసాక్షి) :**
శనివారం జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ దోమకొండ మండలములోని గొట్టిముక్కల గ్రామ పంచాయతీలో ఎంపీటీసీ , జడ్పిటిసి,, సర్పంచ్, ఎన్నికల కోసం ఏర్పాటు చేయనున్న పోలింగ్ స్టేషన్ లను పర్సీలించడమైనది. పోలింగ్ కేంద్రంలో ఓటర్ల సౌకర్యార్థం మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యము తో పాటుపోలింగ్ కేంద్రంలో దివ్యాంగులను దృష్టిలో పెట్టుకుని ర్యాంపు ను ఏర్పాటు చేయలని ఎంపీడీవో ని అదేశించినారు. తరువాత ఆర్ అండ్ బి రోడ్డు డ్యామేజ్ అయ్యింది అట్టి పనులు సత్వరమే చేయాలని సంబంధిత కాంట్రాక్టర్ కి పోన్ చేసి చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ సురేందర్, డిసిఎస్ఓ వెంకటేశ్వర్రావు, స్థానిక తాసిల్దార్, ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పేరిట రాజన్న ఆలయాన్ని
# మూసివేస్తే ఊరుకునేది లేదు



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 4 (జనంసాక్షి) :**
దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయం పునర్నిర్మాణంలో భాగంగా రాజన్న ఆలయాన్ని మూసివేస్తే ఊరుకునేది లేదని రాజన్న సిరిసిల్ల జిల్లా బిజెపి అధ్యక్షుడు రెడ్డిబోయిన గోపి అన్నారు. అయన శనివారం వేములవాడలోని వేములవాడ రూరల్ బిజెపి పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి పేరిట ఆలయాన్ని మూసివేసే పెద్ద కుట్ర జరుగుతుందన్నారు. ఇది హిందూ మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉందన్నారు. సుమారు వందల కోట్లతో కాశి, ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయాల పునర్నిర్మానంలో అభివృద్ధి పనులు చేసినప్పుడు భక్తులకు దర్శనాలు నిలిపి వేయలేదని, మరి రాజన్న ఆలయంలో దర్శనాలు ఎందుకు బందు చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. అంతేకాకుండా ఎక్కడైనా ముస్లిం మసీదులలో హిందువుల యొక్క సమాధులు ఉన్నాయా, మరి రాజన్న ఆలయంలో దర్గా ఎందుకని ఆరోపించారు. పునర్నిర్మాణంలో భాగంగా దర్గాను ప్రత్యేక చోటుకు తరలించాలన్నారు. బిజెపి పార్టీ ఎప్పుడూ కూడా ఆలయాల అభివృద్ధికి వ్యతిరేకం కాదని, ప్రభుత్వం హిందూ మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరించకుండా అభివృద్ధి పనులు చేసుకుంటూ పోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతి రెడ్డి, సిరికొండ శ్రీనివాస్ జిల్లా ఉపాధ్యక్షులు బండ మల్లేశం,జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్రావు,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిరాడంబరత.. నిస్వార్థ నేత.. జువ్వాడి!

**మాజీ మంత్రి జీవన్ రెడ్డి**



**రాయికల్ అక్టోబర్ 04(జనం సాక్షి ):** సర్పంచిగా పనిచేసినా.. సమితి అధ్యక్షుడిగా సేవలందించినా.. రాష్ట్ర మంత్రి హోదాలో తిరిగినా.. ఆయన తుది శ్వాస విడిచే వరకు నిరాడంబరత.. నిస్వార్థ నేతగా ప్రజల మనలను పొందిన దివంగత మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్ రావు అని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. శనివారం రాయికల్ పట్టణంలోని శివాజీ చౌక్ వద్ద దివంగత మాజీ మంత్రి రత్నాకర్ రావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి మౌనం పాటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జువ్వాడి రత్నాకర్ రావు విలువలతో కూడిన రాజకీయం చేశారని ఆయన సిద్ధాంతాలు నేటికీ అనుసరణీయమన్నారు. అనుక్షణం పేద ప్రజల సంక్షేమం కోసం నియోజకవర్గ అభివృద్ధి కోసం పరితపించే వారని,ఆశయ సాధన కోసం అహర్నిశలు కృషి చేస్తామన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం వరకు ఉమ్మడి జిల్లాకు చెందిన రాజకీయ దిగ్గజాలతో ఆయన కదం పదం కలిపారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు మ్యాకల రమేష్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోపి రాజారెడ్డి,మండల ప్రధాన కార్యదర్శి గుర్రం మహేందర్ గౌడ్, మాజీ సర్పంచులు తంగెళ్ల రమేష్, అత్తినేని గంగారెడ్డి, నాయకులు కొయ్యేడి మహిపాల్, బాపురపు నర్సయ్య, షాకీర్, బత్తిని భూమయ్య, దాసరి గంగాధర్, మున్ను, రాజారెడ్డి, చింతలపల్లి గంగారెడ్డి, తలారి రాజేష్, కోడిపెల్లి ఆంజనేయులు,బొడ్డం అంజిరెడ్డి, ఏలేటి జలంధర్ రెడ్డి, జగదీశ్వర్, నరేష్, సాయి, సంతోష్, రాజేందర్ సాగర్, రామ్ రెడ్డి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## అధికార పార్టీ కాంగ్రెస్ నాయకులు
# ఎన్నికల కోడ్‌ను ఉల్లంగించారు

**బిజెపి జిల్లా కార్యదర్శి వెంకటేష్**



రుద్రంగి అక్టోబర్ 4 (జనం సాక్షి) : అధికార పార్టీ కాంగ్రెస్ నాయకులు ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని శనివారం బిజెపి జిల్లా కార్యదర్శి నందాడం వెంకటేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా కార్యదర్శి నంద్యాడపు వెంకటేష్ మాట్లాడుతూ... రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలంలో జరుగుతున్న బతుకమ్మ వేడుకల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలు, జెండాలు ఏర్పాటు చేసి ఎన్నికల కోడ్ ను ఉల్లంఘించారని అన్నారు. ఎన్నికల కోడ్ నిబంధనల ప్రకారం కోడ్ అమలులో ఉన్నప్పుడు పార్టీ పరమైన ఫ్లెక్సీలు పెట్టకూడదని తెలిసి కూడా కాంగ్రెస్ నాయకులు అధికారం ఉందికదా అని ఫ్లెక్సీని ఏర్పాటు చేశారని అన్నారు. ఇట్టి ఫ్లెక్సీలను తొలగించాలని స్థానిక ప్రభుత్వ అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదని అన్నారు. 100 సంవత్సరాల ఆర్.ఎస్.ఎస్ ఉత్సవాలు దేశ వ్యాప్తంగా జరుగుతుంటే, ఏ పార్టీ కి సంబంధం లేని ధర్మాన్ని కాపాడే దేశ భక్తి గల సంస్థ జెండాలు, కాషాయ జెండాలు ఉంటే ప్రభుత్వంలో ఎంమ్మెల్యే స్థాయి నాయకులకు అడుగులకు మడుగులు ఒత్తుతు ప్రభుత్వ అధికారులు వ్యవహారిస్తున్నారు, కాంగ్రెస్ పార్టీ దిగజారి పోయి ఏ రోజు హిందూ పండుగులకు రాని కొంత మంది నాయకులు, చేయని ఏర్పాట్లను కాంగ్రెస్ పార్టీ పై రాష్టంలో ఉన్న వ్యతిరేకతను కాపాడుకునే పనిలో స్థానిక ఎమ్మెల్యే పడరని పాట్లు పడుతున్నాడు. వెంటనే సంబంధిత అధికారులు ఎన్నికల నిర్వహణ అధికారులు ఇట్టి ఫ్లెక్సీలను, కాంగ్రెస్ పార్టీ జెండాలను తొలగించాలని,ఎన్నికల కమిషన్ రూల్స్ ను బ్రేక్ చేసిన ప్రభుత్వ అధికారుల మీద చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు తదితరులు ఉన్నారు.

# పాలకుర్తి జడ్పీటిసి టికెట్ నేతకాని సామాజిక వర్గానికి కేటాంచాలి

**- దుర్గం రాజేష్ రాష్ట్ర అధ్యక్షులు**



పెద్దపల్లి,అక్టోబర్ 04(జనంసాక్షి) : పాలకుర్తి మండల జడ్పీటిసి కాంగ్రెస్ టికెట్ నేతకాని సామాజిక వర్గానికి కేటాయించాలని రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ కు నేతకాని మహర్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దుర్గం రాజేష్, రాష్ట్ర ముఖ్య సలహాదారు దుర్గం నర్సయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి గోల్లే రాజమల్లయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు కామెర ప్రకాష్, రాష్ట్ర నాయకులు దుర్గం నగేష్ శనివారం వినతిపత్రం అందజేశారు. పాలకుర్తి మండలంలో నేతకాని జనాభా అత్యధికంగా ఉందని, మా సామాజిక వర్గానికి చెందిన గోల్లే రాజ్ కుమార్ కు కాంగ్రెస్ జడ్పీటిసి అభ్యర్థిగా టికెట్ ఇవ్వాలని ఎమ్మెల్యేను కోరారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు నేతకాని సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతకాని మండల నాయకులు జాడి తిరుపతి, పాయిడి సత్యనారాయణ, మంచినీళ్ళ లింగయ్య, బౌతు గంగజలం, రావుల శ్రీనివాస్, ముడిమడుగుల చంద్రశేఖర్, ముడిమడుగుల శేఖర్,తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో పురోగతి సాధించాలి

**నిజామాబాద్ జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి**



**నిజామాబాద్ జిల్లా అక్టోబర్ 04 (జనం సాక్షి) :**
నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయించాలని కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన జిల్లా కేంద్రంలోని దుబ్బ ప్రాంతంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పునాది దశ వరకు నిర్మాణ పనులు పూర్తి చేసుకున్న లబ్ధిదారులను కలిసి, వారికి మొదటి విడత బిల్లు మంజూరు అయ్యిందా అని ఆరా తీశారు. ఇంకనూ నిర్మాణ పనులు ప్రారంభించని లబ్దిదారులతో భేటీ అయ్యి, పనులు ఎందుకు ప్రారంభించలేదని కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరిగేలా చొరవ చూపాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. లబ్ధిదారుల ఎంపిక, మంజూరీ ప్రక్రియలలో జాప్యానికి తావు లేకుండా చూడాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇల్లు నిర్మించుకునేందుకు అనేక మంది ఆసక్తి చూపుతున్నప్పటికీ, పట్టణ ప్రాంతాల్లో సైతం ఇందిరమ్మ ఇళ్లను అందించాలనే ప్రభుత్వ సంకల్పం మేరకు మున్సిపాలిటీల పరిధిలో కూడా ఇళ్లను మంజూరు చేయడం జరిగిందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని, మంజూరీలు తెలుపబడిన వారందరూ ఇందిరమ్మ ఇళ్లు కట్టుకునేలా ప్రోత్సహించాలని, అవసరమైతే ఇందిరమ్మ కమిటీ సభ్యుల సహకారం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇల్లు నిర్మించుకునే ఆర్థిక స్థోమత లేని లబ్దిదారులకు మెప్మా ఆధ్వర్యంలో బ్యాంకు లింకేజీ కింద రుణం అందించేలా చొరవ చూపాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ప్రగతిని నిరంతరం పర్యవేక్షణ జరపాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాలకు ఏమైనా ఇబ్బందులు ఉంటే వాటిని పరిష్కరించుకుంటూ ముందుకెళ్లాలని, నిర్ణీత లక్ష్యానికి అనుగుణంగా పూర్తిస్థాయిలో ఇళ్ల నిర్మాణాలు జరిగేలా కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు 400 చదరపు అడుగులకు తక్కువ కాకుండా, 600 చదరపు అడుగులకు మించకుండా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా లబ్దిదారులకు అవగాహన కల్పించాలని, ప్రభుత్వం తరపున అందిస్తున్న తోడ్పాటు గురించి తెలియజేస్తూ, వారు నిర్మాణాలు చేపట్టేలా అవసరమైన సహకారం అందించాలని అన్నారు. ఆయా దశల ఇళ్ల నిర్మాణాలను అనుగుణంగా లబ్దిదారుల ఖాతాలలో బిల్లులు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. తాను తదుపరి తనిఖీలు జరిపే సమయానికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో స్పష్టమైన పురోగతి కనిపించేలా అంకిత భావంతో కృషి చేయాలని అన్నారు. అలసత్వానికి తావిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అభయహస్తం కాలనీ సందర్శన కాగా, దుబ్బ ప్రాంతంలోని అభయహస్తం కాలనీని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి శనివారం సందర్శించారు. ప్రభుత్వ అసైన్డ్ భూమిని పరిశీలించిన కలెక్టర్, జాయింట్ సర్వే జరిపి హద్దులను నిర్ధారించాలని రెవెన్యూ, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, హౌసింగ్ పీ.డీ పవన్ కుమార్, డీ.ఈ నివర్తి, మున్సిపల్ టౌన్ ప్రాజెక్టు అధికారి రమేష్, నార్త్ తహసీల్దార్ విజయ్ కాంత్ తదితరులు ఉన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల సత్తా చాటాలి

- బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాష్ పిలుపు



**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 04 (జనంసాక్షి):**
త్వరలో జరిగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ పార్టీలకు అతీతంగా బీసీల సత్తా చాటాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు ఎన్నం ప్రకాష్ పిలుపునిచ్చారు. కరీంనగర్ పట్టణం లోనీ మ%శీ%కమ్మతోటలో బీసీ సంక్షేమ సంఘం కార్యాలయం లో బీసీ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధొగ్గలి శ్రీధర్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిధులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగు సంపత్ గౌడ్, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఎన్నం ప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏన్నం ప్రకాష్ మాట్లాడుతూ... స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీలకతీతంగా బీసీలందరూ ఐక్యంగా ఉండి బీసీ అభ్యర్థుల గెలుపు కోసం కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన వాగ్దానాన్ని నిలుపుకొని, 42 శాతం జీవో అమలు కోసం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బీసీలకు చట్టబద్ధమైన రిజర్వేషన్లు కల్పించాలని, ఒకవేళ జీవో అమలు కాకపోతే, రాజకీయ పార్టీల ప్రకారంగా బీసీ రిజర్వేషన్లు అంటూ కాంగ్రెస్ మాయ మాటలు చెప్పే ప్రమాదం ఉందని దీనిని అన్ని రాజకీయ పార్టీల బీసీల నాయకులు గమనించాలని కోరారు. బీసీ రిజర్వేషన్ల పై కాంగ్రెస్ పార్టీ ఇదే ఎజెండాతో వస్తే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు డిపాజిట్ రాకుండా చేస్తామని బీసీ సంక్షేమ సంఘం తరుపున హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్ల పై కాంగ్రెస్ కల్లబొల్లి మాటలకు స్వస్తిపలికి, కోర్టులో జీవో అమలు కోసం ప్రయత్నం చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం బీసీలు తమ పట్టు కోసం ప్రయత్నం చేయాలని, జనరల్ స్థానాలలో కూడా బీసీల సత్తా చాటాలని కోరారు. ఈ సమావేశం లో బీసీ సంక్షేమ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు రాచమల్ల రాజు, జిల్లా ఉపాధ్యక్షులు ఎడ్ల సురేందర్, జిల్లా కార్యదర్శులు బండారు మల్లయ్య, నల్లవెల్లి రవి, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మదాసు సంజీవ్, బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు నారోజు రాకేష్ చారి, తదితరులు పాల్గొన్నారు.

# లక్కీడ్రా విజేతలకు బహుమతులు అందించిన మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్

**సుల్తానాబాద్,అక్టోబర్ 04(జనంసాక్షి) :**



దుర్గా మాతా శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా, పూసాల భక్త మార్కండేయ దేవాలయంలో చైర్మన్ వలస నీలయ్య ఆధ్వర్యంలో దుర్గామాత కొరకు లక్కీ డ్రా నిర్వహించగా, మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. ఇందులో ప్రథమ బహుమతిగా శ్రీ శివ సాయి రైస్ మిల్ ఓనర్కు ఎలక్ట్రిక్ స్కూటీ మొదటి బహుమతిగా. రెండవ బహుమతి వాషింగ్ మిషన్,వినయ్ స్వప్న కాలనీకు, మూడవ బహుమతిగా కొడారి సతీష్ పూసాలకి 32 ఇంచెస్ కలర్ టీవీ వీరు ముగ్గురు లక్కీ డ్రా లో విజేతలుగా నిలువడంతో, వీరికి మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్ చేతుల మీదుగా ఎలక్ట్రిక్ స్కూటీ, వాషింగ్ మిషన్, 32 ఇంచుల టీవీ అందజేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు భక్తులు పాల్గొని, అమ్మవారి చీరలు నగలు వేలం వేయడం జరిగింది. ఒడిబియ్యము వండి అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్, చైర్మన్ వలసనీలయ్య,శంకర్, పేగడ కిషన్, వడ్నాల రమేష్, శ్రీరామల శంకర్, గుండేటి రమేష్, మాజీ ఎంపీటీసీ,ధీకొండ భూమేష్, పూసాల సాంబమూర్తి, పెగడ అంజయ్య, వద్దంటి ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

# కాన్షీరాం వర్ధంతిని జయప్రదం చేయాలి

**కర పత్రాలు విడుదల చేసిన నాయకులు**



**పెద్దపల్లి,అక్టోబర్ 04(జనంసాక్షి) :** ఈనెల 9న పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బీఎస్పీ పార్టీ కార్యాలయంలో నిర్వహించే కాన్షీరాం 19 వర్ధంతిని పార్టీ శ్రేణులు, బహుజనులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని బీఎస్పీ జిల్లా ఇంఛార్జి వరికిళ్ళ మల్లేష్, జిల్లా అధ్యక్షుడు ఇరుకుల్ల రాజనర్సయ్య పిలుపునిచ్చారు. పెద్దపల్లి జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం వర్ధంతి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బహుజనుల రాజ్యాధికార ప్రదాత, భారత సామాజిక శాస్త్రవేత్త, బడుగుల ఆశాజ్యోతి, బీఎస్పీ వ్యవస్థాపకులు కాన్షీరాం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కలిసి రావాలని కోరారు. బహుజనులను రాజకీయంగా చైతన్యం చేసి అధికారం వైపు నడిపి ఉత్తరప్రదేశ్ లో బీఎస్పీని అధికారంలోకి తెచ్చి అట్టడుగు వర్గాలకు మేలు చేసిన వ్యక్తి కాన్షీరాం అని కొనియాడారు. భారత రాజకీయ యుద్ధభూమిలో ఓట్లు మావి సీట్లుమీవా అనే నినాదంతో మనువాదుల గుండెల్లో వణుకుపుట్టించి బహుజనుల ఆత్మగౌరవాన్ని చాటిచెప్పిన మహనీయుడు కాన్షీరాం అని గుర్తు చేశారు. కాన్షీరాం వర్ధంతి కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, బహుజనులందరు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షుడు గొట్టే రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కాంపెల్లి బాబు, మంథని నియోజకవర్గ ఇంచార్జీ జనగామ రవికుమార్, రామగుండం అసెంబ్లీ ఇంఛార్జి జింక ఉదయ్, పెద్దపల్లి అసెంబ్లీ అధ్యక్షుడు బొంకూరి దుర్గయ్య, ప్రధాన కార్యదర్శి సాతురి అనిల్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలంతా మన వైపే విజయం కూడా మన వైపే

- వివిధ పార్టీల నుండి బిఆర్ఎస్ పార్టీలోకి చేరిక
- హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



**వీణవంక అక్టోబర్ 4 (జనం సాక్షి)** వీణవంక తెలంగాణ రాష్ట్ర రైతులకు ఇచ్చిన హామీలన్నీ వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం వీణవంక మండల కేంద్రంలోని స్థానిక ఫంక్షన్ హాల్ లో బిఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడాతు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రైతులకు కనీసం యూరియా బస్తాలు అందించకుండా రైతులను రోజుల తరబడి యూరియా కేంద్రాల ముందు నిలబెట్టిన ఘనత కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. తెలంగాణ ప్రజలకు ఆరు గ్యారంటీలతో 420 హామీలు ఇచ్చి ప్రజల ముందు ప్రభుత్వం నిలిచిందని అన్నారు. ముఖ్యంగా రైతుల విషయంలో దారుణంగా తయారైందని 24 గంటల కరెంటు ఇవ్వడం లేదని,రైతులకు రెండు లక్షల రుణమాఫీ పూర్తి స్థాయిలో కాలేదని,రైతుబంధు రైతు బీమా విషయంలోనూ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని అన్నారు. బోనస్ విషయంలో కూడా ఇప్పటివరకు రైతులకు ప్రభుత్వం అందించలేదన్నారు. కెసిఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోయిందని అన్నారు. వీణవంక కు సంబంధించిన కల్వల ప్రాజెక్టు పూర్తయితే చాలామంది రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని వెంటనే కల్వల ప్రాజెక్టు పూర్తి చేయాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతానని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచిన చేసిందేమీ లేదని అన్నారు. ఇప్పటికే ప్రజలంతా కాంగ్రెస్ ప్రభుత్వం పై విరక్తి చెంది ఉన్నారని ప్రజలంతా కేసిఆర్ స్థాపించిన బిఆర్ఎస్ పార్టీ వైపే చూస్తున్నారని అన్నారు. రానున్న ప్రతి ఎన్నికలోను ప్రజలంతా బిఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు కష్టపడి పనిచేస్తే విజయం తథ్యమని అన్నారు. వివిధ పార్టీల నుండి టిఆర్ఎస్ పార్టీలో చేరిన వారికి కండువా కప్పి పార్టీ లోకి ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు పరిపాటి రవీందర్ రెడ్డి,జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వాలా బాలకిషన్ రావు,సింగిల్ విండో చైర్మన్ మావురపు విజయభాస్కర్ రెడ్డి,మాజీ ఎంపీపీ ముసిపట్ల రేణుక తిరుపతి రెడ్డి,మాడ సాధవరెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ లతా శ్రీనివాస్,కామిడీ శ్రీనివాస్ రెడ్డి తోపాటు ఆయాగ్రామల మాజీ సర్పంచులు,మాజీ ఎంపిటిసిలు,గ్రామ శాఖ అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక రిజర్వేషన్లపై సర్వత్రా ఉత్కంఠ

కోర్టు తీర్పును మరో తేదీకి వాయిదా వేస్తే తుది తీర్పు వచ్చే దాకా ప్రభుత్వం ఎదురుచూడక తప్పదు. ఒకవేళ కోర్టులో కేసు పెండింగ్ ఉండగానే ఎన్నికలకు వెళ్తే ఆ ఎన్నికలను సైతం కోర్టు రద్దు చేయొచ్చు.




## పాత రిజర్వేషన్లు కొనసాగుతాయా.. కోర్టు తీర్పుపై అందరు చూపు

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 4 (జనంసాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఇటీవల ఖరారైన రిజర్వేషన్లు మారనున్నాయా.. అంటే అవుననే సమాధానం వినిపిస్తున్నది. జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాల్లో 42 శాతం బీసీలకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. దీన్ని సవాల్ చేస్తూ పలువురు కోర్టును ఆశ్రయించడంపై ఉత్కంఠ నెలకొన్నది. బీసీ రిజర్వేషన్ల పెంపుపై అసెంబ్లీ చేసిన తీర్మానం గవర్నర్ దగ్గరే పెండింగ్‌లో ఉండగా, ఇప్పటి వరకూ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ లోపు ప్రభుత్వమే జీవో ఇవ్వాల్సిన అవసరం ఏమిటని కోర్టు ప్రశ్నించింది.ఎన్నికలకు పది రోజులు ఆగాలని ఆదేశించి తదుపరి విచారణను ఈ నెల 8 కి వాయిదా వేసింది. దీంతో రిజర్వేషన్ల అమలుపై నీలినీడలు కమ్ముకున్నాయి. కోర్టు విచారణ అనంతరం ఎన్నికలపై ప్రభుత్వం ముందుకెళ్తుందని అంతా భావించారు.కోర్టులో కేసు ఉండగానే రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. రెండు విడుతల్లో ఎంపీటీసీ,జడ్పీటీసీ ఎన్నికలు, మూడు విడుతల్లో సర్పంచ్ ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ విడుదల చేసింది. దీంతో 8 న కోర్టు ఏం తీర్పు ఇస్తుంది.. మొన్న చేసిన రిజర్వేషన్లు ఉంటాయా... మారుతాయా... అన్న ఆందోళన నెలకొన్నది.


**69 శాతానికి చేరనున్న రిజర్వేషన్లు..**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవోతో ఎస్సీ,ఎస్టీలకు ఇప్పటికే ఉన్న 27 శాతం కలిపితే రిజర్వేషన్లు 69 శాతం దాటిపోతున్నాయి.

రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్లు 50 శాతం మించకూడదు. 2018లో అప్పుడున్న బీఆర్ఎస్ సర్కారు బీసీల రిజర్వేషన్లు పెంచే ప్రయత్నం చేసింది. కాంగ్రెస్ పార్టీ కోర్టుకు వెళ్లడంతో పాత రిజర్వేషన్లను అనుసరించే ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చింది. ప్రస్తుత పరిస్థితుల్లో పెంచిన రిజర్వేషన్లకు కోర్టు బ్రేకులు వేసే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. కోర్టు తీర్పును మరో తేదీకి వాయిదా వేస్తే తుది తీర్పు వచ్చే దాకా ప్రభుత్వం ఎదురుచూడక తప్పదు. ఒకవేళ కోర్టులో కేసు పెండింగ్ ఉండగానే ఎన్నికలకు వెళ్తే ఆ ఎన్నికలను సైతం కోర్టు రద్దు చేయొచ్చు. అంత దూరం తీసుకురావడం కంటే తుది తీర్పు వెలువడే వరకూ వేచి చూడడం మంచిదనే అభిప్రాయా లు వ్యక్తమవుతున్నాయి. రిజర్వేషన్ల పెంపు సాంకేతికంగా సాధ్యం కాదని నిపుణులు సైతం చెబుతున్నారు. దీంతో ఇటీవల ఖరారైన రిజర్వేషన్లు మారడం తప్పనిసరిగా కనిపిస్తున్నది. అదే జరిగితే అనుకూలంగా రిజర్వేషన్లు వచ్చాయంటూ సంబురపడుతున్న ఆశావహుల ఆశలు అడియాసలు కానున్నాయి.

**వేడెక్కిన రాజకీయాలు..**

ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేయడంతో గ్రామాలు, మండల స్థాయిలో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. కొత్తగా ఖరారైన రిజర్వేషన్లను అనుసరించి ఆశావాహులు చాలా మంది అధికార, ప్రతిపక్ష పార్టీల నుంచి తామే అభ్యర్థులమనే ప్రచారం చేసుకుంటున్నారు. సర్పంచ్ ఎవరు,ఎంపీటీసీ ఎవరు, జడ్పీటీసీ ఎవరు అంటూ జనాల్లో చర్చ మొదలైంది. ఎవరెవరు బరిలో ఉంటున్నారు.. ఎవరు గెలిచే అవకాశాలున్నాయి. అన్న అంశాలపై జోరుగా చర్చ నడుస్తున్నది. రిజర్వేషన్లు ఖరారవడంతో ప్రతి స్థానానికి ఒక్కో పార్టీ నుంచి నలుగురైదుగురి పేర్లు వినిపిస్తున్నాయి. ఎవరికి వారు పార్టీల మద్దతు కూడగట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.




**ఎవరి వ్యూహాలలో వారు రాజకీయం మొదలుపెట్టారు.**

సద్దుల బతుకమ్మ,దసరా పండుగల్లో రాజకీయ ఉనికి చాటుకునే దిశగా వినూత్న కార్యక్రమాలు చేపట్టారు.ఈ రిజర్వేషన్లు ఉంటాయా, ఉండవా అన్న దానిపై స్పష్టత లేకపోవడం ఆశావాహులకు ఇబ్బందిగా మారింది. ఓ వైపు తాము బరిలో ఉంటామనే సంకేతాలు ఇస్తూనే ఖర్చుల విషయంలో చాలా మంది ఆచీతూచి అడుగులు వేస్తున్నారు. దీంతో ఈ నెల 8 న కోర్టు ఏం చెబుతుంది అన్నది కీలకంగా మారింది. కోర్టు బీసీ రిజర్వేషన్లపై అనుకూలంగా స్పందించాలని కొందరు,పాత రిజర్వేషన్లకే కొనసాగించేలా తీర్పు ఇవ్వాలని మరికొందరు కోరుకుంటున్నారు.దీంతో కోర్టు ఏం చెబుతుందో అన్న ఆసక్తి ఆశావాహుల్లో ఎక్కువైపోయింది.

## లండన్‌లో దమ్మన్నపేట యువకుడు ఆకస్మిక మృతి

### మహేందర్ రెడ్డి మృతి పట్ల ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తీవ్ర దిగ్భ్రాంతి



**మేడిపల్లి,అక్టోబర్ 4(జనంసాక్షి):** వేములవాడ నియోజకవర్గంలోని మేడిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏనుగు రమేష్ రెడ్డి పెద్ద కుమారుడు మహేందర్ రెడ్డి లండన్ లో గుండెపోటుతో మృతి చెందగా విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు..వారి కుటుంబసభ్యులను పరామర్శించారు..ఎంతో భవిష్యత్తు ఉన్న మహేందర్ రెడ్డి చిన్న వయసులో మృతి చెందడం బాధాకరమని, ఆ భగవంతుడు మహేందర్ రెడ్డి అమ్మానాన్నలకు మనోధైర్యాన్ని కల్పించాలని వేడుకున్నారు.మహేందర్ రెడ్డి మృతదేహాన్ని ఇండియాకు త్వరగా తీసుకరవాల్సిందిగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి విన్నవించగా తక్షణమే స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహేందర్ రెడ్డి మృతదేహాన్ని ఇండియాకు త్వరగా తీసుకవచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించగా, సిఎస్ లండన్ అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## భార్యాభర్తలపై దాడికి పాల్పడ్డ దుండగులు

### సీసీ కెమెరాల సహాయంతో నిందితులను గుర్తించిన పోలీసులు

**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 4( జనం సాక్షి ) :** మద్యం మత్తులో భార్యాభర్తలపై దాడికి పాల్పడ్డ సంఘటన శుక్రవారం అర్ధరాత్రి జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవేందర్ నగర్ లో చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబందించిన వివరాలు పోలీసులు తెలిపిన ప్రకారం ఉత్తరప్రదేశ్ కు చెందిన షబ్బీర్ అలీ దంపతులు జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవేందర్ నగర్ లో నివాసం ఉంటున్నారు. శుక్రవారం అర్ధరాత్రి వీరు తమ ద్విచక్ర వాహనంపై వారి నివాసానికి వెళ్తుండగా మద్యం మత్తులో ఉన్న కొందరు యువకులు ఎలాంటి కారణం లేకుండా దంపతులపై విచక్షణ విధంగా దాడికి పాల్పడ్డారు. వెంటనే బాధితులు జగద్గిరిగుట్ట పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డికి దసరా శుభాకాంక్షలు

**దోమ అక్టోబర్ 04 జనం సాక్షి :** దోమ మండల పరిధిలోని ఐనాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, ఇందిరమ్మ కమిటీ అధ్యక్షులు ఈడిగి ఆశన్న గౌడ్ ఆధ్వర్యంలో దసరా పండుగ సందర్భంగా ఐనాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిగి పట్టణంలో ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భారీగా ఐనాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఓట్ చోరీపై సంతకాల సేకరణ

- నగరంలో ఆదివారం 60 వ డివిజన్ ఇందిరా చౌక్ వద్ద ప్రారంభం
- నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 04 (జనంసాక్షి):**
ఈ నెల 17 వరకు ఓట్ చోరీ రాష్ట్ర వ్యాప్తంగా సంతకాల సేకరణ జరుగుతుందని నగరంలోని అన్ని డివిజన్లలో డివిజన్ కు కనీసం వందకు తగ్గకుండా సంతకాలు చేపడుతామని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్‌లో చాలా ప్రాంతాలలో ఓట్ చోరీ జరుగుతుందని మొన్న పాదయాత్రలో పీసీసీ అధ్యక్షుడికి ఆధారాలతో చూపించామని అన్ని డివిజన్లలో దొంగ ఓట్లను వెలికి తీస్తా మని కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం ఆదివారం ఉదయం ఇందిరా చౌక్ వద్ద 60వ డివిజన్ నుండి ప్రారంభిస్తున్నామని కోమటి రెడ్డి నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ నెల 17 వరకు ఈ ప్రక్రియ పూర్తి చేసి పిసిసికి పంపిస్తామని ఈ కార్యక్రమంలో ముఖ్యనా యకులు పాల్గొంటారని కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తెలిపారు.



## పోలీస్ స్టేషన్ సమీపంలో అదుపుతప్పిన కారు బైక్‌ను ఢీ కొట్టింది

- బొంరాస్ పేట డిప్యూటీ తహశీల్దార్ చాంద్ పాషాకు తీవ్ర గాయాలు

**బొంరాస్ పేట, అక్టోబర్ 4( జనం సాక్షి):**
మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ముందు అదుపుతప్పి కారు బైక్‌ను ఢీ కొట్టిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానిక పోలీసులు తెలిపిన ప్రాథమిక సమాచారం ప్రకారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ గా విధులు నిర్వహిస్తున్న చాంద్ పాషా డ్యూటీ ముగించుకొని AP23S3352 నంబర్ కలిగిన బైక్ తాండూరు వెళ్లేందుకు బయలుదేరగా మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ ముందు ఉన్న హెచ్.పి పెట్రోల్ బంకు దగ్గర పెట్రోల్ పోయించుకునేందుకు వెళుతుండగా మండల కేంద్రంలోని భూలక్ష్మమ్మ చౌరస్తా నుండి వస్తున్న AP28CJ9611 నంబర్ గల కారు అదుపుతప్పి బైక్ ను ఢీకొట్టడంతో బైక్ పై ప్రయాణిస్తున్న డిప్యూటీ తహశీల్దార్ చాంద్ పాషా కు తీవ్ర గాయాలు కావడంతో అంబులెన్సులో కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనకు సంబంధించి ఎలాంటి కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు. కారు నడుపుతున్న వ్యక్తి ధరూర్ మండలం మైలారం గ్రామానికి చెందిన రైతు తెలుగు బందెయ్యగా పోలీసులు గుర్తించారు.



## మొయినాబాద్ మున్సిపాలిటీలో సమస్యల సుడిగుండం

- పైపులైన్లు పగిలి రోడ్లపైకి మురికి నీరు
- అధికారుల నిర్లక్ష్యమే కారణమంటున్న స్థానికులు
- బాలాజీ దర్శనానికి వెళ్లేవారికి ఇబ్బందులు



**మొయినాబాద్, అక్టోబర్ 4 (జనంసాక్షి) :** మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుంచి స్థానికులకు అనేక సమస్యలు తలెత్తుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని గ్రామంలో నిత్యం వాటర్ పైపులైన్లు పగిలిపోతూ రోడ్లపై మురికినీరు ప్రవహిస్తోందని, ఇది ప్రమాదకరంగా మారుతోందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో గ్రామ సర్పంచ్ మంజుల రవి యాదవ్, ఉపసర్పంచ్ శ్యామ్‌రావు ఆధ్వర్యంలో ఎలాంటి సమస్యలు లేకుండా చూసుకున్నారని, కానీ మున్సిపాలిటీ ఏర్పడిన తర్వాత అధికారుల నిర్లక్ష్యం వల్ల సమస్యలు పెరిగిపోతున్నాయని రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షురాలు మంజుల రవి యాదవ్, మాజీ ఉపసర్పంచ్ శ్యామ్‌రావు, మాజీ వార్డు సభ్యుడు మాల యాదయ్య తదితరులు పేర్కొన్నారు. చిలుకూరు బాలాజీ టెంపుల్‌కు వెళ్లేందుకు గ్రామం నుంచి శుద్ధిగా బయలుదేరినా రోడ్లపై మురికినీరు ప్రవహిస్తుండటంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మురికినీరు లేకుండా రోడ్లను శుభ్రంగా ఉంచాలని, అండర్ డ్రైనేజీ, మోరీలను సక్రమంగా నిర్వహించాలని కోరుతున్నారు. గ్రామంలో మంచినీటి పైపులైన్లు లీక్ అవుతూ పగిలిపోతున్నాయని, గతంలో ఇలాంటివి జరగలేదని, మున్సిపాలిటీ ఏర్పడిన తర్వాతే ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయని అధికారులు పరిశీలించి పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.





## తాటిచెట్లను కాల్చిన వారిపై చర్య తీసుకోవాలి


- కరీంనగర్ రూరల్ ఎక్సైజ్ సిఐకి పిర్యాదు
- కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం లక్ష్మీపూర్ గౌడ సంఘం బొమ్మ తిరుపతి

**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 04 (జనంసాక్షి):** కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో శుక్రవారం రోజుగుర్తు తెలియని వ్యక్తులు గౌడ కులస్తులకు సంబందించిన తాటి చెట్లను కాల్చివేశారు. దీనికి సంబంధించిన వారిపై వెంటనే చర్య తీసుకోవాలని కరీంన గర్ రూరల్ ఎక్సయిజ్ సీఐ కి బొమ్మ తిరుపతి గౌడ్ పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం లక్ష్మీపూర్ గౌడ సంఘం అధ్యక్షుడు బొమ్మ తిరుపతి గౌడ్ మాట్లాడుతూ... లక్ష్మీపూర్ కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు లక్ష్మీపూర్ గ్రామాంలో ఈత, తాటి చెట్ల కళ్ళు గీసుకొని జీవనం సాగిస్తామని తెలిపారు. లక్ష్మీపూర్ గ్రామంలోని సర్వే నెంబరు 24 లో కాంతల మధుసూదన్ రెడ్డి భూమిలో ఉన్న తాటి చెట్లను శుక్రవారం రోజు కాల్చడం జరిగిందని దీనికి సంబంధించిన బాధ్యుల పై చట్టరీత్యా చర్య తీసుకోవాలని కరీంనగర్ రూరల్ ఆబ్కారీ సీఐకి పిర్యాదు చేశామన్నారు. అలాగే కాంతాల మధుసూదన్ రెడ్డి వారి భూమిలో గల తాటి చెట్లను గౌడ కులస్తులు కొత్తగా తాటి చెట్లు పట్టుకున్నారని దీనికిగాను గౌడ కులస్తులను తాటి చెట్లను ఎక్కడానికి వెళితే భూమి యజమాని తాటి చెట్లను ఎక్కనివ్వడం లేదని, దీనికి గాను చెట్లను ఉండకూడదని వాటిని కాల్చడం జరిగిందని దీనిపై ఎక్సైజ్ సిఐ విచారణ చేసి బాధ్యులపై చర్య తీసుకుని మా గౌడ కులస్తులకు న్యాయం చేయా లని లక్ష్మీపూర్ గౌడ సంఘం ప్రెసిడెంట్ బొమ్మ తిరుపతి గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపూర్ గీత పారిశ్రామిక సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజలందరూ సంతోషంగా ఉండాలని దుర్గమాతకు ప్రత్యేక పూజలు

- రాష్ట్ర సర్పంచుల సంఘం తాజా మాజీ అధ్యక్షురాలు మంజుల రవి యాదవ్
- భక్తి శ్రద్ధలతో హిమాయత్ నగర్‌లో దుర్గామాత నిమజ్జనం

**మొయినాబాద్. జనంసాక్షి :**
భక్తులందరూ సంతోషంగా ఉండాలని దుర్గామాత పూజలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది రాష్ట్ర సర్పంచుల సంఘం తాజా మాజీ మహిళా అధ్యక్షురాలు మదికొండ మంజుల రవి యాదవ్ మాజీ అనిత సిఆర్ యాదవులు పేర్కొన్నారు మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ గ్రామంలో మైసమ్మ దేవాలయం ఆవరణలో ఏర్పాటు చేసి దుర్గామాత నిమజ్జన కార్యక్రమాన్ని నాయకులు భక్తులు కలిసి ఘనంగా నిర్వహించారు నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 10వ రోజు దుర్గామాత నిమజ్జన కార్యక్రమాన్ని సమీపంలోని గండిపేట చెరువులో నిమజ్జనం చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్పంచ్ల సంఘం రాష్ట్ర తాజా మాజీ మహిళా అధ్యక్షురాలు మంజుల రవి యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడితే రాష్ట్రంలోని ప్రజలందరూ సంతోషంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు భక్తి భావన ప్రతి ఒక్కరు కలిగి ఉన్నప్పుడే క్రమశిక్షణతో ఉంటారని తెలిపారు భక్తి అలవార్చుకున్నప్పుడే ఎంతో ప్రశాంతతతో నెలకొట్టారని ఉంచారు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ మానసిక ప్రశాంతత పొందుతారని అన్నారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అనిత సిఆర్ యాదవ్ గ్రామ మాజీ ఉపసర్పంచ్ శ్యామ్ రావు, కుమార్ యాదవ్. కుమ్మరి దర్శన్ మహేష్ ముదిరాజ్ షాబాద్ గిరి మోడీ అశోక్, అశోక్ చారి, గ్రామ భక్తులు బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## అసమానతల అంతమే కేవీపీఎస్ అంతిమ లక్ష్యం

- మనువాదంతో దేశఐక్యతకు విఘాతం
- ఘనంగా కేవీపీఎస్ 28వ ఆవిర్భావ వేడుకలు
- కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య

**యాలాల్ అక్టోబర్ 4 ( జనం సాక్షి ) :** భారతదేశంలో వేళ ఏళ్లుగా కొనసాగుతున్న కుల ఆర్థిక అసమానతలను అంతం చేయడమే కేవీపీఎస్ లక్ష్యంగా కృషి చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య పిలుపునిచ్చారు. శనివారం యాలాల మండల కేంద్రం బస్ స్టాండ్ ఆవరణలో కేవీపీఎస్ 28వ ఆవిర్భావ వేడుకల సందర్భంగా ఆత్మగౌరవం సమానత్వం కుల నిర్మూలన లక్ష్యాలు కలిగిన కెవిపిఎస్ పతాకాన్ని కెవిపిఎస్ మండల ఇంచార్జ్ నెత్తి నర్సింలు ఎగురవేశారు.మొదట డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, జ్యోతి బాపూలే చిత్రపటానికి కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు యు. బుగ్గప్ప పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేని ప్రత్యేక అసమానతలు కులం రూపంలో ఈ దేశంలో వేల సంవత్సరాలుగా కొనసాగుతున్నాయని వీటివల్ల దేశంలో పూర్తిస్థాయిలో వెనుకబడిపోయి సాటి మనిషిని మనిషిగా చూడని నీచత్వం ఉందన్నారు. 78 ఏళ్ల స్వాతంత్రం తర్వాత కూడా నేటికీ గుడి బడిలో నేటికి వివక్ష కొనసాగడం దేశ ప్రజల ఐక్యతకు దేశ అభివృద్ధికి విఘాతం కలిగిస్తుందన్నారు. కుల వ్యవస్థను అసమానతలు సమర్థించే పాలకులు అధికారంలో ఉండటం వల్ల రాజ్యమే ఈ అసమానతలకు అండగా నిలబడటం వల్ల వాటిని రూపుమాపడానికి తరతరాలు పడుతుందన్నారు.యువతరం విద్యావంతులు కుల నిర్మూలన లక్ష్యం కోసం కృషి చేయాలన్నారు.కుల వ్యవస్థ మూలాలు భూస్వామ్య మనువాద వ్యవస్థలతో ముడిపడి ఉన్నాయని చెప్పారు. చట్టం ముందు అందరూ సమానులే అని రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా మనువాదం సృష్టించిన అసమానతల్ని కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలలో దళితులపై 300 రేట్లు దాడులు పెరిగాయన్నారు. గత ఐదేళ్ల కాలంలో 6,34,486 దౌర్జన్యాలు జరిగినట్లు ఎన్‌సిఆర్‌బి నివేదిక పేర్కొంటుందన్నారు. అందులో సగానికంటే ఎక్కువ బిజెపి పాలిత రాష్ట్రాలలో ప్రత్యేకించి ఉత్తరప్రదేశ్‌లో 3 లక్షల దౌర్జన్యాలు జరిగాయన్నారు. వీటిని అరికట్టడంలో బీజేపీ ప్రభుత్వాలు విఫలమయ్యాయని చెప్పారు. దళితులకు దేశ ప్రజలందరికి గుండెకాయ లాగా నిలుస్తున్న భారత రాజ్యాంగం రద్దుకు కుట్ర జరుగుతోందని చెప్పారు. ఈ అసమానతలను పాలకవర్గాలు కప్పిపెట్టి ఉంచుతున్నాయని తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్నాయే కానీ వివక్షనంతం చేయడంలో విఫలమవుతుందన్నారు.

28 ఏళ్ల సామాజికోద్యమ ప్రస్థానంలో కేవీపీఎస్ ఎస్సీ ఎస్టీ కమిషన్,ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం కులాంతర వివాహితులకు 2.50 లక్షల రూపాయలు ప్రోత్సాహకాలు ఇచ్చే జీవో నెం 12 ని కేవీపీఎస్ సాదిందన్నారు. 200 యూనిట్ల ఉచిత కరెంటు కోసం నాడు కేవీపీఎస్ పోరాడిందన్నారు రాష్ట్రంలో దళితులకు ఏ మూలన ఏ చిన్న దాడి జరిగిన బాధితులకు బాసటగా కేవీపీఎస్ పిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నారం రవికుమార్, మెట్లీ నర్సింలు, వడిచర్ల లాలప్ప,జోగు రమేష్, కమాల్పూర్ నర్సింలు,పి శివప్ప, బింగి సాయప్ప,కొప్పుల అశోక్, మలగేరి. శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



## తాండూరు ప్రభుత్వ ఆసుపత్రిలో డ్రైనేజీ అస్తవ్యస్తం

- దుర్గంధంతో తీవ్ర ఇబ్బందులు
- పట్టించుకునే నాధుడే కరువు
- బీజేపీ నేతల పరిశీలన.. సూపరింటెండెంట్‌కు వినతి
- వెంటనే స్పందించండి లేనిపక్షంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం



**తాండూరు, అక్టోబర్ 4 (జనంసాక్షి) :** పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి నర్సింగ్ కాలేజీ పీపీ యూనిట్‌లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తమై దుర్గంధంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగారం మల్లేశం ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ఆసుపత్రిని సందర్శించి పరిస్థితిని పరిశీలించా రు. డ్రైనేజీ మొత్తం బయటికి పొంగి వచ్చి దుర్గంధం వ్యాపిస్తుండటంతో శుభ్రత పూర్తిగా లోపించిందని వివరించారు. గత 15 రోజుల క్రితం బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ ఇన్‌చార్జికి సమస్యలపై వినతిపత్రం అందజేశామని, అయినా పట్టించుకునే నాథుడు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుపై నడిచేందుకు కూడా వీల్లేకుండా దుర్గంధం వ్యాపిస్తుండటంతో స్థానికులు, రోడ్డున పోయే ప్రజలు కూడా ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. నర్సింగ్ సిబ్బంది, విద్యార్థులు, పిల్లల పరిస్థితి మరింత దయనీయంగా ఉందన్నారు. యుద్ధప్రాతిపదికన డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరించి శాశ్వత పరిష్కారం చేపట్టాలని, బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్‌ను కోరారు. లేకుంటే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ప్రహ్లాద్ జాదవ్, కమిటీ సభ్యులు చాకలి బిచ్చప్ప, రాములు, సాయిలు, బబ్లు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
5 అక్టోబర్ 2025

### అమెరికాలో తెలుగు విద్యార్థి మృతిపట్ల

# మధుయాష్కి గౌడ్ విచారం



- కుటుంబ సభ్యులతో ఫోన్లో మాట్లాడి ఓదార్చిన మధు యాష్కిగౌడ్..
- కుమారుడి మృతదేహాన్ని తొందరగా తీసుకురావాలని ఆవేదన వ్యక్తం చేసిన తల్లి
- సాధ్యమైనంత తొందరలో తీసుకువచ్చేందుకు ఏర్పాటు చేస్తున్నామని మధుయాష్కి గౌడ్ భరోసా

హైదరాబాద్ (జనంసాక్షి) : అమెరికాలోని డల్లాస్‌లోని ఓ పెట్రోల్ బంక్‌లో గుర్తు తెలియని దుండగుడు జరిపిన కాల్పుల్లో ఎల్బీనగర్ నియోజకవర్గం బిఎన్ రెడ్డి నగర్ డివిజన్ చెందిన విద్యార్థి పోలే చంద్రశేఖర్ మృతి చెందడం పట్ల టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బీడీఎస్ పూర్తి చేసి ఉన్నత చదువుల కోసం తల్లి, సోదరులకు దూరంగా అమెరికా వెళ్లి.. చంద్రశేఖర్ అర్థాంతరంగా మృతి చెందడం తనను ఎంతో కలిచి వేసిందని పేర్కొన్నారు. కోటి ఆశలతో, బంగారు భవిష్యత్తు ఉన్న యువకుడు చంద్రశేఖర్ మరణం.. ఆ కుటుంబానికి తీరని దుఃఖాన్ని మిగిల్చిందని, అమెరికాలో ఉన్న గన్ కల్చర్ ఇలా తరచూ భారతీయులను బలి తీసుకోవడం జీర్ణించుకోలేని విషయమన్నారు. జిహెచ్ఎంసి ఫ్లోర్ లీడర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి ద్వారా చంద్రశేఖర్ తల్లి సునీత, సోదరుడు రాజ్‌కిరణ్‌లతో ఫోన్లో మాట్లాడిన మధుయాష్కి వారిని ఓదార్చారు. అమెరికా నుంచి చంద్రశేఖర్ మృత దేహాన్ని తొందరగా తీసుకువచ్చేలా చూడాలని మధుయాష్కిని వారు కన్నీరుతో కోరారు. అమెరికాలోనే ఉన్న ఆయన చంద్రశేఖర్ మృతదేహం హైదరాబాద్ తీసుకువచ్చేందుకు ప్రయత్నాలను ప్రారంభించినట్లు తెలిపారు. తెలుగు సంఘాల ప్రతినిధులను పంపి, ఇండియన్ కాన్సులేట్ అధికారులతో మాట్లాడి.. సాధ్యమైనంత త్వరలో వారి కుటుంబ సభ్యుల వద్దకు చేర్చేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# ఆరు నెలల్లో టిమ్స్ ఆస్పత్రులు పూర్తి చేయాలి

- ఆరోగ్యశ్రీ బకాయిలు వెంటనే చెల్లించాలి
- లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హరీస్ రావు హెచ్చరిక
- పార్టీ నేతలతో కసలి కొత్తపేట టిమ్స్ నిర్మాణాల పరిశీలన



హైదరాబాద్, అక్టోబర్ 4 (జనంసాక్షి) : బిఆర్ఎస్ హయాంలో గతంలో టిమ్స్ ఆసుపత్రి నిర్మాణాన్ని కేసీఆర్ తలపెట్టారని మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. నిర్మాణ పనులను రేవంత్‌రెడ్డి సర్కార్ నత్తనడకన చేస్తోందని విమర్శించారు. కొత్తపేటలో టిమ్స్ భవనాలను పార్టీ ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సుధీర్‌రెడ్డి, వివేకానంద, కాలేరు వెంకటేశ్‌తో కలిసి పరిశీలించారు. పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడతూ.. తమ ప్రభుత్వం ఉండి ఉంటే.. ఇప్పటికే టిమ్స్ పూర్తయ్యేదని చెప్పారు. రాజకీయాలను పక్కనపెట్టి కంటి వెలుగు కార్యక్రమాన్ని కొనసాగించాలన్నారు. రేవంత్‌రెడ్డి సర్కారులో ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు బకాయిలు పెట్టారని విమర్శించారు. కేసీఆర్ తీసుకొచ్చిన మంచి పనులు ఆపాలనే ఆలోచనలో సీఎం ఉన్నారని దుయ్యబట్టారు. ఆరు నెలల్లోపు టిమ్స్ ఆసుపత్రి నిర్మాణాలు పూర్తి చేయాలని.. లేదంటే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. హైదరాబాద్ నగరానికి నలు దిక్కులా నిర్మాణంలో ఉన్న టిమ్స్ ఆస్పత్రి భవనాలను ఆరు నెలల్లోపు పూర్తి చేయాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఆరు నెలల్లోపు ఆస్పత్రులు పూర్తి చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హరీశ్‌రావు హెచ్చరించారు. బీఆర్ఎస్ హయాంలో నిర్మాణం మొదలుపెట్టిన కొత్తపేట టిమ్స్ ఆస్పత్రిని మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సుధీర్ రెడ్డితో పాటు పలువురు నాయకులు పరిశీలించారు. నిర్మాణ పనుల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఎందుకు రెండు సంవత్సరాల నుండి టిమ్స్ ఆసుపత్రి ప్రారంభం కాలేదు. ఆనాడు మేము భూసేకరణ చేసి, టెండర్లు పిలిచి, డిజైన్లు పూర్తి చేసి, 6 అంతస్తుల భవన నిర్మాణం పూర్తి చేసాము.. కానీ ఈ ప్రభుత్వం రెండేళ్లలో 5 ఎ÷-లోర్లు మాత్రమే వేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వమే ఉండి ఉంటే ఈ ఆసుపత్రి గత ఏడాదే ప్రారంభమయ్యి ప్రజలకు సేవలు అందించేది. ఎక్కడ కేసీఆర్‌కు, బీఆర్ఎస్ పార్టీకి పేరు వస్తుందో అని కావాలనే ఈ ఆసుపత్రి నిర్మాణాన్ని స్లో చేస్తున్నారు. ముందు చూపు లేని మంద బుద్ధి కలిగిన నాయకులు కాంగ్రెస్ నాయకులు అని హరీశ్‌రావు విమర్శించారు. కేసీఆర్ హయాంలో మహేశ్వరం నియోజకవర్గంలో రూ.176 కోట్లతో మెడికల్ కాలేజీ, 500 పడకల ఆసుపత్రిని కట్టడానికి జీవో ఇచ్చాం. 27-09-2023 నాడు నేను, సబితక్క కలిసి వెళ్ళి ఆ మెడికల్ కాలేజీకి, 500 పడకల ఆసుపత్రికి శంకుస్థాపన కూడా చేశాం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ మెడికల్ కాలేజీని, 500 పడకల ఆసుపత్రిని రద్దు చేసి ఎల్బీ నగర్ టిమ్స్‌లో విలీనం చేశారు అని హరీశ్‌రావు గుర్తు చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవరంలో రూ.182 కోట్లతో ఇంకో మెడికల్ కాలేజీని కట్టాలని కేసీఆర్ జీవో ఇస్తే, ఈ ప్రభుత్వం అది రద్దు చేసి అల్వాల్ టిమ్స్‌లో కలిపారు. మేడ్చల్ జిల్లాలో ఒక్క మెడికల్ కాలేజీ లేకుండా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేసింది అని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరోగ్యశ్రీని రూ. 10 లక్షలకు పెంచాను అంటావు.. ఇవాళ ఆసుపత్రుల వాళు ృ మేము ఆరోగ్యశ్రీ కింద వైద్యం చేయము బంద్ చేస్తాము అని చెప్తున్నారు. నీ పాలన ఎలా ఉంది అంటే.. కాలేజీలు బంద్ చేస్తామని ప్రైవేట్ కాలేజీలు, ఆసుపత్రులు బంద్ చేస్తామని ప్రైవేట్ ఆసుపత్రులు చెప్తున్నాయి. ఆరోగ్యశ్రీకి కేసీఆర్ ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు నిధులు ఇచ్చి మంచి వైద్యం అందించాము.. కానీ నువ్వు వచ్చి రూ.1400 కోట్లు ఆరోగ్యశ్రీ కింద బకాయి పెట్టావు. ఇప్పటికైనా ఆరోగ్యశ్రీ నిధులు విడుదల చేసి.. పేదలకు వైద్యం అందే లాగా తక్షణమే చర్యలు తీసుకోవాలని ఈ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# అసోం గాయకుడు జుబిన్ మృతి

- విషం ఇచ్చి చంపారన్న ఆరోపణలు
- ఆ కోణంలో పోలీసుల దర్యాప్తు



గౌహతి, అక్టోబర్4 (జనంసాక్షి) : అస్సాంకు చెందిన ప్రముఖ గాయకుడు జుబీన్ గార్గ్ ఇటీవల సింగపూర్‌లో ప్రమాదవశాత్తూ మరణించిన సంగతి తెలిసిందే. ఆయన మృతిపై అనుమానాలు వ్యక్తమవుతోన్న వేళ ఈ కేసు కీలక మలుపు తిరిగింది. జుబీన్‌కు విషమిచ్చి ఉంటారని ఆయన బ్యాండ్‌మేట్ శేఖర్ జ్యోతి గోస్వామి సంచలన ఆరోపణలు చేశారు. గాయకుడి మేనేజర్, ఫెస్టివల్ ఆర్గనైజేషన్ ఈ కుట్రకు పాల్పడి ఉంటారని ఆరోపించారు. జుబీన్ మృతిపై అస్సాం పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో పలువురు సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేశారు. జుబీన్ బ్యాండ్‌మేట్ గోస్వామి కూడా విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగానే సంచలన ఆరోపణలు చేశారు. సింగపూర్‌లో జుబీన్‌తో కలిసి ఆయన మేనేజర్ సిద్దార్థ్ శర్మ ఒకే హోటల్‌లో ఉన్నారు. యాట్ ట్రిప్‌లో గాయకుడికి ప్రమాదం జరిగిన తర్వాత శర్మ తీరు అనుమానాస్పదంగా కన్పించింది. సముద్రం మధ్యలో ఆ విహార నౌకను మేనేజర్ బలవంతంగా తన నియంత్రణలోకి తీసుకున్నారు. అంతకుముందు మా అందరికీ డ్రింక్స్ తీసుకురావొద్దని అస్సాం అసోసియేషన్ (సింగపూర్) సభ్యుడు, ఎన్ఆర్ఐ తన్మోయ్‌కు చెప్పారు. సిద్దార్థ్ శర్మనే స్వయంగా డ్రింక్స్ తీసుకొచ్చారని గోస్వామి తన వాంగ్మూలంలో పేర్కొన్నారు. ఇక, జుబీన్ గార్గ్ మునిగిపోతున్న సమయంలోనూ శర్మ 'అతన్ని వెళ్లనివ్వండి' అంటూ అరవడం తనకు వినిపించిందని గోస్వామి వెల్లడించారు. గార్గ్ శిక్షణ పొందిన స్విమ్మర్ అని, తనతో పాటు ఎంతోమందికి స్విమ్మింగ్‌లో కోచింగ్ ఇచ్చారని పేర్కొన్నారు. ఆయన ఈత కొడుతూ నీట మునిగి చనిపోయే ఆస్కారమే లేదని అభిప్రాయం వ్యక్తంచేశారు. మేనేజర్ శర్మతో కలిసి ఈవెంట్ ఆర్గనైజర్ శ్యామ్‌కాను మహంత ఈ కుట్రకు పాల్పడి ఉంటారని గోస్వామి ఆరోపించారు. ఉద్దేశపూర్వకంగానే వారు జుబీన్‌కు విషమిచ్చి ఉంటారని అన్నారు. ఆ తర్వాత దాన్ని ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేసి ఉంటారని ఆరోపించారు. జుబీన్ నోరు, ముక్కు నుంచి నురగ వస్తున్నప్పుడు కూడా మేనేజర్ ఏమాత్రం కంగారు పడలేదని అన్నారు. వెంటనే వైద్య చికిత్స అందించకుండా ఆలస్యంగా చేశారని పేర్కొన్నారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే జుబీన్ మృతి కేసులో మేనేజర్ పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. ఆయనపై నాన్‌బెయిలబుల్ అభియోగాలు నమోదు చేశారు.

### పదేళ్లు ప్రభుత్వాసుపత్రులను

# భ్రష్టు పట్టించారు

- హరీష్ రావు వ్యాఖ్యలపై మండిపడ్డ ఆది శ్రీనివాస్

హైదరాబాద్, అక్టోబర్4 (జనంసాక్షి) : పదేళ్ల పాటు ప్రభుత్వాస్పత్రులను గాలికి వదిలేసి ఇప్పుడు మాకు పాఠాలు చెబుతున్నారని, ఎన్ని కుప్పిగంతులు వేసినా జూబ్లీహిల్స్ ప్రజలు హరీష్ రావు, కేటీఆర్‌లను పట్టించుకోరని ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ వ్యాఖ్యానించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల వాతావరణం దగ్గరపడుతున్న తరుణంలో బీఆర్ఎస్ నేత హరీష్ రావు చర్యలపై ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు సూపర్ స్పెషాలిటీ ప్రభుత్వ ఆస్పత్రులను ఎందుకు నిర్మించలేదో హరీష్ రావు సమాధానం చెప్పాలని ఆదిశ్రీనివాస్ అన్నారు. అధికారం పోవడానికి ఏడాది ముందు టిమ్స్ హాస్పిటల్ కోసం టెండర్లు పిలిచారు. కానీ మా ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి వీటిపై ప్రత్యేక దృష్టి సారించడంతో 90 శాతం నిర్మాణ పనులు పూర్తయ్యాయని అన్నారు. కొత్తపేట టిమ్స్ హాస్పిటల్ నిర్మాణం విషయంలో హరీష్ రావు ఆరోపణలు నిజం కాదని ఆయన తేల్చారు. విదేశాల నుంచి ఆధునిక వైద్య పరికరాలు రావాల్సి ఉండటంతో కొంత సమయం పడుతోంది. కానీ పేరు కోసం హడావుడిగా ప్రారంభం చేయాలని మాకు ఉద్దేశం లేదు. అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, సూపర్ స్పెషాలిటీ సౌకర్యాలతోనే ప్రజలకు అందించబోతున్నాం అని వివరించారు. ఉస్మానియా వర్షాల్లో మునిగిపోయినా బీఆర్ఎస్ పట్టించుకోలేదు. కానీ మా సీఎం గోషామహల్‌లో ఆధునిక సౌకర్యాలతో కొత్త ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టు సంస్థ ఇప్పటికే పనులు మొదలుపెట్టిందని చెప్పారు. అలాగే వరంగల్‌లో ఎంజిఎం ఆస్పత్రి నిర్మాణాన్ని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా పర్యవేక్షించినట్లు తెలిపారు. త్వరలోనే ఆ ఆస్పత్రిని కూడా ప్రారంభించబోతున్నాం. రాజీవ్ ఆరోగ్యశ్రీని మొదలు పెట్టింది కాంగ్రెస్ పార్టీనే. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా కోట్లాది రూపాయలను పేదలకు అందిస్తున్నాం అని గుర్తు చేశారు.

# జపాన్ తొలి మహిళా ప్రధానిగా తకైచి

- ఆమె ఎన్నికల లాంఛనమే అంటున్న పరిశీలకులు



న్యూఢిల్లీ, అక్టోబర్4 (జనంసాక్షి) : జపాన్‌కు తొలి మహిళా ప్రధానిగా తకైచి అరుదైన ఘనత సాధించనున్నారు. తాజా రాజకీయ పరిస్తితుల్లో ఆమె ఎన్నిక లాంఛనమే కానుంది. పార్టీలో అంతర్గత విభేదాల నేపథ్యంలో జపాన్ ప్రధానిగా ఉన్న షిగెరు ఇషిబా ఇటీవల తన పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో అధికార లిబరల్ డెమోక్రటిక్ పార్టీ అధ్యక్షురాలిగా సనై తకైచి ఎన్నికయ్యారు. ఈక్రమంలో తదుపరి ప్రధానిగా తకైచి బాధ్యతలు తీసుకునేందుకు మార్గం సుగమమైంది. దీంతో జపాన్‌కు తొలి మహిళా ప్రధానిగా తకైచి అరుదైన ఘనత సాధించనున్నారు. ఇటీవల దేశంలో జరిగిన ఎన్నికల్లో పార్లమెంటు ఎగువ సభలో అధికార పార్టీ మెజార్టీని సాధించలేకపోయింది. దీనికి ముందు దిగువ సభలో కూడా మెజార్టీ కోల్పోయింది. దీంతో ఇషిబాపై ఒత్తిడి పెరగ్గా.. ఆయన తన పదవికి రాజీనామా చేశారు. ఈక్రమంలోనే శనివారం పార్టీలో ఎన్నికలు జరగ్గా.. మాజీ ప్రధాని కుమారుడు షింజిరో కోయిజుమితో పాటు మరో ముగ్గురు అభ్యర్థులను ఓడించి తకైచి విజయం సాధించారు. ఇక, దేశ తదుపరి ప్రధానిని ఎన్నుకునేందుకు జపాన్ పార్లమెంటు అక్టోబరు 15న ఓటింగ్ నిర్వహించనున్నట్లు ప్రముఖ వార్తా సంస్థ తెలిపింది. తాజాగా మాజీ ప్రధాని కుమారుడు షింజిరో కోయిజుమిని ఆమో ఓడించారు. 64 ఏళ్ల తకైచి 1993లో పార్లమెంటుకు ఎన్నికయ్యారు. ఎల్‌డీపీలో ఆర్థిక భద్రత, అంతర్గత వ్యవహారాలు, లింగ సమానత్వ మంత్రితో సహా పలు కీలక పదవుల్లో పనిచేశారు. ఈ గెలుపు తనకు సంతోషం ఇవ్వడం కంటే.. బాధ్యతను పెంచిందని ఈసందర్భంగా తకైచి పార్టీ సభ్యులతో పేర్కొన్నారు.

# ఆటో డ్రైవర్ ఖాతాల్లో 15వేలు జమ

- ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామన్న సిఎం బాబు
- రోడ్ల గుంతలను పూడ్చడంతో ప్రమాదాలు నివారించామన్న పవన్

విజయవాడ, అక్టోబర్4 (జనంసాక్షి) : ఆటో డ్రైవర్లకు రూ.15వేలు ఆర్థిక సాయాన్ని ఎపి సిఎం చంద్రబాబు, డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ శనివారం ప్రారంభించారు. విజయవాడ సింగ్‌నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో జరిగే ఈ కార్యక్రమానికి ఉండవల్లి నుంచి ఆటోలో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ చేరుకున్నారు. అనంతరం రూ.15వేలు ఆర్థిక సాయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లకు ఎన్నో కష్టాలు ఉన్నాయన్నరు. ఆటో డ్రైవర్లందరికీ రూ. 15 వేలు ఖాతాల్లో జమ చేశాంమని ఆటో డ్రైవర్లకు ఇది నిజమైన పండగని అన్నారు. ఎవరూ ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. ఆన్‌లైన్‌లోనే డబ్బులు జమ అవుతాయని తెలిపారు. చెప్పినట్లు చేసే ప్రభుత్వం టిడిపి ప్రభుత్వమన్నారు. గతంలో రోడ్ల పరిస్థితుల కారణంగా ఆటో డ్రైవర్ల ఆదాయం అంతా వాహనాల మరమ్మతులకే ఖర్చయ్యేదని.. టిడిపి రోడ్లను బాగుచేయించామన్నారు. చెప్పిన రోజు చెప్పినట్లు పనిచేసే ప్రభుత్వం తమదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. విజయవాడలో 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకాన్ని చంద్రబాబు ప్రారంభించారు. లబ్దిదారులకు రూ.436 కోట్లను అందించారు. విజయవాడ ఉత్సవ్ బ్రహ్మాండంగా జరిగింది. ఓజీ సినిమా చూశారు.. దసరా పండగ చేసుకున్నారు. ఇవాళ ఆటో డ్రైవర్ల పండగలో ఉన్నాం. ఏ కార్యాలయానికి తిరగకుండా ఖాతాల్లో డబ్బులు జమ చేశాం. చెల్లింపులన్నీ ఆన్‌లైన్‌లోనే జరుగుతున్న సందర్భమిది. గత ప్రభుత్వం ఎవరినీ పట్టించుకోలేదు. 2024 ఎన్నికలు నా చరిత్రలో ఎప్పుడూ చూడనిది. 94 శాతం స్ట్రైక్‌రేట్‌తో గెలిపించారు. ఇప్పుడు మంచి ప్రభుత్వం మంచి పనులు చేస్తోంది. 15 నెలల మా పాలనలో ఎన్నో పథకాలు తీసుకొచ్చాం. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయింది. పింఛన్ల మొత్తాన్ని భారీగా పెంచి ఆదుకుంటున్నాం. పింఛన్ల కోసం రూ. 33 వేల కోట్లు ఖర్చు పెడుతున్న ఏకైక ప్రభుత్వమిది. ఇప్పుడు రోడ్లు బాగుపడ్డాయి.

# బీహార్‌లో ఎన్నికల సంఘం కమిషనర్ల పర్యటన

- పాట్నాలో అఖిలపక్ష నేతలతో చర్చలు
- ఒకేవిడత ఎన్నికలు నిర్వహించాలని కోరిన జెడియూ



పాట్నా, అక్టోబర్4 (జనంసాక్షి) : బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఎన్నికల సన్నద్ధతపై రెండ్రోజుల పాటు అధికారులతో సమీక్షించేందుకు ఎన్నికల ప్రధానాధికారి జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు వివేక్ జోషి, ఎస్ఎస్ సంధు శనివారం ఉదయం పాట్నా చేరుకున్నారు. తాజ్ హోటల్‌లో నిర్వహించిన అఖిల పక్ష సమావేశంలో పాల్గొన్నారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈసీఐ సీనియర్ అధికారులు, బిహార్ చీఫ్ ఎలక్టోరల్ అధికారి వినోద్ గుంజ్యాల్ పాల్గొన్నారు. రాష్ట్రంలో గుర్తింపు పొందిన 12 రాజకీయల పార్టీలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. ఎన్నికల నిర్వహణపై వారి అభిప్రాయలను ఈసీఐ అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో ఒకే విడతలో ఎన్నికలు నిర్వహించాలని తాము కోరినట్టు జేడీ(యూ) ఎంపీ సంజయ్ ఝా తెలిపారు. బిహార్‌లో శాంతిభద్రతల సమస్య కానీ, నక్సల్స్ సమస్య కానీ లేవనీ, మహారాష్ట్రలో ఒకే విడతలో ఎన్నికలు నిర్వహించిన తరహాలోనే బిహార్‌లోనూ ఎన్నికలు నిర్వహించాలని సమావేశంలో కోరామన్నారు. కాగా, ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీలు సంపూర్ణ సహకారం అందించాలని అఖిలపక్ష సమావేశంలో ఎన్నికల కమిషన్ కోరింది. మతసామరస్యం, పరస్పర గౌరవం చాటుకుంటూ ఎన్నికల పండుగలో పాల్గొనాలని, ప్రతి బూత్‌లోనూ పోలింగ్ ఏజెంట్లను నియమించుకోవాలని సూచించింది. ఓటర్ల జాబితా సవరణకు కమిషన్ తీసుకున్న చర్యలపై రాజకీయ పార్టీల ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఒక్కో పోలింగ్ స్టేషన్‌కు గరిష్ట ఓటర్ల సంఖ్య 1,200గా కమిషన్ నిర్ణయించడాన్ని స్వాగతించారు. ఛాత్ పండుగ పూర్తయిన తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని, ఇందువల్ల ఎక్కువ మంది తమ ఓటు హక్కును వినియోగించుకుంటారని కమిషన్‌కు తెలిపారు. సాధ్యమైనంత తక్కువ విడతల్లో ఎన్నికలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. కాగా, అసెంబ్లీ ఎన్నికల తేదీలను ఈనెల 6 లేదా 7వ తేదీన ఎన్నికల కమిషన్ అధికారికంగా ప్రకటించే అవకాశాలు ఉన్నాయి.

# ఆర్టీసికి దసరా బొనాంజా

- 110 కోట్ల ఆదాయం దక్కినట్లు వెల్లడి



హైదరాబాద్, అక్టోబర్4 (జనంసాక్షి) : బతుకమ్మ, దసరా పండగల సందర్భంగా టీజీఎస్‌ఆర్టీసీకి రూ.110 కోట్ల మేర ఆదాయం సమకూరినట్లు యాజమాన్యం ప్రకటించింది. ఈ సారి 7,754 ప్రత్యేక బస్సులు నడపాలని తొలుత నిర్ణయించినప్పటికీ.. ఆశించిన మేర ప్రయాణికులు లేకపోవడంతో 5,300 వరకు మాత్రమే తిప్పినట్లు అధికారులు వెల్లడించారు. ప్రత్యేక బస్సుల్లో ఈసారి 50 శాతం వరకు అదనపు ఛార్జీలను వసూలు చేశారు. గత ఏడాది ఇదే సీజన్‌లో 6300 ప్రత్యేక బస్సులు నడపగా.. రూ.114 కోట్ల ఆదాయం వచ్చింది. గత ఏడాదితో పోల్చితే.. ఈసారి సొంతూళ్లకు వెళ్లిన ప్రయాణికుల సంఖ్య తక్కువగా ఉందని, కొందరు ప్రైవేటు వాహనాలనూ ఆశ్రయించినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. తిరుగు ప్రయాణానికి సంబంధించి ఈనెల 5, 6వ తేదీల్లో రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపించాలని సంస్థ నిర్ణయించింది.

# బీసీ రిజర్వేషన్లపై సుప్రీంలో సవాల్

- స్థానిక ఎన్నికల్లో 50శాతం మించి రిజర్వేషన్లు
- సుప్రీంలో పిటిషన్ వేసిన వంగా గోపాల్ రెడ్డి




న్యూఢిల్లీ, అక్టోబర్4 (జనంసాక్షి) : తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలైంది. స్థానిక ఎన్నికలపై తెలంగాణ హైకోర్టు ఇటీవల ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ వంగ గోపాల్‌రెడ్డి సెప్టెంబరు 29న సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈనెల 6న పిటిషన్‌పై విచారణ జరపనుంది. తెలంగాణలో స్థానిక ఎన్నికలకు ఇటీవల నగారా మోగింది. ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ప్రకటించింది. మొత్తం ఐదు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. తొలి రెండు దశల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ.. మిగతా మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర ఎన్నికల కమిషన్ తెలిపింది. దీంతో ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలోని బీసీ రిజర్వేషన్ల అంశం రోజుకో మలుపు తీసుకుంటుంది. ఇప్పుడు తాజాగా రిజర్వేషన్ల అంశం సుప్రీకోర్టుకు చేరింది. 42 శాతం బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు అయ్యింది. తెలంగాణలోని స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతానికి మించి రిజర్వేషన్లు అమలు చేయబోతున్నారని వంగ గోపాల్ రెడ్డి పిటిషన్ సుప్రీంకోర్టులో వేశారు. 50 శాతానికి మించి రిజర్వేషన్లు అమలు చేస్తున్నారంటూ.. పిటిషన్‌లో చెప్పుకొచ్చారు. గతంలో సుప్రీంకోర్టు 50 శాతం రిజర్వేషన్ మించరదంటూ ఇచ్చిన తీర్పుకు విరుద్ధంగా.. రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ఉన్నాయని ఆరోపించారు. ఈ నేపథ్యంలో గోపాల్ రెడ్డి వేసిన పిటిషన్ సోమవారం విచారణకు రానుంది. జస్టిస్ విక్రమ్ నాథ్ ఆధ్వర్యంలో విచారణ కొనసాగనున్నట్లు సమాచారం. తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు గత ప్రభుత్వం తీసుకొచ్చిన రిజర్వేషన్లను ఎత్తివేస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లుకు అసెంబ్లీలో ఆమోదం తెలిపింది. దీనికి అన్ని పార్టీల నేతలు అంగీకారం తెలిపారు. ఆ తర్వాత వీటిని గవర్నర్ ఆమోదం కోసం రాజ్ భవన్‌కు పంపారు. అయితే ఈ బిల్లుకు గవర్నర్ ఇంకా ఆమోదం తెలుపలేదు. రిజర్వేషన్ల బిల్లుపై ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని.. తమ వద్దనే పెండింగ్‌లోనే ఉన్నాయని ఇటీవల రాజ్ భవన్ వర్గాలు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బీసీ బిల్లుపై సుప్రీంకోర్టులో పిటిషన్ పడటం రాష్ట్ర ప్రభుత్వానికి షాక్ అని చెప్పవచ్చు. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఏ తీర్పు ఇస్తోంది అనే దానిపై సర్వాత్ర ఉత్కంఠ నెలకొంది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370